


- గేయ రచన -
నండూరి రామమోహనరావు
... బొమ్మలు ...
బాపు

విశ్వసాహిత్యంలో వినోద విజ్ఞానాలకు విఖ్యాతి పొందిన విశిష్టగ్రంథం పంచతంత్రం. పంచతంత్రంలోని మొదటి నాలుగు భాగాలను లోగడ ఆంధ్ర వారపత్రికలో బొమ్మల కథలుగా లక్షలాది పాఠకులకు అందజేశాము. ఆ కథలకు ఏ విధంగానూ తీసిపోని అయిదవ భాగం "అసంప్రేక్ష్యకారిత్వం" [అనాలోచితముగా పనిచేయుట] బొమ్మల కథ త్వరలో సీరియల్ గా ప్రకటించబోతున్నాము. ఈ సీరియల్ కూడా మా పాఠకులను రంజింపచేయగలదని విశ్వసిస్తున్నాము.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 31
3-4-57

హేవిళంబి చైత్ర శుద్ధ తృతీయ బుధవారం

విషయానుక్రమణిక

కార్డు : కవరు

[ఏప్రిల్ 1 నుంచి]

		పాతధర		కొత్తధర
(1) కార్డు (లోకల్)	:	అర్ధణా	:	3 నయాపైసాలు
(2) రిప్లై కార్డు (లోకల్)	:	అణా	:	6 ,,
(3) మామూలు కార్డు	:	ముక్కాని	:	5 ,,
(4) రిప్లై కార్డు	:	అణాన్నర	:	10 ,,
(5) ఇన్లాండ్ కవర్	:	అణాన్నర	:	10 ,,
(6) మామూలు కవర్	:	బేడా	:	13 ,,

[పాత ఇన్లాండు కవరు, మామూలు కవరు వాడదలుచుకుంటే, వాటికి ఒక నయాపైసా స్టాంపు అంటించాలి]

హేవిళంబి ఉగాది

ఆంధ్ర దేశంలో అంతటా మళ్ళీ కొత్త ఉగాది వచ్చింది.

ఈ ఉగాది 'హేమలంబ' అని కొందరు, 'హేవలంబ' అని కొందరు 'హేవిళంబి' అని మరికొందరు అంటున్నారు.

ప్రాచీన గ్రంథాలలో చాలా చోట్ల 'హేమలంబ' అని కనబడుతూంది. వ్యవహారంలో 'హేవిళంబి' అంటున్నాము. మరి కొందరు 'హేవళంబ' అనడంకూడా కద్దు.

ఏదిఏమయినా కొత్త ఉగాది సమీపించే సరికి మన రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం అంతా సమాప్తమయిపోయింది. ఈ ఎన్నికలలో కొంత పాతనీరు పోయి కొంత కొత్తనీరు వచ్చింది. ఏలాగతా ఆంధ్ర ప్రదేశంలో సుస్థిరమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడే గట్టిసూచనలు కనిపిస్తున్నాయి. అందుచేత మనరాష్ట్ర రాజకీయాలిప్పటినించీ నిమ్మకు నీరెత్తినట్టు గుట్టుగా సాగిపోవచ్చును.

విద్యార్థులలో చాలామంది కీఉగాది నాటికి పరీక్షలన్నీ అయిపోతాయి. మిగిలిన వారికి చదువులసందడి చాలావరకు తగ్గిపోతుంది. మొత్తంమీద విద్యార్థు లందరు వేసంకాలం సెలవుల కోసం ఉత్సాహంలో ఉరకలు వేస్తూ ఎదురుచూచేకాలమిది.

రైతుల కందరికీ ఇది బాగా విశ్రాంతి కాలం. ఇక పల్లెపట్టులలోను, పట్టణాలలోను. అందరు కొత్తఉగాది పండుగ సందడిలో పడతారు.

మనవారందరికీ ఉగాది చాలా పెద్ద పండుగ. ఎక్కడెక్కడివారు ఆనాటికిళ్లకు చేరుకుంటారు.

ఎంతటి వృద్ధులైనా ఆనాటినించీ ఏవేవో ఘనకార్యాలు చేయాలని నిశ్చయించుకుంటారు. అవి సంవత్సరాంతం దాకా అమల్లోపెట్టే ఘనులు కొందరంటారు. అవన్నీ ఆమర్నాడే మరిచిపోయే మహాత్ములు ఉంటారు.

కొత్తవేపపూవు, కొత్త మామిడి పిందెలు, కొత్త చింతపండు మేళవించిన ఉగాది పచ్చడిలో మన జీవితాలకష్టసుఖాల రహస్యం అంతా ఇమిడి ఉన్నదని సంప్రదాయవేత్తలు కొందరేవేవో అంతరార్థాలు తీస్తారు.

శాలివాహనశకం: ఇంకొక ఉగాది

మొన్న మార్చి 23 వ తేదీనాడు భారత దేశం అంతటా ఇంకొక ఉగాది ప్రారంభమైంది.

మనదేశంలో ఆంగ్లప్రభుత్వం బాగా పాతుకుపోయినప్పటినించీ ఇంగ్లీషు నెలలు, తేదీలు వాడడం ఒక పరిపాటిగా తయారయింది. అదీగాక దేశంలో ప్రాంతానికొక పంచాగం అమలులో ఉంది.

ఆంధ్రులు చాంద్రమానంతో వ్యవహరిస్తారు. తమిళులు సౌరమానంతో వ్యవహరిస్తారు. అందుచేత మన సంవత్సరాదీ వారి సంవత్సరాదీ కొంచెం భేదిస్తాయి. ఉత్తరాదిని బార్హస్పత్యమానం వాడుతున్నారు.

విదేశీ ఇంగ్లీషు పంచాంగానికి బదులుగా భారతప్రభుత్వం జాతీయ పంచాంగం తయారుచేయించాలని నిశ్చయించినదానికొక ప్రత్యేకసంఘం ఏర్పాటుచేసింది. ఆ సంఘం సూచనలప్రకారమే ప్రస్తుతం శాలివాహన శకపంచాంగం తయారుచేశారు.

శాలివాహన శకం

శాలివాహనశకం చాలా కాలంనించీ మన దేశంలో అమలులోఉంది. ప్రస్తుత క్రీస్తుశకం 78 లో ఈ శాలివాహన శకం ప్రారంభించింది. మన శాసనాలలోను, ప్రాచీన గ్రంథాలలోను చాలాచోట్ల ఈ శాలివాహన శకమే వాడారు. కనుకనే ఈ శకమే భారత దేశంలో అంతటా అమలులో పెట్టారు.

ఆంధ్రశకం

ఈ శాలివాహన చక్రవర్తి ఆంధ్ర శాతవాహన వంశానికి చెందినవాడు. ఒకవిధంగా ఆలోచిస్తే శాలివాహనశకం ఆంధ్రజాతి శకం. ఇది మొన్న మార్చి 22 వ తేది అర్ధరాత్రివేళ ప్రారంభం అయింది.

అంటే మార్చి 23 వ తేదీ శాలివాహన శకంలో చైత్రశుద్ధ పాడ్యమి అన్నమాట. శాలివాహన శకం ప్రకారం మొన్న మార్చి 22 వ తేదీ రాత్రి 12 గంటలకు 1880 వ సంవత్సరం ప్రారంభించింది. దాని ప్రకారం మనకందరికీ ఆ వేళ ఇంకొక ఉగాది వచ్చింది.

విషువదినం

శాలివాహన శకం విషువదినంతో ప్రారంభిస్తుంది. విషువదినం అంటే రాత్రింబవళ్ళు సరిగా సమానమైన రోజన్న మాట.

హేవిళంబి ఉగాది

ఆర్. శ్రీమన్నారాయణశర్మ

శ్రీకరమై శోభనముల
కాకరమై వెలయు నూత
నాంధ్రదేశమునకు అది
గావచ్చిన దీ 'ఉగాది.'

భేదగుణము పాటింపక
చేదు తీపి వగరు పులుపు
'పచ్చడి' సేవించ మనము
ప్రవేశించె నీ 'ఉగాది'

వనస్పతుల నవపల్లవ
పత్రపుష్ప ఫలవైభవ
మొదవించెను; ముగ్ధమోన
మధుమాన మ్మీ 'ఉగాది'

ఒగరు మావి చిగురుమేసి
పొగరున కోయిల వచించు
'స్వాగత గీతములు' వినుచు
నేగుదెంచె నీ 'ఉగాది'

దొర్లిన తన కాలమునకు
'దుర్ముఖి' విముఖత చలింప
సుముఖత్వము "హేవిళంబి"
చూపించినదీ 'ఉగాది'

హేవిళంబి ఉగాది

★

మన శాలివాహనశకంలో మాసాల పేర్లన్నీ పూర్వం మాదిరిగానే అంటే చైత్ర వైశాఖాలపేర్లతోనే ఉంటాయి. అయితే చైత్ర వైశాఖాది మాసాలలో కొన్నింటికి 30 రోజులు, మరి కొన్నింటికి 31 రోజులు ఉంటాయి. లీపు సంవత్సరంలో చైత్రానికి ప్రత్యేకంగా 31 రోజు లుంటాయి. మిగిలిన సంవత్సరాలలో 30 రోజులే ఉంటాయి. ఇక మిగిలిన వైశాఖ, జ్యేష్ట, ఆషాఢ శ్రావణ, భాద్రపద మాసాలకు ఖచ్చితంగా 31 రోజులుంటాయి.

ప్రభుత్వ వ్యవహారం

ఇకనించీ భారతప్రభుత్వ వ్యవహారంలో శాలివాహన శకము, దానికి సంబంధించిన మాసాలు, తేదీలు వాడతారు. వీటితో పాటింకా కొంతకాలందాకా ఇంగ్లీషు తేదీలుకూడా వాడుతూంటారు. ఇంకా కొంతకాలానికి క్రమక్రమంగా శాలివాహన శకమే అన్ని రంగాలలోను అమలులోకి వస్తుంది.

పండుగలు

అయితే మనకు ప్రస్తుతం అమలులో ఉన్న పండుగలు మొదలైనవాటిల్లో మాత్రం మార్పేమీ ఉండదు. ఇవి మన పాతపంచాంగాల ప్రకారమే వస్తూ పోతూ ఉంటాయి.

తెలుగువారి శకం

మళ్లీ మనదేశంలో అంతటా శాలివాహన శకం ప్రారంభించడం ఆంధ్రజాతికి ప్రత్యేకంగా గర్వకారణం. ఈ శక ప్రారంభంతో ఆంధ్రజాతిశకం తిరిగిందని అనవచ్చునేమో!

భారతప్రధాని శుభాకాంక్షలు

మొన్న మార్చి 23వ తేదీ శాలివాహన శకం ప్రకారం దేశానికంతటికీ సంవత్సరాదిగా భావించి భారతప్రధానికి భారతీయు లందరికీ శుభాకాంక్షలందజేశారు. ఆ సందేశంలో దేశంలో వివిధ ప్రాంతాలలో అమలులో ఉన్న పంచాంగాలన్నీ క్రమంగా ఒకే రూపు దాల్చగలవని ఆశిస్తున్నామని అన్నారు. ఈ పరిణామం భారత జాతీయైక్యతకు చాలా అవసరం. త్వరలోనే ఇది ఆచరణలోకి రాగలదని ఆశిస్తున్నాము.

మేమీ నూతన హేవిళంబి సంవత్సరాదికి మా పాఠకులందరికీ శుభాకాంక్షలందిస్తున్నాము.

★

నాణెముల చరిత్ర

"నాణ్య తెరిగి వర్తనం-వదాన్య తెరిగి వర్తనం" అన్నారు పెద్దలు. నాణ్యతఅనగా విలువగలది, నాణెము అనగావిలువఅనిఅర్థము.

ఏ దేశమునకైనా దాని భౌగోళిక, చారిత్రక విషయాలు తెలుసుకోవాలన్నా, అప్పటి ప్రజల సామాజిక జీవితాన్ని అర్థం చేసుకోవాలన్నా నాణెములు పరిశీలించటం అవసరం. ఇలా నాణేలను పరిశీలించేవారు వాటియొక్క స్థితిగతుల్నిబట్టి, రూపురేఖల్ని బట్టి, తరగతులుగా విభజించి వాటి తాలూకు ప్రాచీనతను నిర్ణయిస్తారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలోను, ఇంకా యితర ఐరోపా దేశాలలోను నాణాలు పరిశీలించువారు 2,500 మంది వరకు వున్నారు. వాళ్ళకి నాణేలు సేకరించడం, వాటిని పరిశీలించడం మొదలైనవి వినోదం.

వాషింగ్టన్‌లో వున్న "న్యూ నేషనల్ మ్యూజియమ్"లో 47,000 నాణెములు సేకరించబడ్డాయి.

ఒక చికాగో వ్యక్తి ఒక లక్షకుపైగా నాణేలను సేకరించేడని, అతని తదనంతరం అతనివారసులు వాటిని లక్షడాలర్లకు అమ్ముకున్నారని చెప్తుంటారు.

నాణేలలో కొన్ని బైబిలులో చెప్పబడినంతటి పురాతనమైనవి కూడా వున్నాయి.

అలాగే మనకు మనువు, పాణిని కూడా పేర్కొన్నట్టి "కర్షపణం" అనబడే ప్రాచీన రాగినాణేలు ఉంటూండేవి.

అసలు నాణేల ముద్రణకు పూర్వం జనులలో వస్తుమారకం ఆచారంగా ఉంటూండేది. తాము పెంచే పశువులనుగాని, తాము పండించే ధాన్యాల్నిగాని, మారకంగా యిచ్చి తమకుకావలసిన వస్తువులను యితరులదగ్గరనుంచి తీసుకుంటూ ఉండేవారు. కాని క్రమంగా జాతి, జాతితోబాటు నాగరకత పెరిగేసరికి భారీయెత్తున వ్యాపారం చేయడం, వ్యాపారరీత్యా దూరదేశాలకి, విదేశాలకి వెళ్ళేటప్పుడు ఒక్కొక్కప్పుడు వస్తుమారకం ఇబ్బంది కావడాన్ని నాణేలు ముద్రించడం అవసరం అయింది.

అయితే నాణేలు ముద్రణ జరిగినప్పటికీ, విదేశాలలోనే ద్రవ్యమారకం, స్వదేశంలో మాత్రం వస్తుమారకం ఉంటూండేది.

వస్తుమారకంగురించి "ప్రాలేడు మానెకలకు దైలము మానెడు పురమ్ముధారణ" అని ఏడు మానెకల బియ్యానికి ఒకమానికె నూనె అప్పటి బజారుధరగా 'కేయూరబాహు చరిత్ర'వల్ల బోధపడుతున్నది. కాని నాణాలు విరివిగా వ్యాప్తిలోకి వచ్చినదగ్గర్నుండి విదేశాలలోనే కాకుండా, స్వదేశంలోనూ ద్రవ్యమారకం సాగించ మొదలు పెట్టారు.

అలా ఆదిలో పశుసంపద ధాన్యసంపద మాత్రమే ధనంగా భావించే మానవజాతి నాగరకత పెరిగి నాణేలు ముద్రించడం మొదలు పెట్టేకనే కాబోలు, బహుశా పశువులను పశుసంపద, ధాన్యాల్ని ధాన్యలక్ష్మి, నాణేలని ధనలక్ష్మి అనీన్నీ, ఈ మూడింటి మొత్తాన్ని సంపద అనీన్నీ భావించడం మొదలుపెట్టిందేమో!

నాణేలు క్రీ॥ పూ॥ 2000 సంవత్సరాల పైచిలుకు కాలంనుంచి వాడుకలో ఉంటున్నప్పటికి, క్రీ॥ పూ॥ 2075 నుంచి 700 వరకు నాణాలనుగురించిన వివరాలేమీ కానరాకపోవడాన్ని క్రీ॥ పూ॥ 7 వ శతాబ్దినుంచి అవి యెక్కువగా వ్యాప్తిలోనికి వచ్చినట్లుగా తెలుస్తోంది.

క్రీ॥ పూ॥ 7 వ శతాబ్దంలో ఆసియా మైనరులో "స్టాటర్" అనే నాణెం మొదటి సారిగా ముద్రించబడినట్లు తెలుస్తోంది. వెండిబంగారాలు కలిసిన ఒక లోహపుముక్కలో తయారుచేసిన నాణాన్ని 'ఎలక్ట్రిమ్' అంటారు. వాటిమీద వున్న ముద్రకూడా మోటుగానే ముద్రించబడి ఉండేది. చీనాదేశీయులుకూడా ప్రాచీనకాలంనుంచి నాణేలు ముద్రించుతున్నారని చెప్పుకోవచ్చు. లైడియా, పర్షియా, గ్రీసుదేశాల యీ ప్రాచీన నాణేలన్నీ దళసరిగల మోటైన గుండ్రటి లోహపు ముక్కలే.

కోరింథియన్లుమాత్రం చదునైన వెండి నాణేలు ముద్రించేరు. కాని అవి అకారణంగానే వాడుకలోంచి తప్పిపోయాయి. ఒక్క హిందూదేశంలో మాత్రమే నియమితమైన బరువుతో చక్కని ముద్ర కలిగిన చదునైన నాణేలు ముద్రించేవారు. ఈ నాణేలు బుద్ధసూత్రాలలో "పురాణములు" అని చెప్పబడినంతటి పురాతనమైనవి. అవి బుద్ధుని కాలంలో చలామణీలో నున్నట్లున్నూ క్రీ॥ పూ॥ 600-543 నాటికి వాడుకలో నున్నట్టున్నూ జాతకకథలద్వారా తెలుస్తూంది. ఐతే యీ నాణేలు ముద్రించడం ఒకర్నిచూసి నేర్చుకున్నది మాత్రం కాదు.


మొట్టమొదటి సారిగా నాణేలు ముద్రించడం ప్రారంభమైన తరువాత గ్రీకులవల్ల ఆ ముద్రణ బాగా వ్యాప్తిలోకి వచ్చిందని చెప్పవచ్చు. వాళ్ళ నాణేలమీద శిల్ప, వాస్తు, దైవిక, మతైక విషయాలకు సంబంధించిన బొమ్మలు ముద్రిస్తూ ఉండేవారు. అలాగే మన విజయనగర నాణేలమీద వరాహము, హనుమంతుడు, గరుడుడు, ఎద్దు, ఏనుగు, ఉమామహేశ్వర్లు, వెంకటేశుడు, బాలకృష్ణుడు, దుర్గ, లక్ష్మీనారాయణులు, రాముడు, శంఖచక్రాలు లాంఛనాలుగా ముద్రించేవారు.

క్రీ॥ పూ॥ 2 వ శతాబ్దంలో హిందూదేశ



సందేశం

"దేశానికి, ప్రజలకు ప్రయోజనం లేనిదే ప్రభుత్వం ఏ మార్పునూ చేయదు. పాతనాణాలస్థానే కొత్త వాటిని ప్రవేశపెట్టడం తప్పనిసరి అయింది. వీటి అమలు ఎంత ఆలస్యమైతే దేశానికి అంత నష్టం. గజిబిజిగా వుండే నాణాల పద్ధతివల్ల, కొలతల తూనికల పద్ధతివల్ల అనేక అనవసర వ్యయప్రయాసలకు లోనుకావలసి వస్తుంది. నాణాలలో దశాంశపద్ధతిని ప్రవేశపెట్టడం విదేశీపద్ధతిని అవలంబించడ మనిపించుకోదు. భారతదేశం సున్నాను కనిపెట్టి అంకెల విశిష్టతను ప్రపంచానికి చాటింది. భారతీయుల కృషి ఫలితంగానే దశాంశపద్ధతి రూపొందింది. నాణాలలో దీని ప్రయోజనాన్ని ప్రజలు త్వరలోనే గ్రహిస్తారు. దీన్ని విజయవంతంగా అమలు జరపడంలో ప్రజలు సహకరించాలి" అని ప్రధాని నెహ్రూ అర్థిస్తున్నారు.



(1) 8-వ శతాబ్దంలో వేంగిరాజ్యం పాలించిన 3-వ కుబ్జవిష్ణువర్ధనుడినాటి రాగినాణెం. (ముందు వెనుకలు)

(2) 11-వ శతాబ్దంలో రాజరాజు కాలంనాటి రాగినాణెం. (ముందు వెనుకలు)

(3) (4) ఈస్టిండియా కంపెని రోజులలో చలామణిలోకి వచ్చిన అరకాని; కానీ (రాగి) నాణాలు.

(5) టిప్పుసుల్తాన్ నాటి మైసూరు నాణాలు.

(సేకరణ: ఆర్. కె. మాధవ్, బందరు)

నాణెముల చరిత్ర

వాయవ్యభాగాన్ని పాలించిన గ్రీకులవల్ల హిందువులు వెండిబంగారు నాణేల ముద్రణ నేర్చుకున్నట్లుగా చెప్తారు. కాని, మనకి శ్రీరాములు పాలించిన కాలంలో 'రామమాడలు' ముద్రించబడిన సంగతి అందరికీ తెలిసిన విషయమే కదా! క్రీస్తుకి కొద్దిపాటి ముందువెనుకలుగా హిందూదేశంలో దక్షిణాపథాన్ని పాలించిన ఆంధ్రుల నాణేలు ఒక రకమైన విశిష్టతను కలిగియుండేవి.

ఆంధ్రుల ప్రాచీన నాణేలలో కొన్నిటి మీద ఓడబొమ్మ కూడా ఉంటూ వుండేది. ఇందువల్ల వాడరేవు, మోటుపల్లి (గుంటూరు జిల్లా) రేవునుంచి ఆంధ్రులు ఓడవ్యాపారం విరివిగా చేసేవారని చరిత్రవల్ల తెలుస్తున్నది. హిందూ రాజులు వెండిబంగారు నాణేలు బాగుగా ప్రచారం చేశారు. రాగినాణేలు కూడా ముద్రించేవారు కాని రాగి బరువైనలోహముగుటవలన చిన్న నాణేలుగా మాత్రమే దానిని ఉపయోగించేవారు. మనకి కావ్యాలలో కనిపించే నాణేలు రూక, పసిడిటంకము, టంకము, దీనారటంకము, గద్దె, గెర, పాతికపరక, వరాహము (వరహా), మాడ, మినుకు, కాసు, వీసము మొదలైనవి.

ఆకాలంలో క్రయవిక్రయాలకి నాణేలతోబాటు నవరత్నాలనికూడా వాడేవారని ఈనాటికీ మనకి వినిపించే:

"చాటలో చారెడు ముత్యాలుపోసి
రాజమ్మ కొన్నది రంగులుయ్యాల"

వంటి జానపదగేయాలద్వారా బోధపడుతుంది.

"గోరంత దీపమ్ము కొండెల్ల వెలుగు
గోపాలకృష్ణుండు మందెల్ల వెలుగు
మాడంత దీపమ్ము మేడెల్ల వెలుగు
మాయింట అబ్బాయి మాకెల్ల వెలుగు"

వంటి జానపద గేయాల్లో కూడా మన ప్రాచీన నాణాలు విన్పిస్తూవున్నందునను, ఈనాటికీ పెళ్ళిళ్ళలో 'మరదలుమాడ' "హారతి వరహా" అనే పేర్లు విన్పిస్తున్నందునను వాటి విశిష్టత వేరే చెప్పనక్కరలేదు.

అంతేకాకుండా ఆకాలంలో స్త్రీలు నాణేలను నగలుగా ధరించేవారని 'కాసుల పేరు,' 'వరాలపేరు' (వరహాలపేరు లేక వరాహాపేరు) నాను మోరు (మొహిరీ) మొదలయిన నగల్ని బట్టి ఊహించవచ్చు.


శ్రీనాథుడు చెప్పిన 'దీనారటంకము' లని టంకములు కాశ్మీరదేశములో అవంతివర్మ పాలనలో వాడుకగా ఉండేవి. తర్వాత దేశ వ్యాప్తి పొందినవి.

(61-వ పేజీ చూడండి)



ఉగాది పచ్చడికోసం...."

బుడుగు



చిచ్చుల పిడుగు

ఓ సీగానపెసూనాంబా. ఇపుడే మోనూ మరేమోనూ కొత్త సమ్మత్సరం వచ్చిందిగదా. నేను కుంచెం ఇపుడు పంచాంగం చెపుతానుగదా.

మరేమో బామ్మ మళ్ళీ కళ్ళజోడు వెతుక్కుని నాదగ్గిర లాక్కుని వెళ్ళిపోతుంది. అందుకని చప్పున రా.

ముందస్తుగా ఏమిటంటే యీ కొత్త సమ్మత్సరంలో మనకి కొత్త కాణీలు వచ్చాయి. ఇవి అస్సలు దంబిడీలు అనుకో. కాని మనం కాణీలు అని అబద్ధం చెప్పాలిట.


ఇలాటి అబద్ధం చెప్పినా తప్పు కాదుట. ఇలాని నాన చెప్పాడులే.

మరి ఈ దంబిడీకాణీకి యేం రాదుట తెలుసా. పకోడీలూ రావు అయిసు ఫ్రూటులూ రావు, జెట కాలూ రావు, ఆఖరికి రైలింజనులు కూడా రావు. యేమీరావు.

అందుకని ఇంక కొత్త సమ్మత్సరంలో చిన్నపిల్లలు (నేను కాదులే) అమ్మా కాణీయే అనకూడదు. అమ్మా పదికాణీలే అని చెప్పాలి. లాపోతే ఛాలాకష్టం. ఒక్క కాణీ ఏనా మూడుకాణీలేనా అడిగితే ఏం రాదుగా.

మళ్ళీనేమో లావుపాటి పక్కింటి పిన్నిగారి ముగుడిని ఒక్కరాయితో కొట్టితే ఒక్క కాణీయే ఇస్తాడుగదా. అందుకని పదిరాళ్ళతో కొట్టాలి.





'హే! హే! హే! హేవిళంబి ఫూల్!'

వాడు బీడీలు కాలచలేదని లావుపాటి పిన్నిగారితో పదిసార్లు అబద్ధం చెప్పాలి. ఒక్కసారి చెప్పితే ఒక్క కాణీయే ఇస్తాడు వాడు. అందుకూ.

ఏం చేస్తాం మరి.


ఇగో మరే లావుపాటి పక్కింటి పిన్నిగారు ఇంకా లావుపాటి అయిపోతుందిట. నేను రేపో మూడ్రోలుకో అడిగానులే.

నా యిష్టం, ఇంకా లావుపాటి అయిపోతాను నీకెందుకు అని ప్రైవేటు చెప్పేసింది. అదీ సంగతి.

కొత్త సమస్తరంలో మా బాబాయి, మీ బాబాయి ఇంకా బోల్డు బోల్డు బాబాయిలు బోల్డు పెద్ద చొక్కాలు తొడుక్కోరుట. కుంచెం కుంచెం చొక్కాలు అంటే నా అంత చొక్కాలు తొడుక్కుంటారుట. దానిమీద బొమ్మలు కూడా ఉంటాయేం, అవే.

'మా బాబాయి నిన్నో రేపో ఇంత కుంచెం చొక్కా తొడుక్కున్నాడులే. అపుడు బొమ్మ కోపం జేసింది ఎందుకురా బుడుగు గాడి చొక్కా తొడుకున్నావు అందిగదా.

ఇది బుడుగుదికాదూ నాదేనూ ఇంకట్నించీ అందరూ ఇలాటి నయా చొక్కాలే తొడుక్కుం





బొంబాయి నాటకోత్సవాలలో చింతామణిగా రాజేశ్వరి, చిత్రలేఖగా సత్యవతి.

బొంబాయి ఆంధ్ర మహాసభ నాటకోత్సవాలు

★

బొంబాయి ఆంధ్ర మహాసభ ఆవరణలో నెలకొల్పిన 'ఓపెన్ ఎయిర్ థియేటర్'కు మార్చి మూడోవారంలో శ్రీ పృధ్వీరాజ్ కపూర్ ప్రారంభోత్సం జరిపారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ 'ఆంధ్రమహాసభ' అధ్యక్షుడు శ్రీ వి. ఆర్. స్వామి ఇక్కడ మార్చి 16 నుండి ఒకవారం రోజులు ఆంధ్ర నాటకోత్సవాలు జరిపారు.

ఆంధ్ర నాటకరంగమున ప్రసిద్ధికెక్కిన 'తారాశశాంకం', 'చింతామణి', 'కురుక్షేత్రం', 'వీరబొబ్బిలి', 'పాదుక' నాటక పంచకాన్ని శ్రీరాజరాజేశ్వరీ నాటకమండలి వారు ఈ ఉత్సవాలలో ప్రదర్శించారు.

ఆంధ్ర రంగస్థల నటీనటమండలి యావత్తూ (ప్రస్తుత చలనచిత్ర నటులు శ్రీ రేలంగి వెంకటరామయ్య సహా) వచ్చి ఈ విధంగా నాటకాలు ప్రదర్శించడానికి ఇక్కడ ఇదే తొలిసారి. [ఒక విలేఖరి]



ఆంధ్రమహాసభ నాటకోత్సవాల సందర్భంలో రాజరాజేశ్వరి నాట్యమండలివారి 'చింతామణిలో' సుబ్బిశెట్టిపాత్ర ధరించిన రేలంగి.

★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★

టాహా అని చెప్పాడు బాబాయి. నయా చొక్కాలంటే నాకు తెలీదు.

ఓ సీగానపెసూనాంబా ఇంకట్నించి నువ్వు మూడుజెడలో ప్ఫది జెడలో వేసుకుంటావు తెలుసా.

రెండు జెడల సీతలందరూ కొత్త సమ్మత్సరంనించి మూడు జెడలు వేసుకుంటారులే. ఇప్పుడే కుంచెం ధాలామంది అలా వేసుకుంటున్నారుగా అందుకని.

ఇంక పాపం చిన్నచిన్న పిల్లలు లేరూ.—నా అంతంత వాళ్లు. నేను కుంచెం పెద్దవాడినే అనుకో.

యేం? ఈ చిన్న చిన్న పిల్లలందరూ జాగర్తగా ఆడుకోవాలి. లాకపోతే ఘుబుకున బళ్లో పడిపోతారు అంతే.

అందుకని అల్లరి ఛాలా చెయ్యకుండా కుంచెం అప్పుడప్పుడు చదువుకుంటాను అని బయపెట్టాలి. అలా చేస్తే అమ్మా నానా మన్ని బళ్లో పడెయ్యరు.

ఇది కుంచెం ఛాలా కష్టం అనుకో. మనం ఎంత అల్లరి చెయొద్దురా బుడుగూ అని చెప్పినా వాడు మనమాట వింటంలేదుగదా ఎలా?

(ఎలాగంటే మరేమో,)



పార్లమెంటు ఆఖరి సమావేశం

శ్రీకృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

పార్లమెంటు ఆఖరి సమావేశం ['లేమ్‌డక్'] ఇటీవల ప్రారంభమైంది. ఇది నిజానికి బడ్జెట్ సమావేశం. రెండవరోజునసే సాధారణబడ్జెట్, రైల్వేబడ్జెట్ రెండూ నివేదించడం జరిగింది. బడ్జెట్ పై ప్రసంగిస్తూ ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి కొన్ని ప్రధాన విషయాలు తెలిపారు. 1956—57 సం॥ పురివైజ్డ్ అంచనాలను మించి రూ. 41.78 కోట్లు పౌరశాఖలపద్దు క్రింద అదనంగా వ్యయమైందని ఆయన అన్నారు. అభివృద్ధి, సంఘసంక్షేమం, జాతీయనిర్మాణం మొదలైనవానికే ఎక్కువగా ఈఆదనపువ్యయం జరిగిందనికూడా ఆయన తెలిపారు.

సాంస్కృతిక ప్రతినిధి వర్గాలను ఇతర దేశాలకు పంపించడానికి, రప్పించడానికి రూ. 21, 80, 000 ఖర్చు అయింది, ఎలిమెంటరీ, బేసిక్ విద్య, స్త్రీలబేసిక్ విద్య, ఆడియోవిజువల్ విద్య, గ్రంథాలయాభివృద్ధి, చదువుకున్న నిరుద్యోగులకు సహాయనిమిత్తం రాష్ట్రప్రభుత్వాలకు గ్రాంట్లు రూ. 5, 20, 00, 000.

సెకండరీవిద్య, గ్రామాల్లో ఉన్నత విద్య, వికలాంగులకు, బాలనేరస్థులకువిద్య నిమిత్తం రాష్ట్రప్రభుత్వాలకు గ్రాంట్లు రూ. 4, 25, 00, 000.

ఉపాధ్యాయులకు జీతాలస్కేళ్ళను పెంచేనిమిత్తం రాష్ట్రాలకు గ్రాంట్లు రూ. 2, 00, 00, 000 విద్యాకార్యక్రమం పరిశీలనకు రూ. 15, 00, 000.

బేసిక్ పాఠశాలానంతర విద్యకు రూ. 8,00,000.

బేసిక్, సంఘ సంక్షేమవిద్యా రంగాలలో స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలకు రూ. 12,00,000.

వ్యవసాయ విద్య తరగతులను ప్రవేశపెట్టడానికి రూ. 10,00,000. హిందీ ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడానికి రూ. 7,00,000. జాతీయ క్రమశిక్షణ తరగతులను ఏర్పరచడానికి రూ. 7,00,000. స్కౌట్లకు, గైడ్లకు రూ. 6,00,000. విద్యార్థుల ఆరోగ్య కేంద్రాలు రూ. 5,00,000. కార్మిక, సంఘసంక్షేమ శిబిరాలకు, కాంపస్ వర్క్ ప్రాజెక్టులకు రూ. 60,00,000 గ్రామాల్లో ఉన్నత విద్యకు రూ 30,00,00 సెకండరీ విద్యారంగంలో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు రూ.15,00,000 వ్యాయామవిద్యకు రూ. 8,00,000 ఆటలకు రూ. 20,00,000 యువజన సంక్షేమ కార్యక్రమం, విజ్ఞాన యాత్రలకు రూ. 11,00,000 అఖిలభారత సెకండరీ విద్యాసంఘానికి రూ. 35,00,000 మూడుజాతీయఅకాడమీలకు రూ.9,00,000 బాలభవనానికి రూ. 8,00,000.

సంఘ సంక్షేమ సంస్థ విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. 1957-58 సం॥పు కార్యక్రమం ప్రకారం సంఘ సంక్షేమ రంగంలో స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలకు గ్రాంట్లు, సంక్షేమ విస్తరణ కార్యక్రమానికి, సంక్షేమ కేంద్రాల భవనాలకు, రాష్ట్రాలలో సంక్షేమ సలహా సంఘాలకు, గ్రామసేవికల తర్ఫీదుకు, ప్రచారపుకార్లకు గ్రాంట్లు అన్నీ కలిపి రూ. 1,25,00,000.

భారత దేశంలో విద్యనభ్యసించగోరే ఆసియా, ఆఫ్రికా, కామన్వెల్తు దేశాల విద్యార్థులకు ఉచిత వేతనాలు రూ. 13,76,000

ప్రభుత్వాదాయాన్ని క్రమంగాఅభివృద్ధి చేయాలని ఆర్థికమంత్రి తెలిపారు. అంటే ఎటేటాపన్నులుఇంకా పెరుగుతాయనమాట.

ఆదాయం పరిమితంగానేఉందిగనుక, ముందు ప్రధానవిషయాలకే ఖర్చు కేటాయించి తరవాత అప్రధానమైనవాటికి కేటాయించాలని ఆయనఉద్ఘాటించారు. అయినే పైనచ్చిని జాబితాలోని అంశాలన్నీ ప్రధానాంశాలేనా అని సందేహంవస్తోంది. భారతీయ చారిత్రక పరిశోధనసంస్థ ఏమంత ప్రధానాంశమని దానికి ఈ ఏడాది బడ్జెటులో డబ్బు కేటాయించారు?

మనకొక రాజ్యాంగమంటూ ఉంది. ఈ రాజ్యాంగంపై కేంద్ర విద్యామంత్రికూడా సంతకంచేశారు. భారతదేశం ఫెడరల్ యూనియన్అని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. కేంద్రానికి కొన్ని, రాష్ట్రాలకు కొన్ని అధికారాలను కేటాయించడం ఫెడరల్ యూనియన్ ముఖ్యలక్షణం. విద్యలాంటి విషయాలను రాజ్యాంగం రాష్ట్రాలకు ఇచ్చింది. కాని ఫెడరల్ రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర విద్యాశాఖ ప్రైమరీ విద్యకు ధనం కేటాయించడం జరిగింది.

శ్రేయోరాజ్య స్థాపనమనే ఆదర్శం మంచిదే. అందరికీ ఉద్యోగాలివ్వాలి అనే ఆదర్శంకూడా గొప్పదే. కాని మానవశ్రేయస్సుకూ పన్నులకూకూడా దగ్గర సంబంధం ఉంది. స్త్రీలు, పురుషులు కష్టపడి పనిచేసి, జీవనోపాధి సంపాదించుకుని, అందులోంచి పన్నులకింద డబ్బు చెల్లిస్తున్నారు. అందుచేత, వృధావ్యయాన్ని అరికట్టడానికీ, ఆర్థికమంత్రి చెప్పిన ప్రధానవిషయాలకే ముందు డబ్బు కేటాయించి అప్రధానమైన వాటిని వాయిదా వేయడానికీ ప్రయత్నాలేమీ జరక్కపోవడం విచారకరంగా ఉంది. ★

'నా నయా పైసా అనుభవాలు'

ఈ సారి కొత్త సంవత్సరం మనకిచ్చిన కానుక కొత్తపైసా. పండగరోజునే ఈ నయాపైసా తమాషాలు ప్రారంభం అవుతాయి. కొందరికి దండుగ తగులుతుంది; కొందరికి మెండుగ మిగులుతుంది. మిగిలేవాళ్ళకి తమాషాగా ఉన్నా, తగిలేవాళ్ళకి కాస్త కూస్త చిరాగ్గా ఉంటుంది. మీ మటుకు మీరు ఈ నయాపైసా నాటకంలో చిరాకునో, పరాకునో, తినే చిన్న చిన్న టోకరాలూ, తెలిసికూడా తప్పనిసరిగా నిభాయించుకు వచ్చిన ఇబ్బందులూ, తోటివారికి చెప్పదలచుకుంటే, క్లుప్తంగా వ్రాసి పంపండి. వాటిపైన "నా నయాపైసా అనుభవాలు" అని వ్రాసి పంపండి.

మాయమైన మనీపర్సు

దిక్కుమాలిన బస్సు ఎంతకూ కదలటం లేదు. బస్సులో కూచుని చాలాసేపయిందేమో - అప్పుడే కాళ్లు నెప్పిపెడుతున్నై. ముప్పావుగంట క్రిందట అడిగితే ఆ కండక్టరు-'వెళ్ళిపోతోంది. ఎక్కండి' అన్నాడు. వెళ్ళిపోతున్న బస్సుఎక్కే పద్ధతిలో ఛటాలున ఎక్కి-సీటులో కూచున్నాను. ఆ కూచోటం కూచోటం అదే కూచోటం!

"బస్సు సరిగా ఎన్నిగంటలకు బయల్దేరుతుందయ్యా?" అన్నాను కండక్టరుతో మళ్ళీ.

"సరిగా ఒంటిగంటకు!" అన్నాడు. గడియారంలో చూశాను. రెండు గంటలకు పది నిమిషాలు తక్కువగావుంది!

"ఒంటిగంటా-రెండుగంటలా?"

"ఒంటిగంట సార్" అన్నాడు! "ఇంకా ఇప్పుడు పన్నెండేగా" అనే ధోరణిలో. నాకు ఖల్లుమండి, గడియారం చూపించాను.

"మీది ఫాస్టు. ఐనా పోదాంలెండి" అని నన్ను ఓదార్చి నాలుగుసార్లు హారన్ ప్రయోగించాడు. ఆ దెబ్బతో ఆ ప్రాంతాల తిరుగుతున్న మరికొందరు ప్రయాణీకులు పరుగునవచ్చి కూచున్నారు.

రెండింటకి, మహాషోగ్గా కిళ్లీ నముల్తూ డ్రైవరు వచ్చాడు. లోపల అంతా యమలోకంగా వుంది. "పొగ త్రాగరాదు" అని పెద్దక్షరాలు కనిపిస్తున్నా-ప్రతీవాడూ పొగ త్రాగుతూనే వున్నాడు. న్యాయాన్ని ధిక్కరించేందుకు వెనకాడి, నేను త్రాగ లేదు! ఐనా, గాలి కూడా ఎక్కడికక్కడ స్తంభించిపోయింది.

రెండూ పదినిమిషాలకు ఎట్లాగైతేనేం-హారన్ మోతలతో స్టాండునుంచి బస్సు బయల్దేరింది. కొన్ని గజాలు నడిపించి, ఆపేసి, దిగి, కూడా పోయాడు డ్రైవరు! నాకు-నా ఒక్కడికే కాదు-అందరికీ విసుగూ కోపాలూ లేచాయి. డ్రైవర్‌నూ కండక్టర్‌నూ కొందరు తిట్టుకున్నారు. నేనెవర్నీ తిట్టలేదు. నన్ను నేను తిట్టుకున్నాను. బస్సుప్రయాణం ఒద్దని మా వాడు పోరాడుతున్నా వినిపించుకోక ఎక్కినందుకు!

* * *

కాస్సేపటికి బస్సుప్రయాణం హాయిగానే వుందనిపించింది. మోతాదయిన పరుగూ, చల్లనిగాలి, అటూ యిటూ చెట్లూ వాతావరణం అంతా చక్కగావుంది. బస్సునిండా మనుషులు లేరు - సీట్లనిండామాత్రం వున్నారు. నా ప్రక్కనే ఒక ముసలాయన కళ్లజోడులోంచి ప్రకృతిని పరిశీలిస్తున్నాడు. వుండివుండి ఏదో 'తనలో' చెప్పుకుంటున్నాడు.

ఒక తూము గట్టుప్రక్క బస్సు ఆగింది. అక్కడేం వూరున్నట్టులేదు, అటూ యిటూ పొలాలూ చెట్లూ తప్ప. పాతికేళ్ల కుర్రాడు ఒకాయన అక్కడ బస్సు ఎక్కాడు. కూచోటానికి ఎక్కడా స్థలం లేదుకదా ఎక్కడ కూచుంటాడనిపించింది నాకు. కండక్టరు మమ్మల్ని సర్దుకోమన్నాడు. అందరమూ సర్దుకున్నట్టే అటూ యిటూ జరిగి

రావి కొండలరావు

మళ్లీ అట్లాగే కూచున్నాము. 'మీకు తెలీదన్నట్టు కండక్టరు మొహంపెట్టి బీరువాలో పుస్తకాలు సర్దినట్టు మమ్మల్ని సర్ది నాకూ ముసలాయనకూ మధ్యగా అతన్ని కూచోపెట్టాడు. మళ్ళీ సర్దుకున్నాము. అతనికి చోటు సరిపోయిందిగాని - మాకు కష్టమైపోయింది. ఏం చేస్తాం? ఆ బస్సు మనది కాదు!

కండక్టరు 'రైట్' అన్నాడు. బస్సు బయల్దేరింది. పది నిమిషాలు పోయాక "ఎక్కడికి వెళ్తారండీ?" అన్నాడు కండక్టరు పాతికేళ్ల కుర్రాడితో అతను ఏదో చెప్పాడు. కండక్టరు టిక్కట్టు చింపి యిస్తూ, డబ్బుకోసం చెయ్యి చాపాడు. కుర్రాడు జేబులో చెయ్యి పెట్టాడు. వెంటనే పాంటు జేబులు తడిమాడు-మళ్ళీ పై జేబులు చూశాడు-పాంటు జేబులు చూశాడు-మొహం ఎర్రగా ఐపోయింది. 'పర్సు పర్సు' అని గోలచేశాడు. నేను సీటుక్రిందా ప్రక్కనా చూశాను. ఎక్కడా లేదు. డ్రైవరు బ్రేకు వేసి ఆపాడు.

"అక్కడే పడిపోయి వుంటుంది" అన్నాడు కుర్రాడు ఆత్రుతగా బస్సు దిగుతూ.

"పర్సులో ఏమాత్రం వుంటుంది?" అనడిగాడు ఒకాయన.

"నూటయాభై రూపాయలకు పైగా వుందండి!" అన్నాడు కుర్రాడు గాభరాగా.

"ఆతూము గట్టుమీద మీరు కూచున్నప్పుడు పర్సు వుందా?" అని ప్రశ్న వేశాడు డిటెక్టివ్ నవల చదువుకుంటున్న ఒకాయన వెనకనుంచి.

"వుందండీ" అన్నాడు కుర్రాడు వెళ్ళబోతూ.

"పాపం" అన్నది ఒక ఆడగొంతు.

"త్వరగా వెళ్ళి చూడండి. ఎంత పనయిపోయిందండీ!" అన్నాడు ఒకవ్యక్తి మొదటి సీటునుంచి.

"పరుగెత్తండీ!" అని గాభరా చేసింది వెంటనే ఒక మగగొంతు. కుర్రాడు పరుగెత్తబోయాడు. ఇంతలో క్లీనరు కుర్రాడు "మీరుండండి నేను వెళ్తాను" అంటూ పరుగెత్తాడు!

"చాలాదూరం వచ్చేశామేమో!" అన్నాను నేను.

"మైలున్నర" అన్నాడు డ్రైవరు బస్సుదిగి.

నేనూ క్రిందికి దిగాను. ఈ కుర్రాడు వెళ్లి ఎప్పటికొస్తాడోననిపించి అంతా దిగసాగారు. మార్గమధ్యం. ఎటుచూసినా చెట్లూ పొలాలూ తప్ప ఇంకేమీ కనిపించటంలేదు. ఐతేనేం. కొస్త గాలి పీల్చుకుంటున్నాం అనిపించింది. నెమ్మదిగా నడిచి వెళ్ళి ఒక మైలురాతిమీద చతికిలబడి, సిగరెట్టు ముట్టించారు.

పావుగంట గడిచింది. ఆ వెళ్లిన కుర్రాడు ఇంకా రాలేదు. పర్సు పారేసుకున్న వ్యక్తి రోడ్డుమధ్యగా నించుని అటే చూస్తున్నాడు. నా ప్రక్కనే కూచున్న ముసలాయన నాకు కొద్దిదూరంలో నించుని "ఈయన ఎవడో మధ్య పర్సు పారేసుకుంటే. ఈ ప్రయాణీకులందర్నీ ఎందుకో ఈ కష్టపెట్టటం?" అన్నాడు.

"ఆఁ?" అన్నాను తిరిగి. ఆయన ఏది

★ మాయమైన మనీపర్సు ★

పించుకోలేదు. ఏటో చూస్తున్నాడు. అప్పు డర్థమయింది. ఆయన నాతో చెప్పలేదు. తనతోనే చెప్పుకున్నాడని!

నేను కాస్త పరిశీలనగా ఆలోచించ సాగాను. ఈ అబ్బాయి నిజంగా పర్సు పారేసుకున్నాడా? తమాషా...? తమాషా ఐతే దానివల్ల అతని కేంలాభం"...పోగా, పర్సుకోసం ఈయన పరుగెత్తబోతే ఆ క్లీనరు కుర్రాడు 'నేను వెళ్తాను' అని పరుగెత్తాడు. కొంపదీసి ఆ పర్సు తీసుకుని వాడు పారిపోతాడా యేమిటి?...లేకుంటే ఎక్కడో దాచేసి 'దొరకలేదు'ని బొంకినా బొంకవచ్చు. నూటయాభై రూపాయలు ఎంత పనయినా చేయించవచ్చు! ఏమిటో అంతా అగమ్యగోచరంగా వుంది. ప్రయాణీకులు ఆడవాళ్లు తప్పించి - అంతా కిందనే వున్నారు. రోడ్డుమీదే మూల మూలలూ, చెట్లక్రిందా విశాలంగా కూచున్నారు. ఆ దృశ్యం చూసి "చూడవయ్యా కండక్టరూ? ఇట్లా విశాలంగా స్వేచ్ఛగా గాలి పీలుస్తూ బతికొల్సిన ఈ మనుషులందర్నీ నువ్వు ఆ బస్సులో సర్దుకోమంటావు గదా ఏం న్యాయం." అని కండక్టరుతో అనాలనిపించింది నాకు. నాకు మూడుగజాల దూరంలో చెట్టుకింద నించుని చదువుకుంటున్నాడు డిటెక్టివ్ నవలాయన. వున్నట్టుండి నా దగ్గర కొచ్చాడు.

"మిష్టర్ - ఇదంతా ఏదో మిష్టరీగా వుంది కదూ?" అన్నాడు. జేబులో కూడా ఇంకో డిటెక్టివ్ పుస్తకం వుంది!

అవునవును. అట్లాగే వుంది" అన్నాను.

"పుస్తకం చదువుతున్నానన్న మాటేగాని అదే ఆలోచిస్తున్నాను—ఆ పర్సు ఎలా పోయిందా ఏమిటా అని." అతనికి దగ్గరగా వున్న వాళ్ళల్లో ఎవరేనా కొట్టేసి వుంటారేమోనని నా అనుమానం. రైళ్ళల్లోలాగే బస్సుల్లోనూ దొంగ లుంటారండీ!" అన్నాడు కొంప మునిగిపోయినట్టు.

"రైలు పెట్టెలలో 'దొంగ లున్నారు జాగ్రత్త' అని రాస్తారు కాబట్టి అక్కడుంటారు. బస్సుల్లో రాయరు- అందుకని దొంగ లుండరు." అన్నాను చిరాకుగా.

అతను ఆకాశం పగిలినట్టు ఒకసారి నవ్వి, తమాయించుకొని — "బాగా చెప్పారండీ" అన్నాడు.

"ఆ జేబులోది ఏం పుస్తకం?" అని అడిగాను.

"అబ్బే. నేనింకా చదవలేదండీ" అన్నాడు రెండు చేతులతోనూ జేబులు కప్పేసుకుంటూ ఏడుపుమొహంపెట్టి.

"నా కక్కర్లేదులెండి. ఏమిటో అని".

"అదా—'పది హత్యలూ - పాతికమంది హంతకులూ'"

"అబ్బ" అన్నాను.

"ఇది చూశారా—ఇది—"కాఫీ తాగని కాంతారావు" కాని—బాగా లాక్కుస్తున్నాడు కుమండీ—గొప్ప సస్పెన్సు..."

నేను మరి మాట్లాడలేదు.

ఇంతలో డ్రైవరు ఏదో కేకలు వేస్తున్నాడు.

"నువ్వెళ్ళి రారా. వీడు ఎంతకూ అంతు తేలడు!" అన్నాడు కండక్టరుతో.

సరి! కండక్టరూ బయల్దేరాడు.

నేను మరో సిగరెట్టు ముట్టించాను. క్లీనరూ, కండక్టరూ, తర్వాత డ్రైవరూ, అంతా ఒక్కొక్కరే పోతారా యేం చెప్మా! పర్సు పారేసుకున్నకుర్రాడు చాలా దూరంలో వున్నాడు.

అందరూ చిరాగ్గా వున్నట్టు కనిపిస్తున్నారు. అప్పటి కప్పుడే చాలాసేపయిపోయింది బస్సు ఆగిపోయి. పాతికేళ్ళ కుర్రాడు నెమ్మదిగా బస్సుచుట్టూ తిరుగుతున్నాడు. వెళ్ళిన క్లీనరూ కండక్టరూ ఇద్దరూ తిరిగిరాలేదు. వస్తున్న జాడలూ లేవు. డిటెక్టివ్ పుస్తకాలాయన చాలాదూరంలో వుండి, ఏదో పరిశోధిస్తున్నట్టున్నాడు. నా ప్రక్క ముసలాయన రాళ్ళగుట్ట క్రిందగా కూచుని మాట్లాడుకుంటున్నాడు!

పర్సు పారేసుకున్న కుర్రాడు నా దగ్గరగా వచ్చాడు. మొహంలో ఆత్రుత ఇంకా ఎక్కువగా కనిపిస్తున్నది. గాభరా పడు



"మంచినీళ్ల బావికాడ—"

ఫొటో: అత్మూరి అనసూయ, విజయవాడ.

నయా పైసా మారకం రేట్ల పట్టీ

పాత నాణాలు :		కొత్తవి	పాతవి :		కొత్తవి	పాతవి :		కొత్తవి	పాతవి :		కొత్తవి
అ.	పై.	నయాపైసాలు	అ.	పై.	నయాపైసాలు	అ.	పై.	నయాపైసాలు	అ.	పై.	నయాపైసాలు
0	3	2	4	3	27	8	3	52	12	3	77
0	6	3	4	6	28	8	6	53	12	6	78
0	9	5	4	9	30	8	9	55	12	9	80
1	అణా	6	5	అణాలు	31	9	అణాలు	56	13	అణాలు	81
1	3	8	5	3	33	9	3	58	13	3	83
1	6	9	5	6	34	9	6	59	13	6	84
1	9	11	5	9	36	9	9	61	13	9	85
2	అణాలు	12	6	అణాలు	37	10	అణాలు	62	14	అణాలు	87
2	3	14	6	3	39	10	3	64	14	3	89
2	6	16	6	6	41	10	6	66	14	6	91
2	9	17	6	9	42	10	9	67	14	9	92
3	అణాలు	19	7	అణాలు	44	11	అణాలు	69	15	అణాలు	94
3	3	20	7	3	45	11	3	70	15	3	95
3	6	22	7	6	47	11	6	72	15	6	97
3	9	23	7	9	48	11	9	73	15	9	98
4	అణాలు	25	8	అణాలు	50	12	అణాలు	75	16	అణాలు	100

తున్నట్టూ, విచారపడుతున్నట్టూ కనిపిస్తున్నాడు.

"పర్సులో నూటయాభై రూపాయలు కాక ఇంకేం లేవా?" అన్నాను.

"కొంత చిల్లర వుందనుకోండి."

"మీపర్సు అక్కడే పడివుంటుందని నిర్ధారణగా చెప్పలేమేమో!" అన్నాను. అతడు మాటాడలేదు. అటూయిటూ చూడసాగాడు. కొంతమంది ప్రయాణీకులు అతనికేసి తీవ్రంగా చూస్తూ గొణుక్కోవటం నేనూ కనిపెట్టాను.

అతను నాకు దగ్గరగా వచ్చాడు.

"అయ్యా - మీరు అర్థంచేసుకోగలరు. ఒక్కవిషయం చెబుతాను. మన్నించండి!" అన్నాడు.

"ఏమిటది?" అన్నాను ఆశ్చర్యంగా.

"నేను పర్సు సరిగా చూసుకోలేదండీ. అది నాపాంటు వెనక జేబులో వుండిపోయింది." అని నెమ్మదిగా పర్సు తీసి చూపించి మళ్ళీ ఎవరూ చూడకుండా పాంటు వెనకజేబులోనే పెట్టేశాడు.

వాళ్ళు వెళ్ళాక ఇందాక మళ్లీ చూసుకుంటే వెనకజేబులో తగిలింది. నాగుండె ఆగిపోయినంత పనయింది. అన్ని జేబులూ వెతికానుగాని అది వెతకలేదు. ఆమాట చెప్పటానికి నాకు భయంగా వుంది. ఇప్పుడు వీళ్లల్లో కొందరన్నా నామీద జాలిగా వున్నారు. అసంగతి చెబితే అంతా నామీద ఎగిరిపడతారు. నానుంచి సుమారు ముప్పావుగంట ఇక్కడ ఆలస్యమైపోయింది. కండక్టరూ క్లీనరూ పాపం—పరుగెత్తి వెళ్లారు. ఇప్పుడేం చెయ్యటమో నాకేం అర్థం కావటంలేదు!" అన్నాడు చాలా భయపడుతూ.

"బావుంది" అనుకున్నాను. నిజమే! 'పర్సు వుంది' అని అతను అనగానే నాకూ కోపం వచ్చినట్టయింది. పాపం—అతను నాదగ్గర కొచ్చి ఆ విషయం చెప్పాడుగదా అని వెంటనే జాలి కలిగింది. ఇప్పుడితనికి ఏం చెయ్యాలి.? పర్సు అతనిదగ్గరే వున్నట్టు తెలిసిందా—కొంప మునిగిపోతుంది. అతని మీద ఇహ జాలితలిచేవాడుండడు. పొరపాటువల్ల ఆగాభరాలో సరిగ్గా చూసుకోలేదు! నేను ఆలోచించసాగాను.

"ఒక్కటి చెయ్యండి సార్" అన్నాడు నెమ్మదిగా.

ఏమిటన్నట్టు చూశాను.

"పర్సు నెమ్మదిగాతీసి ఒకరూపాయి మీకిస్తాను. వాళ్ళిద్దరూ దొరకలేదని తిరిగి రాగానే ఓరూపాయి మిమ్మల్ని అడుగుతాను. మీకూ నాకూ ఏదో పరిచయం వున్నట్టుగా అడిగి మళ్ళీ ఇచ్చేస్తానంటాను. ఆ రూపాయి నాకిచ్చేయండి. ఆ వుపకారం చేశారా—అంతా ఎప్పటిలాగా నామీద జాలిగా వుంటారు. వ్యవహారం కుదటబడుతుంది. ఏమంటారు?" అన్నాడు.

"సరే" అన్నాను. ఆలోచన బాగా వుంది. ఆపర్సు ఇంకెక్కడో పడిపోయిన
అంతా అంటారు. పాపం అని సానుభూ
చూపిస్తారు. పైగా అతనికి ఆ సమయంల
నేను రూపాయి ఇవ్వటంవల్ల నామీదకూ
అందరికీ గౌరవభావం ఏర్పడుతుంది.


ఆకుర్రాడు దూరంగా చెట్టు చాటు
పోయి, తిరిగివచ్చి—నెమ్మదిగా నా చేతిల
రూపాయి వుంచాడు. మొహం మరి
దీనంగా పెలవేసి, ఆత్రుతగా వాళ్ల ర
కోసం ఎదురు చూడసాగాడు.

నేను నెమ్మదిగా లేచాను. ఐన ఆలశ్య
ఐనా కాస్త వినోదకరంగా వుందనిపించి
నాకు. నేనూ కుర్రాడూ రహస్యం
మాట్లాడుకోటం ఎవరన్నా గమనించారేమో
నని చూశాను. ఎవరూ గమనించినట్టు లేద
ఎవరి గొడవల్లో వాళ్లున్నారు.

ఇంతలో దూరంగా ఇద్దరూ వ
న్నటు కనిపించింది. అందరూ లేచినిం
న్నారు. కండక్టరూ క్లీనరూ పరుగెత్తి వ
న్నారు. ఆ కుర్రాడి మొహం చూశాన
ఇంకా దీనంగా, అమాయకంగా, ఆత్రుత
వున్నట్టు కనిపించాడు!

అంత దూరంనుంచి కండక్టరు ర
వుంటూవస్తూ" దొరికిందండోయ్ పర్సు ద
కింది" అంటూ నవ్వుతూ చెయ్యెత్తి చూపి
చాడు. ఆ చేతిలో పర్సు ఒకటే తళత
మెరుస్తూ కనిపించింది!!

అపర బుద్ధి



తుమ్మలపల్లి
సీతారామారావు

(గతవారం తరువాయి)

వారం రోజులు దాటిపోయినై. ఒక రోజు మధ్యాహ్నం కమలాక్షి నా ఆఫీసుగదిలోకి వచ్చింది. ఇప్పుడు ఆమెలో ఒకవిధమైన మార్పు కనపడుతూంది. అప్పుడు ఆమె ఒక విద్యార్థినివలె కనపడింది. ఆమె విశాలమైన కళ్లు బంగారు కలలుకంటున్నవి. జీవితంలో కష్టాలు భరించిన స్త్రీ వలె ఇప్పుడు కనపడుతూంది. ఆమెకు తటస్థించిన కష్టానికి నా సానుభూతి తెలిపాను. సవతి తల్లి ఆమెను ఎట్లా చూస్తూందో అడిగి తెలుసుకున్నాను. మధుసూదన్ ఎలా వున్నాడని ప్రశ్నించాను.

"దయచేసి ఆపేరు ఎత్తవద్దు" అంది.

"మీరు ఇద్దరూ స్నేహితులు అనుకున్నానే" అన్నాను.

"అతణ్ణి గురించి మాట్లాడటం నాకు ఇష్టం లేదు."

"సరే."

ఆమె కుర్చీలోనుంచి లేచింది. కిటికీ దగ్గరికి వెళ్ళి, నాలుగువైపులా కలయచూసి, మళ్లీ కుర్చీలో కూచుంది.

"మీరు ఇదివరకు ఎంతో రహాయం చేశారు. నాకోసమే చేశారనుకున్నాను."

"ఔను."

"అప్పటినుంచి మిమ్మల్ని, నాకు ఒక ఆప్తమిత్రుడుగా భావిస్తున్నాను. అందువల్లనే ఇప్పుడు మళ్లీ మీదగ్గిరికి వచ్చాను. మీరు నాకు సన్నిహితులు-నాతో మాట్లాడాలి"

"సరే! ఏమిటా విషయం?"

"మీరు నాతో స్నేహితుడివలె మాట్లాడాలి కాని భీమా వ్యాపారం చేసే ఏజంటువలె మాత్రం మాట్లాడవద్దు. నా మనసులో నాకే ఒక్క నిశ్చితమైన అభిప్రాయం ఏర్పడే వరకూ, నేను చెప్పే విషయాన్ని అతి రహస్యంగా వుంచాలి. తెలిసిందా!"

"అలాగే."

"ఇది మా నాన్నగారి విషయం."

"సరే."

"మా నాన్నగారి మరణాన్ని గురించి ఆలోచిస్తే, ఈ సంఘటనకు వెనుక ఏదో కుట్రవుందని నాకు తోస్తూంది."

"కుట్ర ఏమిటది?"

"అది ఏమిటో నాకు అంతుపట్టటం లేదు."

"శవపంచాయతీ జరిగినపుడు, నీవు అక్కడ ఉన్నావా?"

"ఔను."

"ఒకరిద్దరు సాక్షులను విచారించారు. అంతేకాదు. మరికొందరుకూడా మీ నాన్నగారు ఆత్మహత్య చేసుకుని మరణించారని చెప్పారు. నీవు చెప్పదలచుకున్నది ఈ సంగతేనా?"

"కాదు!"

"అయితే! మరేమిటి?"

"నేను చెప్పలేను. నా నోటితో చెప్పలేకుండా ఉన్నాను. అది చాలా భయంకరమైనది. భయంకరమైన ఆలోచనలు స్ఫురించటానికి ఇది మొదటి సారి కాదు. నాకేదో ఒక అనుమానం మనస్సుకు తీవ్రమైన ఆ వేదన కలిగిస్తూంది. ఈ విషయంలో సాధారణంగా అందరూ అనుకునే అభిప్రాయానికంటే భిన్నమైన అనుమానం ఒకటి నన్ను బాధిస్తూంది."

"నీ అభిప్రాయం మేమిటో స్పష్టంగా తెలియటం లేదు."

"మా అమ్మ చచ్చిపోయినప్పుడు కూడా నాకు ఇటువంటి అనుమానమే, భయమే కలిగింది."

ఆమె మనసులోని అభిప్రాయం తెలుసుకోవాలని ఆదుర్దాగా ఎదురుచూస్తున్నాను. దుఃఖంతో పూడిపోయిన ఆమె గొంతులోనుంచి మాటలు పెగలడంలేదు. ఏదో నాతో చెప్పాలనే ఆరాటంతో ఆమె ప్రయత్నం చేసింది. కాని చెప్పలేకపోయింది. చెప్పటం ఇష్టంలేక ఆగినట్టుగా ఆగి, మళ్ళీ ఆమె ప్రారంభించింది.

(50-వ పేజీ చూడండి)



దొంగరాముడు

కొల్లకూరి శేషగిరిరావు

రైలు బయలుదేరడానికింకా ఐదు నిమిషాలు వ్యవధి ఉంది. స్టేషను కిటకిట కొంచెం తగ్గింది. భోజనానికి దిగినవారంతా నెమ్మదిగా తమ తమ పెట్టెలు చేరుకొంటున్నారు. టిక్కట్టు కొనుక్కొని వెతుక్కుంటూ ఫస్టుక్లాసుపెట్టెవద్దకు వచ్చాను. నా సామాను ఒక మఫ్లరుమాత్రమే. ఉల్ఫాగా వచ్చిన ట్వీడుసూటూ, ఈవినింగ్ క్యాపు, మెడకి మఫ్లరూ; నన్ను చూసి ఎవడో పెద్ద ఉద్యోగి అనుకోక తప్పదు.

ఫస్టుక్లాసుపెట్టెముందు కిటికీవద్ద ఒక పెద్దమనిషి నిలుచొని పెట్టెలోని తన భార్యకు వీడ్కొలిస్తున్నాడు. అతన్ని చూడగానే ఆఫ్ డ్యూటీలో వున్న ఒక రైల్వే ఉద్యోగి అని వెంటనే కనుక్కున్నాను. నేను పెట్టె తలుపువద్దకు రాగానే బెదురుకళ్లతో అతని భార్య నావైపు చూసింది. అయినా కొంచెం పరీక్షగా చూసి, నెమ్మదిగా ఆమెతో 'భయపడకు, ఎవరో పెద్దమనిషే ననుకుంటాను' అన్నాడు. చిన్న చిన్న శబ్దాలను కూడా ఆనవాలుపట్టే నా చెవులలోకి ఈ మాటలు ఇట్టే దూరాయి. ఏమీ ఎరగనట్లు తలుపు తెరుచుకొని ఆమూల కిటికీవద్ద చతికిలపడ్డాను. ఆమె అనుమానంగా నాకేసి రెండుమూడుసార్లు చూసి ఊరుకుంది.

గార్డు విజిల్ ఇవ్వడం, 'ఇంక ఉంటా' అని ఆయన వెనక్కి తప్పుకోడం, నిండు గర్భిణిలా రైలు ఒక్క చిన్న ఊపుతో కదలడం, ఒకసూటువ్యక్తి ఒగర్చుకొంటూ తలుపు తోసుకుని లోపల ప్రవేశించడం దాదాపు ఒకేక్షణంలో జరిగాయి. అతన్ని చూస్తూనే హఠాత్తుగా కొయ్యబారినట్లైపోయి నోరు వెళ్ళబెట్టుక్కూర్చుంది ఆవిడ. అతనుమాత్రం త్వరగా వచ్చి నా ఎదురుగా కూర్చుని, మొహం రెండుచేతుల్లోను మూసుకు వళ్లో పెట్టుకున్నాడు, ఏడుస్తున్నట్లుగా. నేను మాత్రం ఏచింతా లేకుండా కిటికీలోంచి ప్రతీ ఫర్లాంగుకు కాపలాఉన్న పోలీసుల్ని చూసి నవ్వుకున్నాను.

ఒక చిటిక వినిపించి పక్కకు చూసాను. ఆమె నన్ను తనపక్కకు రమ్మని సైగ చేసింది. లేచి ఆమెపక్కకు వెళ్ళాను. వెళ్ళగానే దాదాపు నా చెవిలో 'వాడెవరో మీకు తెలుసా?' అని అడిగింది. అతన్ని పెట్టెలోకి రాగానేచూసి 'ఎక్కడో చూసినట్లుందేమిటబ్బా'అనుకున్నాను. కాని జ్ఞాపకం రాలేదు. ఆవిడ ప్రశ్నకి 'నాకు తెలియదు' అని సమాధానం చెప్పాను. 'ఆ! తెలీదూ? వాడేనండీ దొంగరాముడు' అంది, 'ఆ!' అని ఆశ్చర్యపోయాను. అవును నాకు బాగా తెలుసు. రెండేళ్ళక్రితం గుంటూరులో రెండు హత్యలుచేసి అప్పటినుంచీ పోలీసుల్ని తప్పించుకు తిరుగుతున్న దొంగరాముడు వీడే. నిన్న మధ్యాహ్నం ద్రోణాచలంలో పోలీసులకి కనిపించి తప్పించుకున్నాట్ట. ఈ లైనంతా అందరికీ అతని ఫోటోలు పంపించి పూర్తిగా పోలీసు నిఘా పెట్టేశారు. మా ఆయన వాడి ఫోటో చూపించారు. వీడేనండీవాడు' అంది. తెగ కంగారు పడిపోతూ. రెండేళ్లనాటి ఆ సంగతి, ఇదుగో పులి అంటే అదిగో తోక అనే పోలీసుల బారినుండి తప్పించుకుంటూ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోనేందుకు రామారావు (దొంగరాముడు!) పడేపాట్లు, ఈ రెండేళ్ళు తన జీవితాన్ని రక్షించుకోవడంకోసం అతను చేయవలసి వచ్చిన అక్రమాలూ నా మెదడులో మెరిశాయి. అతనివేపు ఇంకోసారి చూసి, ఆమెతో 'బాగా చూశారా లేక పొరబడ్డారా?" అని అడిగాను. "అబ్బే వాడేనండి" అంది ఇంకొంచెం ఖంగారుగా. మా మాటలు కొంచెం చెవినిబడ్డాయేమో ఒకసారి మాకేసి కొరకొరా చూసి, అటు ముఖం తిప్పేసుకున్నాడతను. "ఐతేమాత్రం మనకేం భయమండీ. దిగువ మెట్టలో ఆగగానే వాణ్ని పట్టించేస్తే సరి" అన్నాను నవ్వుతూ. "ఆ అంతవరకూ వాడుండడండీ. ఈ లోపలే మనని దోచేసి పారిపోతాడు, అందావిడి "నన్ను దోచడానికి నావద్ద ఏమీ లేదు. మీ క్కూడా ఆ లెదర్ సూట్ కేసొకటేగా ఎందుకూభయం"అన్నాను

★ దొంగరాముడు ★

“ఇంకానయం, ఆ సూటు కేసులో దాదాపు పదివేల రూపాయలు ఖరీదుచేసేనా ఆభరణాలన్నీ ఉన్నాయి” అందామె, వణికిపోతూ. “ఆ, నేను వుండగా మీ కెందుకూ భయం” అని ఆవిణ్ని ఊరడించి నా సీటులోకివచ్చి కూరుచున్నాను. ఆమె భయమూ ఆభయంలో నన్నునమ్మి తనవద్దనున్న విలువ గురించి చెప్పేయడమూ నాకు నవ్వు తెప్పించాయి.

రైలువేగం హెచ్చుతూంటే నాకు కునికిపాట్లు రావడం మొదలు పెట్టాయి. చదువుతున్న పత్రికని మూసేసి కళ్లు మూసుకొన్నాను. ఆమె త్వరత్వరగా నా వద్దకు వచ్చి “నిద్ర పోకండోయి” అంది. ఆమెకేసి ఏమీ భయం లేదన్నట్లు చూసి మళ్ళీ కళ్లు మూసుకొన్నాను. ఎంత సేపయిందో తెలియదు. చక్కటి కునుకుపట్టింది. ఆ కలత నిద్రలో ఓ కల. పోలీసులు నన్ను తరుముతున్నారట, నేను పరుగెత్తి పారిపోతున్నాను. ఇంతలో ఓ పోలీసు హఠాత్తుగా వచ్చినా మీద పడ్డాడు. ఉలిక్కిపడి మేలుకొన్నాను. వళ్లు ముచ్చెమటలు పోసేస్తున్నై. నా ఎదురుగుండా కూర్చున్న వ్యక్తి తనమోకాలునాడొక్కలో తన్నిపెట్టి రెండు చేతుల్తోను మెడపట్టుకున్నాడు. నిద్రమత్తు పూర్తిగా వదలని నాకు ఇదొక పీడకలలా అనిపించింది. ఆ సమయంలో నాశక్తిఅంతా ఉడిగిపోయినట్లై అతనిచేతిలో కీలుబొమ్మలా ఐపోయాను. అతను ఒకచేత్తో నాపీక నొక్కుతూ రెండో చేత్తో నా టైనివిప్పి నాచేతుల్ని గట్టిగా కట్టివేశాడు. తర్వాత నా మఫ్లరుతో నాకాళ్లని బంధించాడు. వెంటనే నా జేబులన్నీ వెదికి నాపర్సునీ, నాపాకెట్ బుక్కునీ తన జేబులో వేసుకున్నాడు. శక్తిహీనంగా నేను నాపాకెట్ బుక్ లో డబ్బేమీ లేదనీ, దాన్ని వదిలేయమని అన్నాను. కోపంగా ఓసారి చీదరించి, నా కోటుజేబులోని రుమాలు నానోట్లోకుక్కి నన్ను ఓమూలగా పడేశాడు. ఆమె తనమూలలో అలాగే కొయ్యబారిపోయి కూర్చొని ఉంది. అతను పళ్లు ఇకిలించి నవ్వుతూ, “మీ సూట్ కేసులోని నగలకోసమే ఈపని చేయవలసి వచ్చింది, క్షమించండి, అని పై బెర్తులో ఉన్న ఆమె సూట్ కేస్ ని తీసుకొని, తలుపు తెరిచి మెట్లపైనుంచున్నాడు. రైలు శబ్దాన్నిపట్టి చెలమకీ, బొగదకీ మధ్యనున్న టనెల్ ప్రాంతంలోకి వస్తున్నట్లు పసికట్టాను. అటనెల్ వద్ద రైలు కొంచెం నెమ్మదిగా నడుస్తుంది. ఈ విషయం ఇతనికి బాగా తెలుసు గామోసు ఆటనెల్ను రైలు ప్రవేశించగానే క్రిందకి దూకేస్తాడు అనుకుంటూ. టనెల్ ఇవతలికి వచ్చేటప్పటికి అతను లేడు.

ఆమె ఇంకా అలాగే వెర్రిమొహం వేసుకుని తెల్లబోయి చూస్తోంది. కళ్ళతో నన్ను విడుదల చేయవలసిందిగా సైగచేసాను. ఇంతవరకూ నాజీవితంలో ఇటువంటి అనుభవం జరగలేదేమో, మనసులో సిగ్గుతో కుంచించుకుపోతున్నా. ఇంక తప్పదు గాబట్టి ఆమెకు సైగచేయవలసి వచ్చింది. ఆమె నెమ్మదిగాలేచి, కళ్లుతుడుచుకుని, నాకట్లు విప్పింది. విప్పుతూనే ఆమె మాట వినకుండా నిద్రపోయినందుకు ఛెడామడా తిట్టిపోసింది. నావల్లే తన పదివేల రూపాయల వస్తువులూ పోయాయట. కట్లువిడవగానే లేచి, ఒళ్లు దులుపుకొని ఆమెకు క్షమాపణ చెప్పుకున్నా ‘వాడే దొంగరాముడండీ అని చెవినిల్లుకట్టుకుని పోరినా అలా బండనిద్రపోయారే’ అని తిట్టింది. వాడు దొంగరాముడు కాడనుకున్నాను. ఐనా ఏం చేస్తాడులే అని అనవసరంగా ధైర్యపడ్డాను క్షమించండి’ అని వేడుకున్నాను.

మళ్లీ కిటికీదగ్గర కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాను. వెధవపర్సు పోతేపోయింది బాధలేదు. దాంట్లో ఉన్న డబ్బు మహాఐతే ఓ పదిరూపాయలుంటుందేమో. కాని పాకెట్ బుక్కుకూడా లాక్కుపోయాడు ఎలాగ? దాంట్లో నా ఉదంతమూ, నా మిత్రుల చిరునామాలు అన్నీ ఉన్నాయి. అవికనక ఎవరిచేతుల్లోఅన్నా పడ్డాయంటే ఇంకేమైనా ఉందీ? సర్వనాశనం. ఇప్పుడు ఏంచెయ్యాలి? ఎలాగైనా వాణ్ని నా స్వంత చేతుల్తో పట్టుకొని ఆ పాకెట్ బుక్ లాగేయాలి. ఇంకో పావుగంటలో దిగువమెట్ట వస్తుంది. కాని నా మిత్రుల్ని నన్ను కంభంలో కారుతో కలుసుకోమని వ్రాశాను. ఆ కారేగనుక దిగవమెట్టదాకా వస్తే ఎంతబాగుండేది. అనిపించింది. పోనీ కంభందాకా వెళ్లిపోయి కారుమీద వాడికోసం వేట ప్రారంభిద్దామంటే చాలా ఆలస్యమైపోతుంది. ఈలోపల వాడు ఎక్కడికైనా తప్పించుకుపోవచ్చు. అదీగాక ఈవిడ గొడవొకటి. అసలే ప్రతీ స్టేషన్లోను పోలీసుకాపలా ఉంది. దిగువమెట్టలో రైలాగగానే ఈవిడ గొడవపెట్టకా తప్పదు. పోలీసులు మా పెట్టెమీద మూగకా తప్పదు. మధ్య ‘వీడెవరూ’ అనే ప్రశ్నా తప్పదు. వెంటనే ఒక యోచన తళుక్కుమని మెరిసింది. ఆవిడవద్దకువెళ్లిచూడండి నామూలంగా మీ కింత నష్టంరావడం నాకు చాలాబాధగా ఉంది. మీరు చెప్పినట్లు వాడే దొంగరాముడు అయి వుంటాడు. అందువల్ల వాణ్ణి పట్టుకోవాలంటే వెంటనే మనం దిగువమెట్టలో దిగిపోయి పోలీసు రిపోర్టుఇవ్వాలి. మీకు చాలా నష్టం అయింది. నాకుగూడా దాదాపు రెండు మూడు వందల రూపాయలు పోయాయి. అందువల్ల ఏమైనాసరే వాణ్ని పట్టుకు తీరాల్సిందే. స్టేషన్లో రైలాగగానే గట్టిగా గొడవపెట్టి పోలీసుల్ని పిలవండి. నేను మీ స్నేహితుణ్నానో, బంధువనో చెప్పి నన్ను కట్టివేసి మీ సూటుకేసు, నా పర్సు కొట్టేసి దొంగరాముడు బొగదవద్ద దిగిపోయాడనీ, వాణ్ని వెంటనే వెళ్తే పట్టుకోగలరనీ చెప్పండి. వాడు సరిగ్గా ఎక్కడ దిగిపోయాడో వారికి తెలియబర్చడంకోసం నన్ను కూడా వెంటతీసుకు వెళ్ళవల్సిందని కూడా చెప్పండి. నాకు పెద్దపనేమీ లేదు. నేను కూడా వారితోవెళ్ళి మీకుచేసిన అపకారాన్ని సరిదిద్దుకుంటాను’ అన్నాను. నా మాటలు ఆమెకు చాలా రుచించాయనికూడా గ్రహించాను. కొంచెం ముందు నన్ను పట్టుకు తిట్టినా (ఆడదికదూ) తర్వాత నా మాటకు పచ్చే అంది.

నేను చెప్పినట్లే సరిగ్గా జరిగింది. ఆమె దిగువమెట్టలో రైలాగగానే పెద్దగొడవపెట్టేయడం, పోలీసులు రావడం, నన్ను తన స్వంత మేనత్త కొడుగ్గా ఆమె వాళ్ళకి పరిచయపర్చడం, ఆమె గొడవలో వాళ్లు నన్ను సరిగ్గా పరీకించకుండా ఆమె మాటలకు విలువివ్వడం జరిగాయి. ఆమె ఆరాత్రికి దిగువమెట్ట స్టేషన్‌మేస్టరు ఇంట్లో ఉండడానికి ఒప్పందం జరిగింది.

ఇప్పుడు బొగదకి ఎలా వెళ్ళడమా అని తర్జనభర్జన వచ్చింది. ఇరవైమంది పోలీసుల్తో వేన్‌లోవెళ్లమని ప్రోద్బలం చేశారుకొందరు. కాని నేను వేన్‌లో వస్తే ఆలస్యమనీ, ఇద్దరు ఆఫీసర్ల సహాయంవస్తే జీప్‌లో వెళ్లాలనీ అన్నాను. చివరికి నేను చెప్పిందే సరియైనదనీ ముందు మేము జీప్‌లో వెళ్ళి వాడి ఆచూకీ తీయడానికి ప్రయత్నించడానికీ, మేము వెళ్లిన అరగంటలోగా ఇరవైమందితో వేన్ బయలుదేరి మాకోసం బొగద స్టేషన్లో ఉండిపోడానికీ ఒప్పందం జరిగింది.

ఈలోగా నేను స్టేషన్ మేస్టర్ని అడిగి దిగువ మెటచెలమలకి మధ్యనున్న రోడ్ ట్రాన్సుపోర్టు మ్యాపు చూసాను. ఈ ప్రాంతంలో ఈ రైల్వేలైన్‌గాక నంద్యాల వెళ్లే రోడ్డు ఒకటిఉంది. దీనిమీద అక్కడక్కడ రెండు మూడు కాలిదార్లు తప్ప ఇంకో రోడ్డు లేదు. ఈ కాలిదార్లుకూడా అరణ్యప్రాంతంలోకి వెళ్తాయి కాబట్టి అంతలాభించవు. మరి మన మిత్రుడు ఏవిధంగా తప్పించుకోడానికి ప్రయత్నిస్తాడు? అతని వేషాన్నిబట్టి ఈప్రాంతంవాడు కాదేమోననిపించింది. ఇదిగనుక నిజమైతే వాడు ఏదోవిధంగా మళ్లీ రైలు ప్రయాణానికే సిద్ధపడతాడు. కాని ఇంకో ఏడెనిమిది గంటలదాకా రైళ్లేమీ లేవు. అంతవరకూ వాడెక్కడ ఉంటాడా అని ఆలోచించాను. వాడు రెండింట్లో ఏదో ఒకపని చేసిఉండాలి. టనెల్‌వద్ద రైలు దిగగానే కొండ ఎక్కేసి బస్‌కోసం చూసి, ఏ బస్సైనా వస్తే నంద్యాలవైపుకిగాని లేదా దిగువమెట్ట వైపుకుగాని వెళ్లడానికి ప్రయత్నించాలి. ఎంత పిచ్చివాడైనా ఈ వైపుకి రావడానికి సాహసించడు అందువల్ల నంద్యాలవైపుకే వెళ్లి ఉండాలి. స్టేషన్లో వాకబుచేస్తే నంద్యాల వెళ్లేబస్సు ముప్పావుగంట క్రితమే వెళ్లిందని చెప్పారు. అంటే మేము జీప్‌లో దానిని చెలమ దాటగానే కలుసుకోగలమన్నమాట. ఈ బస్సు బహుశా బొగదవద్ద వాడికి అందేవుండవచ్చు. రెండవది వాడు బొగదప్రాంతాల్లోనే ఎక్కడో దాగుకొనిఉండి రైల్లో వెళ్లడానికి ప్రయత్నించాలి. నాకు మొదటిపద్ధతే బాగా నచ్చింది. ఎందుకంటే రెండవదాంట్లో చాలా చిక్కులున్నాయికాబట్టి. అందువల్ల మేము (నేను, ఇద్దరు పోలీసు

★ దొంగరాముడు ★

ఇన్‌స్పెక్టర్లు) జీప్‌లో బయలుదేరగానే, వాళ్లతో అరవై డెబ్భైమైళ్ల స్పీడులో చెలమవైపుకి పోనీయమని చెప్పాను. 'అబ్బే, వాణ్ని బొగదదగ్గిరే కాయాలయ్యా' అన్నారు వాళ్లు. 'కాదు, నా మాట వినండి, చెలమకి పోనియ్యండి' అన్నాను. పోలీసుల్ని అందులో అటు బెజవాడనుండి ఇటు గుంతకల్లు, అటు మద్రాసు, ఇటు విశాఖపట్నంవరకూ ఉన్న పోలీసుల్ని రెండేళ్లబట్టీ తిప్పలు పెడ్తున్న దొంగరాముణ్ని పట్టుకోబోతున్నామన్న ధీమాతో ఈ ఇన్‌స్పెక్టర్లు ట్రాఫిక్ రూల్సుని గూడా అతిక్రమించి జీప్‌ని డెబ్భైమైళ్ళ స్పీడుతో లాగేశారు. అందువల్ల చెలమదాటిన ఐదు మైళ్ళలోగానే నంద్యాలవెళ్ళే బస్సుని మేము కలుసుకోగలిగాం. వెంటనే బస్సు ఆపి వాళ్ళిద్దరూ సోదాచేస్తుంటే, నేను కండక్టర్‌ని అడిగాను. 'ఆ కాఫీరంగు ఉలన్ సూటు వేసుకున్న పెద్దమనిషి ఎవరైనా బొగద టనెల్‌వద్ద ఎక్కాడా' అని. వెంటనే వాడు 'ఆ, సరిగ్గా అక్కడే అలాంటాయన ఎక్కి చెలమ బస్‌స్టాండువద్ద దిగిపోయారండి' అన్నాడు. ఈలోపల వెర్రిమొహాలతో ఆ ఇన్‌స్పెక్టర్లు నావద్దకు వచ్చారు. నేను జరిగిందిచెప్పి, బస్సుని దాని దారిన వెళ్ళనిచ్చి, జీప్‌ని వెనక్కి తిప్పించాను. ఇంతవరకూ నేననుకున్నట్లుగానే జరిగింది. బొగదలో బస్సెక్కడమూ చెలమవద్ద దిగడమూ. కాని అతనిప్పుడు ఎక్కడ దాక్కున్నాడు? ఇంకో రైలు రావడానికి ఆరుగంటలు వ్యవధి వుంది. చెలమనుండి బొగద ఎనిమిదిమైళ్ళు మాత్రమే. అంటే త్వరగా నడిస్తే రెండున్నర గంటలకన్నా ఎక్కువపట్టదు. వాడుకూడా నాలాగే ఆలోచించేవాడైతే చెలమలో దిగి, కాలినడకన ఏమాత్రం అవసరంవున్నా పొదల్లో దాక్కుంటూ బొగదవచ్చి రైలు కివతల ఎక్కడైనా దాక్కుని రైలెక్కడానికి ప్రయత్నించాలి. దీనివలన ఎంత తెలివయిన పోలీసైనా సరే బోల్తాపడి చెలమప్రాంతాల్లోనే తచ్చాడుతాడుకాని ఏబొగదనుంచి వాడుబస్సుమీద ఇక్కడదాకా వచ్చాడో ఆ బొగదకి కాళ్ళీడ్చుకుంటూ తిరిగి వెళ్తాడని అనుకోడు.

చెలమలో వాడు దిగేటప్పటికి 4 గంటల 5 నిమిషాలు ఐందట. మేము తిరిగి చెలమ వచ్చేసరికి నాలుగు గంటల 45 నిమిషాలైంది. చెలమ బస్సుస్టాండులో వాడు టీ త్రాగి రోడ్డుమీద కొంచెం బొగదవైపుగానే నడిచినట్లు ఆచూకీతీసాం. అంటే వాడు సరైన నడకసాగించేసరికి 4-10 ఐఉంటుంది. 4-20 కల్లా మా జీపు వాడికి కనిపించి ఉండాలి. అంటే ఒక ఐదు నిమిషాలవరకూ వాడు నడక చాలించి దాక్కుని ఉండాలన్నమాట. అంటె ఇప్పటికి వాడు అరగంటసేపు నిర్భయంగా నడిచి ఉండాలి. అంటే దాదాపు రెండు మైళ్ళు అని లెక్కపెట్టుకోవచ్చు. దీన్ని నేను ఆధారంగా తీసుకొని డ్రైవింగ్ తీసుకొని తిరిగి బొగదవైపు ప్రయాణం సాగించాను. ఈ నా పథకం ఏమాత్రం అర్థంకాలేదు పాపం ఈ ఆఫీసర్లకి. అందుకే నా నడవడికి ఆశ్చర్యపోయి, నేనే ఆపద్బాంధవుడిలా నా మాటబట్టే నడిచారు. వారికే ఈమాత్రం తెలివుంటే నేను వారిముందు కూర్చుని ఇలా డ్రైవింగ్ చేస్తూ ఉండేవాణ్నా?

సరిగ్గా రెండుమైళ్లు రాగానే కారుని ఆపి దిగి రోడ్డు పరీక్షించాను. వెంటనే ఒక్క పెద్ద నవ్వు నవ్వాలనిపించింది. నాకున్న ఊహావల్ల ఆ వ్యక్తి రైలుపెట్టె ప్రవేశించగానే అతను సరికొత్త బాటాబూట్లు తొడుక్కున్నట్లు గ్రహించాను. నేను కారు ఆపిన చోటే రోడ్డుపక్కన ఉన్న బురదలో ఆ ఆ బూట్లగుర్తు కనిపించింది. అంతేకాదు. ఆ గుర్తు రోడ్డుపక్కనేఉన్న దిబ్బమీదకి దారితీసింది. దిబ్బనిండా ముళ్ళూ అవీ ఉన్నాయి. అంటే వాడు ఆ దిబ్బ ఎక్కడానికి కారణం మా జీపుని చూడడమన్నమాట. అంటే ఇప్పుడు వాడు ఆ దిబ్బ అవతల ఎక్కడో ఉన్నాడన్నమాట. అందుకే నాకంత సంతోషంవేసింది. వెంటనే వాళ్ళిద్దర్నీ పిలిచి, సంగతంతా చెప్పాను. వాణ్ని పట్టుకుందాం అని చంకలెగరేసుకుంటూ వచ్చారేగాని, వాడు ఇక్కడ ఓ ఫర్లాంగులోగా ఉన్నాడనేసరికి తెల్లమొహం వేశారు వాళ్ళిద్దరూను. అప్పుడు వారిలో ఒకరివద్ద రివాల్వరు తీసుకొని, వాళ్ళలో ఒకతన్ని రోడ్డుకు ఎగువగా ఓ ఫర్లాంగులోనూ, రెండవఅతన్ని దిబ్బమీద కారువద్ద ఉండమని నియమించి, నేను ఎప్పుడు రివాల్వరు పేలుస్తానో ఆ క్షణం వారిద్దరూ అది వచ్చిన దిక్కుగా పరిగెత్తి రావలసిందిగా చెప్పి, బయలుదేరాను.

అతి కష్టంమీద దిబ్బదాటి ఓ ఘోరాటవిలో అడుగుపెట్టాను. ఎక్కడ చూసినా చెట్లు, పుట్టలూ, కాని వాడి అలికిడి ఎక్కడా వినిపించడం లేదు. నేను వచ్చేలోగా వాడు ఈ ప్రాంతాలనుండి పారిపోవడం అసంభవం. అలికిడి లేదుకాబట్టి ఇప్పుడు వాడు పరిగెత్తడం లేదు. అంటే ఏ చెట్టు చాటునో దాగి నాకు ఎసరు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడన్నమాట. నాకు నవ్వు వచ్చింది. రైల్లో నేను నిద్రలో ఉన్నాను కాబట్టి వాడికి లొంగాను. లేకపోతే నేనా ఇలా గొడవలో పడేది? నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, అన్నివైపులా చూస్తూ 150 గజాలు నడిచాను. ఇంతలో ఐదు గజాల దూరాన్న ఉన్న చెట్టుపక్కని పొదలో చిన్న కదలిక నా కళ్లకి అనింది. వెంటనే వాడు ఆ చెట్టుచాటున నక్కిన విషయము, నేను ఇంకో రెండడుగులు ముందరకు వేసే నామీదకు దూకడానికి ప్రయత్నించడానికి సిద్ధపడడంలో ఆ పొద కదిలిందనీ కనిపెట్టాను. వెంటనే ఆగి "ఏయ్ మిస్టర్, నువ్వాట్టు వెనక ఉన్న విషయం నాకు తెలుసులేగాని ఇవతలికి రా కొంచం మాట్లాడాలి" అన్నాను. ఏమీ జరగలేదు. కాని రెండోసారి రెట్టించేసరికి, వ్యవహారం ముదిరిందని తెలుసుకున్నాడు "కాబోలు ఇవతలికి వచ్చి నుంచున్నాడు. నేను రివాల్వరును అతనివైపుకి గురిపెట్టి "నీలాంటి తెలివయిన వాణ్ని చూసినందుకు చాలా సంతోషంగా ఉంది. నా పాకెట్ బుక్కూ, ఆవిడ సూట్‌కేసులో నువ్వు తీసుకుని మూటకట్టి పెట్టుకున్న ఆవిడ నగలనూ ఇలాపారేసి నీదారిన నువ్వెళ్ళు. నీకేబాధా లేకుండా నేను చూస్తాను" అన్నాను. ఇంకా అంటూనే ఉన్నాను. అతను ఒక్క ఉరుకున నామీద పడి నా కుడిచేతిలోని రివాల్వర్ని ఎగరేసాడు. కాని నేను నిద్రలో లేనన్న సంగతి మర్చిపోయాడు పాపం. నా కుడిచేతిలోని రివాల్వరు ఆకాశంలోని కెళ్ళడం, నా ఎడమచేయి అతని గెడ్డం గట్టితనాన్ని చక్కగా గుచిమాడడం, 'చచ్చాను' అంటూ అతను


(63-వ పేజీ చూడండి)



(నాటిక)

నీలి తెరలు

అంగర సూర్యారావు





(గత సంచిక తరువాయి)

(కిశోర్ తిరిగి కుర్చీలో కూర్చుని పోర్షన్ చదవడానికి ప్రయత్నిస్తూవుంటాడు. చక్కగా ముస్తాబై హేండ్ బేగ్‌తో చకచకా మేడమెట్లు దిగివస్తుంది చిత్ర.)

చిత్ర: (కిశోర్‌ను అకస్మాత్తుగా చూసి చకితయై) కిశోర్!

కిశోర్ : (తలపైకెత్తి కొత్తమనిషిని చూసి నట్లు చూస్తూ)

చిత్ర: రెండురోజుల్లో నేమరిచిపోయావా నన్ను?

కిశోర్ : మనస్ఫూర్తిగా మరిచిపోదలిస్తే రెండురోజులు కూడా అవసరం లేదు. రెండుక్షణాలలో మరిచిపోవచ్చు. సరే దానికేం! ఎక్కడికో వెడుతున్నట్లున్నారు. వెళ్ళిరండి

చిత్ర : నేను ఎక్కడికి వెడుతున్నానో నీకు తెలుసా?

కిశోర్ : తెలియదు. (నిర్మొహమాటంగా) తెలుసుకోవాలన్న కుతూహలంకూడా నాకు లేదు.

చిత్ర : ఎంత కటువుగా మాట్లాడుతున్నావు!

కిశోర్ : నగ్నసత్యం కటువుగానే ధ్వనిస్తుంది. ఈ కాలపు మనుషులకు మోసం, వంచనలతో కూడిన మాటలే మధుర మధురంగా వినిపిస్తాయి.

చిత్ర : మా నాన్నగారి మాటలు నీ హృదయాన్ని గాయపరిచి వుండవచ్చు. అంత మాత్రాన్ని నువ్వు...

కిశోర్ : (మధ్యలో అందుకొని) లేదు. లేదు. అదిఅంతా అప్పుడే మరిచిపోయాను. ఇక దయచేసి ఆ విషయాలు నాకు జ్ఞాపకం చెయ్యకండి.

చిత్ర : నిజంగా నీకు చాల అన్యాయం జరిగింది కిశోర్. మాఅంతట మేమే ముందు పొరబాటుపడి — పైగా నిన్ను నిందించాం. నిన్ను ఈరోజు ఎలాగైనా వెతికి పట్టుకొని క్షమార్పణ చెప్పుకోవాలని బయలుదేరాను. మేడ దిగీదిగడంతోనే నిన్ను ఇక్కడే చూసి నా కళ్ళను నేను నమ్మలేకపోయాను.

కిశోర్ : (చేతిలోని కాగితాలకేసి చూసి) నాకు పోర్షన్ చదువుకోడానికి టైంచాలదు దయచేసి ఇక మీరు నన్ను ఒంటరిగా విడిచి పెట్టాలి.

చిత్ర : మనుషుల జీవితాలకంటె నాటకం ముఖ్యమా?

కిశోర్ : ఒకవిధంగాచూస్తే ముఖ్యమే! కళకోసం ఎంతమంది మహామహులు తమ జీవితాలను ధారపోయలేదు?

చిత్ర : నీతో నేను కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. ఆతరవాత నీఇష్టం. నాటకంలో వేషంవేసినా సరే! భరత నాట్యం చేసినా సరే!

కిశోర్ : ఒకసారి పరాభవంజరిగిన యీ ప్రదేశంలో తిరిగి మీతో మాట్లాడడం నాకు ఎంతమాత్రం యిష్టంలేదు.

చిత్ర : అలా అయితే మరీ మంచిది. నిన్ను వెతికేందుకు టాక్సీని పిలిపించాను. వాళ్ళకు వృథాగా కిరాయి యిచ్చేకంటే కొంతసేపు ఎక్కడికైనా షికారుపోయి వద్దాం, రా! అక్కడే స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు. బయట కారు సిద్ధంగా వుందిలే!

కిశోర్ : యిప్పటికే నా మనసు చెదిరిపోయివుంది. దయచేసి యిక నన్ను బాధ పెట్టకండి. మీ దారిని మీరు వెళ్ళండి.

చిత్ర : ఈ ఒకసారీ నా మాట విను. సముద్రతీరంలో కొన్ని నిముషాలు తిరిగితే చెదిరిన మనసు కుదుటపడుతుంది. అర గంటలో తిరిగివద్దాం. యికలే! (అతని చెయ్యి పట్టుకొని ముందుకుతీసుకువెడుతూ) దండపాణీ! దండపాణీ!

దండ : (కుడివైపునుంచి ఎదురు వచ్చి ఇద్దరినీ ఆ స్థితిలోచూసి ఆశ్చర్యపోయి తిరిగి వెంటనే తేరుకొని) కారు సిద్ధంగా వుందండి. కాని ఎక్కడికి తీసికెళ్లాలో కనుక్కోమంటున్నాడండి డ్రైవర్.

చిత్ర : (కోపంతో) మా యిష్టంవచ్చిన చోటికి వెడతాం. అది అంతా ముందే డ్రైవరుకు చెప్పాలా? ఎవరా డ్రైవర్?

(చిత్ర, కిశోర్ చెయ్యీ చెయ్యీ పట్టుకొని కుడివైపు నిష్క్రమిస్తారు. — దండపాణి నోరు తెరుచుకొని—చలనం లేకుండా— నిలబడి పోతాడు. జయరాం ఎడమవైపునుంచి వస్తాడు.)

జయ : (దండపాణి భుజంమీద చెయ్యి వేసి) ఏమిటి అలా చూస్తున్నావు? కిశోర్ ఏడీ?

దండ : (వెనక్కి తిరిగి) ఆగవయ్యా! అమ్మాయిగారు మీ తుషార్ గార్ని యెక్కడికో లాక్కుపోతన్నారు.

జయ : (నిస్పృహతో) హరి భగవాన్! వీడు మళ్లీ అమ్మాయితో వెడుతున్నాడూ!!—

★ నీలి తెరలు ★

ఎక్కడికి వెడుతున్నారో అడగలేక పోయావూ ?.

దండ : అడిగేనయ్యా బాబూ! అడిగేను!

జయ : అడిగితే ఏమన్నారు ?

దండ : అబ్బాయిగారు బెల్లం కొట్టిన రాయిలా మాటామంతీ లేకుండా నిలబడి పోయారు. అమ్మాయిగారు మాత్రం మా ఇష్ట మొచ్చిన చోటికి వెళతాం పొమ్మన్నారు.

జయ: (నిస్పృహతో నిలువునా కుర్చీలో కూలబడి) హా! చచ్చితిమి! పిల్లిద్దరూ కలిసి ఎక్కడికైనా పలాయనం చిత్తగిస్తున్నారేమో ! (దండపాణిని కౌగలించుకొని) హా! దండపాణీ ! అదే నిజమయితే వామనమూర్తి గారు నన్నూ నిన్నూ స్తంభానికి విరిచి కట్టేశారన్నమాటే !

దండ : (కోపంతో) ఆయనా నువ్వు ఒకటిగనక నిన్ను యెలాగా కట్టేస్తారు. మధ్యని నన్ను ఎందుకు కడతారూ అంట!

జయ : వాళ్లకు కారు తెచ్చి పెట్టినవాడు ఎవడూ అంట!

దండ : (పరిస్థితి తెలుసుకొని) అమ్మ బాబోయ్! కొంప మునిగిపోయింది. (విచారంలో) అయితే యింక మనకేందారి జై సీతారాం బాబూ!

జయ : మన యిద్దరిదీ గోదావరివరకూ ఒకటే దారిరా నాయనా! (తనను తాను ప్రశంసించుకుంటూ) ఔరా! జయరాం! నీవు హరిశ్చంద్రుడికంటే గొప్పవాడవురా! హరిశ్చంద్రుడు కేవలం తన స్వార్థంకోసం-తన సత్యవాక్య పరిపాలనకోసం-అష్టకష్టాలు అనుభవించాడు. కాని నీవు ఒక మిత్రుని కొరకు కష్టాలకు గురియైపోతివిగదా? నన్ను కని, పెంచి, నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అమ్మనన్నిక మరిచిపొమ్మ! పరోపకారము కొరకు యీ జయరాం వంశె మంతరించెడు గాక! హా! దండపాణి!

దండ : (కోపంతో) వూరుకోవయ్యా! చెవ్వుకోసిన మేకలా అలాగ అరుస్తావెందుకు ?

(ఎడమవైపు నుంచి నిరంజన్, ఆనంద్ వస్తారు.)

నిరం : కిశోర్ కనిపించడేం?

జయ : (విచారంతో) యింకెక్కడి కిశోర్! ఎగిరిపోయాడు.

నిరం
ఆనంద్ } : (ఆశ్చర్యంతో) ఏమయ్యింది ?

దండ : అమ్మాయిగారు అబ్బాయిగారు చెట్టాపట్టాలు వేసుకుని కారులో యెళ్లి పోయారు.

నిరం : ఎక్కడికి ?

జయ : అది తెలిస్తే యిక కావలిసిందేముంది !

నిరం : (చిరాకుతో) క్షణక్షణానికీ ఏదో ఆటంకం. యిక యిక్కడ మన ప్రయత్నాలు కొనసాగేలా కనిపించవు.

ఆనంద్ : అసలు యీ స్థలం జయమైనది కాదు. మరోచోటికి ఎక్కడికైనా శీఘ్రమే కంపెనీ ఎత్తివెయ్యడం శ్రేయస్కరం.

నిరం : ఆ ఉద్దేశం వుంటే రాత్రిపూట మార్చడమే మంచిది. తక్షణం ఎవరి సామాన్లు వాళ్ళు సర్దుకోండి. యీ రాత్రికి ఏ సత్రంలోనో దిగుదాం పదండి.

(నిరంజన్, ఆనంద్, జయరాం, దండపాణి ఎడమవైపు నిష్క్రమిస్తారు. కుడివైపునుంచి వామనమూర్తి వస్తాడు.)

వామ : (హాలులో తిరుగుడూ) చిత్రా! చిత్రా! (జవాబు లేక పోవడం చూసి కోపంతో బిగ్గరగా) దండపాణీ! దండపాణీ!

దండ : (ఎడమ వైపు కనిపించి భయ భక్తులతో) ఏం బాబూ?

వామ : పైకివెళ్లి అమ్మాయిని పిలుచుకురా! (ఏం చెప్పడానికి మాటలు రాక గుటక వేస్తూ చూస్తాడు దండపాణి) అలా కళ్లు తెరుచుకు చూస్తావేం? వినిపించడం లేదూ?

(64-వ పేజీ చూడండి)

సెప్టెంబరు వీరులు

ఆదివారం; అక్టోబరు 21 వ తారీఖు; మా సెప్టెంబరు పరీక్షలయి సరిగ్గా నెల కావచ్చింది; పరీక్షలు నాలుగురోజులూ కాకినాడ విశాల పురవీధులు అలవాటయి, యీ యిరుకుసందుల రాజమండ్రీ సెంట్రలు జైల్లావుంది; ఆదివారం అయినా యెక్కడికి వెళ్ళటానికి తోచక, పగలల్లా యింట్లోనే గడిపి, సాయంత్రం నాలుగింటికి కాఫీ తాగి, రోజూలాగానే దగ్గిరలో వున్న మునిసిపలు లైబ్రరీకి వెళ్లాను. అక్కడవుండే రెండు పేపర్లు రెండు మాగజైనుల్లో "హిందూ" తీశాను; మొదటి రెండు పేజీల్లో అలవాటుప్రకారం wanted చూసాను; అంతగా అప్లయి చెయ్యాల్సినవేమీ లేకపోవటంవల్ల, లోపల యేమన్నా సర్వీసు కమీషను ప్రకటనల లాంటివి వుంటాయేమోనని మిగిలిన పేజీలు మెల్లిగా తిప్పుతున్నా; మధ్యపేజీ చూడటం అలవాటు పోవటంవల్ల, అది కూడా తిప్పేసరికి గబుక్కుని మోకాళ్లవరకూ అయిసులో కూరుకుపోయినట్లయింది; "Andhra University Examinations results...B.com"—మసగ మసగ్గా కనిపించేయి. పేపర్ని కళ్ళ దగ్గిరగా లాక్కుని ఆఖరిపార్టుమీదికి దృష్టి పోనిచ్చాను. నెంబర్లు అలుక్కుపోయినట్లు వున్నాయి. నా నెంబరు వుండాల్సినచోట వేలు ఆగింది—నెత్తిమీద తాటిపండు పడ్డట్లయింది. నెంబరు కనిపించలేదు. కళ్ళు పెద్దవిగాచేసి గట్టిగా చూశాను; అయినా కనిపించలేదు. మళ్ళీ ఒకసారి "Andhra.. results...B.com" అని చదివి మళ్ళీ చూశాను, ఈసారీ కనిపించలేదు. ఇలా పైనించి నా నెంబరు వుండాల్సిన చోటికి, అక్కడనుంచి కిందికీ ఎగాదిగా 20, 30 సార్లు చూసివుంటాను. అలా యెందుకు చూస్తున్నానో నాకే తెలియదు. అసలు అప్పుడు దృష్టి కళ్లవెనకాల రెటీనామీద పడుతోందో లేదోకూడా అనుమానమే.

పోనీ త్రొక్కిపెట్టబడినవి, తరవాత ప్రచురించబడేవి యేమన్నా వున్నాయా అంటే, మచ్చుకి ఒక్క నెంబరూ లేదు; తలంతా దిమ్మెక్కినట్లుంది; శేషూ, రామూ యేమయ్యారో అని చూసాను; ప్యాసయ్యారు. వీళ్ళవికూడా పడకుండా వుంటే మనస్సుకి యెంత యిదిగా వుండేదీ అనిపించింది.

అసలు తప్పుచూస్తున్నానేమో; నా నెంబరు పేపరులో పడిన యింకో నెంబరేదేనా నేమో అనిపించి, గబగబా యింటికివచ్చి పెట్లోంచి హాలుటిక్కెట్టుతీసిచూసాను. అదే నెంబరు; యేమీ తేడాలేదు; అయితే, యీసారి స్థిమితంగా చూడాలని మళ్లీ లైబ్రరీకి వెళ్లాను; అబ్బే! లేందే; కాని పరీక్షలో అంగరక్షకులుగా వుంటూ వచ్చిన నా అటూ యిటూ నెంబర్లు రెండూ మటుకు వున్నాయి. వీళ్లు వట్టి చచ్చుదద్దమ్మలాకనిపించారే; వీళ్లు ప్యాసవటమేమిటి. బహుశా! నెంబర్లల్లో పొరపాటు కాలేదు

"స్వర్ణ"

కదా—వీళ్ళ పేపర్లకి నా నెంబర్లు అంటించి, నా పేపర్లకి వీళ్ళ నెంబర్లు అంటించలేదు కదా అనిపించింది. కాని వెంటనే అలా అనుకోవటమే పొరపాటేమో అనిపించింది. అయినా ఇవి రిజల్ట్సని ఎవరేనాఅనుకుంటారా? చాలా మంది ఇవి చూడకుండానే పేపరు చదివి పారేస్తారు కూడానూ. అసలు నాకు కనిపించటమే ఆశ్చర్యంగావుంది. తలుపుసందుని చీపురుకట్టలా, యెంత మూలగా వేశారూ- ఎంతమంది పాసయివుంటారో అని లెక్కపెట్టాను. చాలా తక్కువమంది, అనుకునేసరికి మనస్సు కొంత తేలికపడింది.

ఇలా కాస్త స్తిమితం చిక్కాక, అక్కడనుంచి లేచి యెదురుగుండానే వున్న పార్కులోకివెళ్ళి, ఒకమూలగా చతికిలపడ్డాను. అసలే అదోలావుంది. దీనికితోడు రేడియోలో ఒక అంబాళ్ అసావేరీరాగంలో పాట. చెవులలో దూది పెట్టకోవాలనిపించింది. మళ్ళీ చదవాల్సిన యింతంత లావు పుస్తకాలు పరీక్షల్లో మూడు నాలుగింటి వరకూ వాటితో కుస్తీపట్టిన రాత్రులు జ్ఞాపకానికి వస్తున్నాయి.

నరాలు వుండచుట్టుకు పోతున్నట్టనిపించింది. అక్కడే పోషకం లేకుండానే పెరుగుతూన్న గడ్డిని గుప్పెడు పీకి పైన పడేశాను; కొంచెం సద్దుకున్నట్టయింది.

అప్పుడే కాలేజీ వదిలేసి మూడు సంవత్సరాలుపైగా అవుతోంది. యింకా యెప్పటికీ విముక్తి; యివాళే కనక ప్యాసయి వుంటే యెంతబాగుండేది-Father కి యెంత వుత్సాహంగా వుండేది-ముఖ్యంగాMother యెంత సంతోషించేది. అబ్బ! గుండె తరుక్కుపోతోంది; యింక Father యింట్లో వుండనిస్తాడా?—ఏమంటాడు? పైకి యేమి అవలేడు, పాపం-ఏమనుకుంటాడు? ఇంకఆయనముందు అన్నం-ముఖ్యంగా పూటకి రెండుసార్లు కాఫీ యెలా తాగటం-చచ్చిపోతేనో-ఛా! పరీక్షపోయినంతమాత్రాన నిండుప్రాణాన్ని తీసుకుంటామా-యెంత తెలివైన వాణ్ణి, పరీక్షలంటే ఖర్మంచాలక పోతున్నాయిగాని, నేను ముందు వీళ్ళందర్నీ సుఖపెట్టవల్సిన వాణ్ణికదా-నాలాంటి వాడు మళ్ళీ యెలా దొరుకుతాడు, పాపం;—పోనీ, పారిపోతేనో—అదల్లా! చేతిలో కానీకూడా లేదు; యేదేనా వచ్చేవరకన్నా వుండాలిగా; వెంటనే వుద్యోగం దొరుకుతుందని గ్యారంటి యేమిటి; తిండిలేక స్పృహతప్పి పడిపోతే యెవరోవచ్చి యింటికి తీసుకువెళ్ళి ఆదరించడానికి యిది సినిమా కాదుగా; పైగా లేచీ లేవగానే కాఫీ యెక్కడనుంచి వస్తుంది — పిక్‌పాకెట్టు అయితే; యింకేమన్నా వుందా - జైళ్ళకి వెళ్లాలి - అప్పుడు

(63-వ పేజీ చూడండి)

పాదప్రహారం

పి. గణపతిశాస్త్రి

౧

మాధవుడు భట్టశ్యామిలకుని చూసీ చూడగానే తాంబూల చర్వణం ఆపి వేసి సగౌరవంగా ప్రత్యుత్థానం చేసి అతన్ని తన సరసనే కూర్చో బెట్టుకున్నాడు. వ్యంగ్యంగా చిరునవ్వు చిందించి నెమ్మదిగా అడిగాడు:

"ఇదేమిటి విటశేఖరులు భట్టశ్యామిలకు లీవేళ ఇలాగ విచ్చేశారు!"

"ఒక పెద్దరాచకార్యమేవచ్చిందయ్యా!"

"ఇంతటి విటశేఖరులు మీకు రాచకార్య మేమిటండీ!" అని ఎంతో ఆశ్చర్యపడ్డాడు మాధవుడు. శ్యామిలకుడు వెటకారంగా నవ్వాడు:

"మన విష్ణునాగుడే తెచ్చిపెట్టాడీ లేని పోని రభస అంతాను!"

"ఏమి చేశాట్ట!"

"ఎప్పుడు వేశ్యవాటిక వీథిపైపేనా తొంగి చూడని ఆ మహానుభావుడు మొన్న మన మదనసేనిక భవంతికి విజయం చేశాడు."



"ఎన్నడు పెద్దలమాట జవదాటని మహా నిష్ఠాపరుడు, అతగాడికీ చిద్విలాసం ఎందుకు కలిగిందో!"

"మన భవకీర్తి లేడు ఇలాంటివాటి కన్నిని! అతగాడే చేశాడిదంతా!"

మాధవుడు తన.కేమీ బోధపడలేదన్నట్లదే తీరులో శ్యామిలకునివైపు చూచాడు. శ్యామిలకుడు మళ్ళీ ఒక వెకిలినవ్వు నవ్వాడు:

"ఆ భవకీర్తి మనవాడితో ఏమన్నాడూ! నీకేమి భయంలేదులే. నే నన్నానుగా. ఇది రెండోకంటివాడికి తెలియనివ్వనులే! అని మెల్లిగా బుజ్జగించి మన విష్ణునాగమ్మని చాటుమాటుగా ఆ మదనసేనిక భవంతికి తోడుకుపోయాడు."

"సరే! ఇంతకీ అంత రభస ఎందుకు జరిగింది!"

"చెబుతూంటేనే! మన విష్ణునాగుడు తను మహాభరతశాస్త్రవేత్త అనిపించుకోవాలనే ఖేమజంకొద్దీ రాధికాభినయం పట్టవలిసిందని మదనసేనిక నడిగాడు."

"చక్కగానే అడిగాడు! బాగానే ఉంది! దానికేం!"

శ్యామిలకుడు పొంగిపొంగి వస్తూన్న నవ్వాపుకుని మళ్ళీ మొదలుపెట్టాడు:

"అసలు కథంతా ఆపైనే ఉంది! ఆ మదనసేనిక మాత్రం తక్కువతిందా! అది మన చచ్చునాగమ్మ ధోరణి అంతా ఒక్క క్షణంలో పసిగట్టివేసింది. ఆపైన దాని కొంటెతనం నువ్వు కొంచెం చవి చూచావుగదా! అది ఏమి చేసిందీ, ఆ అభినయం మొదలుపెట్టి సరీగా రాధిక శ్రీకృష్ణస్వామివారిని తన పాదారవిందంతో అనుగ్రహించే రసవత్తర ఘట్టంలో తన పాదాగ్రంతో విష్ణునాగని శిరస్సుపై అలవోకగా స్పృశించింది!"

ఆ మాట విని మాధవుడొక్క నవ్వు నవ్వాడు:

"వహవ్వా! ఆ విష్ణునాగు డెంతటిఅదృష్ట వంతుడయ్యా! అందుకనే ఆదికవి వాల్మీకి అలాగ సెలవిచ్చాడు! ఏతి జీవంత మానిందో నరం వర్షశతాదపి! బతికి ఉంటె నూరేళ్ళకైనా మనిషి అన్నవాడి కేదో మహాభాగ్యం పట్టి తీరుతుంది. నిజమే!"

అని ఆపైన శ్యామలకుడు చెప్పేది తిన్నగా వినిపించుకోకుండా అదే పనిగా నవ్వడం మొదలుపెట్టాడు. శ్యామిలకుడు తాను చెప్పేదింకా పూర్తికాలేదని అతని కడ్డుతగలాడు. సరేనని మాధవుడతడు చెప్పేదంతా శ్రద్ధగా ఆలకించాడు. శ్యామిలకుడు మొదలుపెట్టాడు:

"జరిగిన రభసంతా ఆపైనేజరిగింది. మదనసేనిక పాదాంగ్రంతో అలవోకగా తాకగానే విష్ణునాగుడు తోకతొక్కిన తాచులా మండిపడ్డాడు. ఆమె ఆవిధంగా తన తల తన్నడంతో తన ఆర్షేయపౌరుషేయాలన్నీ అమాంతంగా మంటగలిసి పోయాయని వలవలా పోయాడు. తననిష్ఠలు, నియమాలు, అన్నీ గంగలో కలిసిపోయాయనీ తన కిక ప్రాయశ్చితం తప్ప గత్యంతరం లేదనీ తల పట్టుకుని తేలుకుట్టినట్టుగా అదేపనిగా విలవిలలాడడం మొదలుపెట్టాడు.

"పాపం! మదనసేనిక ఆ అఘాతంతో నిలువునా నీరయిపోయింది. తనవల్ల పెద్ద తప్పిదమే జరిగిపోయిందనీ ఇక ఎప్పుడు ఇలాంటి మహాపచారం చెయ్యననీ అనేక విధాలుగా అతన్ని కాళ్ళ వేళ్ళాపడి బతిమాలుకుంది. కాని విష్ణునాగుడిక ఆమెమాట చెవి కెక్కనీయలేను! ఇక అక్కడ ఒక్క నిమిషమైనా నిలబడనని తటాలున లేచి నిలబడ్డాడు.

"భవకీర్తి అంతవరకు నోటమాటలేక అలాగే అక్కడ కూలబడిపోయాడు. విష్ణునాగుడు తటాలనలేచి నిలబడేసరికి అతని కేమితోచిందో! అతడుకూడా విష్ణునాగునికి బాగా పక్కతాళం వేశాడు. ఆపై క్షణంలో వారిద్దరు మదనసేనిక భవంతిదాటి రాజవీథిలో పడ్డారు."

అని శ్యామిలకుడదేపనిగా వెకిలిగా నవ్వాడు. ఈమారు మాధవుడతని కడ్డుపడ్డాడు:

"అయితే మధ్యన ఈ రభస అంతా ఎందుకు?"

"విష్ణునాగుడు స్వయంగా విట పరిషత్తు వారిని తనకు ప్రాయశ్చిత్తం విధించవలసిందని అభ్యర్థించాడయ్యా! అందుచేతనే ఈ వేళ గోధూళివేళ విట మండలివారంతా విట మంటపంలో సమావిష్టులౌతున్నారు! నీవు తప్పక విట మంటపానికి విజయంచేసి



విష్ణునాగునికి ప్రాయశ్చిత్తం సెలవిప్పించాలి! నీవు కేవలం విటధర్మవేత్తవుగదా!"

అని శ్యామిలకుడు ధూర్తవినయం నటిస్తూ మాధవుని ఎదుట నుదుటిపై అంజలి ఘటించి కొంచెం తలవంచి సగౌరవంగా నిలుచున్నాడు.

మాధవుని కదంతా ఒక పెద్ద అభూత కల్పనగా, కపట నాటకంగా కనిపించింది. కాని శ్యామిలకుడు చెప్పేదంతా వట్టి కల్ల అని కొట్టివెయ్యడానికి కూడా అతనికి మనసొప్పలేదు. కొంచెం సందేహిస్తూ అడిగాడు:

"అయితే ఆ విష్ణునాగుడా ప్రాయశ్చిత్తం సంగతి ధర్మశాస్త్రజ్ఞుల్ని అడగకుండా విట పరిషత్తువారి నెందుకడుగుతున్నాడు?"

"నాకు అప్పుడే వేళ మించిపోతూంది! నే నివ్వన్నీ నీ కెరిగించడానికిప్పుడు తీరిక లేదు. అన్నీ అక్కడే తెలుస్తాయి. తప్పక విట మంటపానికి విజయం చెయ్యాలి!"

అని శ్యామిలకుడు త్వరగా అడుగులు వేసుకుంటూ రాజవీధిలో పడ్డాడు. మాధవుడు కొంతసేపటివరకు అలాగే దిగాలుపడి నిలుచున్నాడు. ఆ విడ్డూరమేదో తెలుసుకోవాలని వెంటనే విటమంటపానికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

౨

సార్వభౌమ నగరం నవచైత్ర శోభతో కలకలలాడింది. సాయంకాల వేళ నీరెండలలో నగరోద్యానాలలో రాలిపడిన పుష్పాడి తళతళ లాడింది.

సంపన్నులయిన పౌరుల నేకులు గజాశ్వాందోళికాది వాహనాలమీద, కర్ణీరథాలమీద వాహ్యాళికి బయలుదేరారు. వాళం ద్ర

★ పాదప్రహారం ★

ముఖాలలోను, నూతన వసంతోత్సాహం వెల్లివిరిసింది.

కొందరు యువకులు వారాంగనలతో కలిసి, ఉత్తమాశ్వాలపై హుషారుగా స్వారి చేస్తున్నారు. మరికొందరు వారాంగన లుత్తమాశ్వాలపై ఒంటరిగానే స్వారిచేస్తూ తమ ఒయ్యారాలన్నీ పార్శ్వాలలో సాగిపోయే యువజనులపై ఒలకబోస్తున్నారు. కొందరుత్తమాంగన లాందోళికలలో సాగిపోతూంటే పైరగాలికి తొలిగినవారి మేను ముసుగులు పౌరుల కప్పుడప్పుడు సాయంకాలానికి పూర్వమే చంద్రోదయ విభ్రాంతి కలిగిస్తున్నాయి.

కాని ఆ నాడు రాజవీథిలో నిరుత్సాహంగా సాగిపోయే విష్ణునాగుని కొక్కనికే ఆ ఉత్సాహం అంతా ఏదో దారీ తెన్నూ లేని అనాచారంగా కనిపించింది. అతడలాగే తొందర తొందరగా విట మంటపం వైపు సాగిపోయాడు.

విష్ణునాగుడు సార్వభౌమనగర మహామాత్రుని పుత్రుడు. అతనితండ్రి స్వర్గస్థుడైనా ఆయనమీది గౌరవంవల్లనయితే నేమి, విష్ణునాగుని సేవాతత్పరతవల్లనయితే నేమి సార్వభౌమ నగరాధీశ్వరునికొలువులో అతనికొక చిన్నపదవి దొరికింది.

విష్ణునాగుని కిప్పటికీ ఇంకా ఇరవై ఐదు ఏళ్లయినా నిండలేదు. అయితే అతనికింతకు పూర్వమే వివాహం జరిగిపోయింది. వెంటనే భార్యకూడా కాపరానికి వచ్చివేసింది.

మొదటినించీ అతడు బాగా తండ్రి చాటుబిడ్డగానే పెరిగాడు. తండ్రి కాలం చేసి అప్పుడే రెండుమూడేళ్ళయింది. కాని అతనిలోని తండ్రిచాటుతనం ఇంకా అలాగే ఉండిపోయింది.

విష్ణునాగునికి తండ్రి సంపాదించిపోయిన ఐశ్వర్యం కొంత సంక్రమించింది. ఆపైన అతడు చాలా భయస్థుడు. పైగా కొంచెం అమాయకుడు. కనకనే ఎంతో గుట్టుగా సంసారయాత్ర సాగిస్తూ ఇరుగు పొరుగుల నోళ్లలో పడకుండా మర్యాదగా కాలక్షేపం చేసుకుంటున్నాడు.

విష్ణునాగుడెంతో నిష్ఠాపరుడు. దైవబ్రాహ్మణభక్తి అతనికి అనూచానంగా సంక్రమించింది. తెల్లవారు ఝామునే లేవడం, నియమాలు నిష్ఠలు, జపతపాలు మొదలైనవన్నీ ముగించుకోవడం, భోజనానంతరం కొలువుకూటానికి వెళ్ళిపోవడం, మళ్ళీ దీపదీపాలవేళ తిరిగి రావడం—అదీ అతని నిత్యదినకృత్యం! అంతేగాని అతడెన్నడు పురోద్యానాలవైపు వాహ్యాళికైనా వెళ్ళిన పాపాన పోలేదు.

తండ్రి గతించిన కొన్నాళ్లకతని ధోరణి కొంచెం మారింది. దానికి చాలా వరకు భవకీర్తే కారణం. భవకీర్తి విష్ణునాగునికి కొంచెం దూరబంధువు.

విష్ణునాగునికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినించీ భవకీర్తి కాతనిమీది ఆప్యాయత బాగా పెరిగింది. భవకీర్తి తన తాత ముత్తాతలు సంపాదించినదంతా నృత్యగీతాది ప్రసంగాల కింద అర్పేశాడు. ఇక అతనికారోజు గడవాలంటే ఎవరినో ఇంకొకరి నాశ్రయించక తప్పదు. ఆ సమయంలో అతనికి విష్ణునాగుని సంగతి జ్ఞాపకం వచ్చింది. అప్పటినించీ నెమ్మది నెమ్మదిగా అతనితో బాగా నేస్తం కలిపాడు.

భవకీర్తితో స్నేహం ముదిరినకొద్దీ విష్ణునాగునికి తన నియమాల మీదిపట్టు కొంచెం సడిలింది.

ఒకనాడు భవకీర్తి విష్ణునాగునితో మదనసేనిక భవంతిలో నృత్యం చూసివత్తామని అన్నాడు. విష్ణునాగుడు మొట్టమొదట దాని కంగీకరించలేదు. కాని ఊరు, వాడ వసంతోత్సవాలతో తలమునకలౌతూంటే అతనికికూడా కొంచెం ఉత్సాహం బయలుదేరింది. ఒకనాడు భవకీర్తితో కలిసి మదనసేనిక భవంతికి వెళ్లాడు.

కాని అక్కడ ఆ విద్దూరం జరగగానే విష్ణునాగుడు వెంటనే ధర్మశాస్త్రవేత్తలసన్నిధికి బయలుదేరాడు. భవకీర్తి అదే చక్కని మార్గమని చెప్పి చల్లచల్లగా తన ఇంటికి జారుకొన్నాడు. ఇక ఆనాటినించీ విష్ణునాగుడంటేనే అతనికి భయం పట్టుకుంది. అలాంటి పరమఛాందసుణ్ణి మదనసేనిక నృత్యగోష్ఠికి పిలుచుకుపోవడం ఒక పెద్ద తెలివి తక్కువపని అనుకొని రెండుచేతలతోను రెండు చెంపలు వాయించుకొన్నాడు.

విష్ణునాగుడు ధర్మవేత్తల సన్నిధికి వెళ్లి తనకు మదనసేనికవల్ల జరిగిన మహాపచారం అంతా ఆ మూలాగ్రంగా విన్నవించుకొన్నాడు.

తన తాతముత్తాతలు పరమభాగవతోత్తములనీ దుస్సాంగత్యంవల్ల తన కిటువంటి దురదృష్టం సంభవించినదనీ దానికి ప్రాయశ్చిత్తమేదైనా సెలవీయవలసిందనీ పరిపరివిధాలుగా వారి పాదాలపైపడి ప్రాధేయపడ్డాడు.

ఆ ధర్మవేత్తలతని ధోరణిని చూచి కొంచెం ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లో ద్విజన్ములు కూడా అంతగా పాటించని ఆచారం అంటే అతనికంతటి ఆస్థ కలగడం వారి కెంతో విచిత్రంగా కనిపించింది.

అక్కడ నలుగు రైదుగురు ధర్మవేత్తలేవో ధర్మసూక్ష్మాలు చర్చిస్తున్నారు. వారంతా తమ ధర్మశాస్త్రగ్రంథాలన్నీ గాలించి చూచారు. కాని వారికెక్కడా ఆ గ్రంథాలలో గణికాపాద ప్రహారానికి తగిన ప్రాయశ్చిత్తం కనిపించలేదు. వారా మాటే విష్ణునాగునితో అన్నారు. అయినా అతడు తన పట్టు విడవలేదు. వారంతా ఒకరి మొహాలొకరు చూచుకున్నారు. ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు. విష్ణునాగుడు వట్టి వెర్రి బాగులవాడనీ పైగా కొంత మూర్ఖత్వంకూడా దానికితోడైందనీ బాగా పసిగట్టేశారు. వెనువెంటనే వారిలో ఒక ధర్మవేత్త అతని కొక చిన్న సదుపదేశం చేశాడు. అది కేవలం విట పరిషత్తు నిర్ణయించవలసిన

ప్రశ్న అనీ విటమండలి దగ్గరకు వెళ్ళవలి సిందనీ ప్రోత్సహించాడు. విట సభాపతి భట్టిజీమూతు డతని ప్రార్థన విని ఆనాటి సాయంకాలమే విట శేఖరులందరు విట మండపానికి విచ్చేయ వలిసిందని ఆహ్వానిం చాడు.

విష్ణునాగుడు విటమంటపం చేరుకు నేసరికి సాయంకాల సూర్యకిరణాలు విటమంటపం వాకిట నిలిచిన కర్పూరథాలమీదే, గజాశ్వాందోళికాది వాహనాలమీది వెండిబంగారు మువ్వలుమీద చిత్ర చిత్రమైన రంగు రంగుల వసంతోత్సవ చూర్ణాలు వెదజల్లు తున్నాయి. అంతలో అతని కొక సౌధశిఖరంమీద పెంపుడు నెమలికి నృత్యం నేర్పు తున్న ఒక వారాంగన కనిపించింది.

అతడు తటాలున తన దృష్టి మరిఒక చోటికి మరల్చి వేశాడు. ఆ ప్రదేశంలో అతనికి వసంతోత్సవంలో ఒకరొకరిపై వసంతాలు చల్లుకొంటున్న యువతీ యువకుల కోలాహలం వినిపించింది. ఇంకొక చోట ఒక నెమలికేక వినిపించింది. అంతలో దూరదూరంగా నగరోద్యాన వనంలో సన్న సన్నని కోయిల పిలుపు వినిపించింది. విష్ణునాగుడు తటాలున తలవంచుకొని గొందరగా విటమంటపంలో ప్రవేశించాడు.

3

విటమంటపం ఆనాడు అతనికి సాక్షాత్తుగా వసంతోత్సవం రూపుదాల్చినట్టే కనబడింది. విష్ణునాగుడొక మూలసుఖాసనంమీదతన మేను జేర వేశాడు. విటశేఖరులు కొందతనినిచూచి ఎంతో మర్యాదగా పక్క పక్కలకు తొలిగిపోయారు. మరికొందరతనిని ఎగాదిగా చూచి చిగునవ్వులు నవ్వుకొన్నారు. ఇంకా కొందరతని ఘోషపట్టించుకోవడం మానివేసి మధుసేవలో నిమగ్నులై అటు ఇటు తూలుతూ కూర్చున్నారు. మరికొందరు గుంపులు గుంపులుగా చేరి పాచికలు విసిరి నేను గెలిచానంటే నేను గెలిచానని ఎగిరెగిరి గంతులు వేస్తున్నారు.

విష్ణునాగు డక్కడ జేరి వారందరి కేసి కొంచెం పరిశీలనగా చూశాడు. వారిలో చాలామంది అతనికి కేవలం అపరిచితులు. కొందరి ముఖాలతనిక కొంచెం చూచాయగా గుర్తుకొచ్చాయి. వారిలో కొందరు కేవలం విటులు. మరికొందరు నటులు. మరికొందరు గాన విద్యాప్రవీణులు. మరికొందరు కవులు. ఆ కవులలో కొందరు కాశీ కోసలాది ప్రాంతాలలో ఒక మద్యపాత్రకోసం తను చాటుకావ్యాలమ్మి వేసి ఆ మద్య పాత్రలతోనే తృప్తపడిన మహానుభావులు!

విష్ణునాగునికొనట విటగాయక కవిశేఖరులుతీరులు చూడగానే ఒళ్ళంతా ఒక్కమారుగా జలదరించింది. అతనికేదో ఒక వినూతన ప్రపంచంలో ప్రవేశించినటనిపించింది. "వీరందరు ఇలాగ భ్రష్టులయిపోతున్నారేమి?"

అని అతడు కొంచెం ఆశ్చర్యపోయాడు. నేనిక్కడి కెందుకువచ్చానా అని కొంచెం కించపడ్డాడు. కాని ఆపైన ఇక చేసేదేమీ లేక అలాగే ఆ సుఖాసనంలో కూలబడి పోయాడు.

అటుపిమ్మట విటమండలి సభాపతి భట్టిజీమూతుడు విటశేఖరులందరికీ ప్రస్తుత విషయం విన్నవించాడు:

"తామందరు వైదిక సంప్రదాయ వేత్తలు. విటాచారధర్మజ్ఞులు. మన విష్ణునాగుడు పరమనైష్ఠికుడు. మహాబ్రహ్మణ్యుడు! ఇతని శిరస్సు వేదమంత్రోకధారలచే పరిపూతమైనది. అటువంటి పరమనైష్ఠికుడు, విష్ణునాగుని శిరస్సు మదనసేనికి పాదస్పర్శచేత అపవిత్రమై పంకిలమైపోయింది.

"మీలో విటధర్మవేత్త లితనికి సముచితమైన ప్రాయశ్చిత్తం ఉపదేశింపవలెనని ఇత డందరికీ అంజలి ఘటించి సవినయంగా ప్రార్థిస్తున్నాడు."

భట్టిజీమూతుడు సదస్యులందరివైపు కొంచెం వ్యంగ్యంగా చూచి కన్ను గీటాడు.

★ పాదప్రహారం ★

మళ్ళీ ఇంకొకమారు సదస్యులందరికీ సవినయంగా నివేదించాడు:

"విటధర్మం తెలిసిఉండిన్నీ విష్ణునాగునికి ప్రాయశ్చిత్తం ఉపదేశింపనివారు, తల్లిదండ్రుల ఆజ్ఞప్రకారం ద్యూతమద్యపాన వారవేశ్యాప్రసంగాలులాగే విడిచిపెట్టిన వారి మహా రౌరవాది నరకాల పాలైపోతారు!"

అని నెమ్మదిగా తన ధర్మాసనంమీద కూర్చున్నాడు. సదస్యులలో చాలామంది ఆ శపథంలోని పరిహాస వ్యంగ్యం గ్రహించి ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

వారి నవ్వులువినగానే విష్ణునాగుని హృదయంలో ఏదో కొంచెం అనుమానం బయలుదేరింది. అయినా అతడలాగే వారి ప్రసంగాలన్నీ అతిశ్రద్ధగా ఆలకిస్తూ కూర్చున్నాడు:

వెంటనే విటమహోపాధ్యాయుడనంత కథకుడు హఠాత్తుగా లేచి నిలుచున్నాడు.

"కామినీమణి అయినటువంటి మదనసేనికి పాదప్రహార దోహదంతో అశోకవృక్షం కూడా చిగరించి పూవులు పూస్తుంది. అటువంటి పాదాగ్రంతో ఆమె ఇతని అపవిత్ర శిరస్సు స్పృశించింది. కనక ముందుగా ప్రాయశ్చిత్తం జరగవలసిన దామె పాదానికీ గాని ఇతనికి కానేకాదు!"

ఆ మాట వినగానే సదస్యులంతా మరింత పగలబడి నవ్వారు.

ఆ పరిహాసంతో విష్ణునాగునికి వారందరిమీద కలిగిన అనుమానం మరింత దృఢపడింది. అయినా అనవసరంగానలుగురిలోను ఇంకా నవ్వులపాలై పోకూడదని నిశ్చయించుకొని అలాగే గుంభనగా కూర్చున్నాడు.

అంతలో సభాపతి భట్టిజీమూతుడు లేచి సదస్యులు విటధర్మం తు, చ, తప్పకుండా నిర్ణయించి మరీ విష్ణునాగునికి ప్రాయశ్చిత్తం ఉపదేశించాలని హెచ్చరించాడు.

ఆమాట వింటూనే గుప్తరోమశ కవి లేచి నిలుచున్నాడు :

"ఆవారాంగన మదనసేనికపాదోదకంతో ఇతని శిరస్సుమీద అభిషేకించండి! ఇలాంటి పరమఛాందసునికిదే తగిన ప్రాయశ్చిత్తం!"

వెనువెంటనే విటసదస్సులో అంతటా సాధువాదాలు, హర్షధ్వానాలు చెలరేగాయి.

తరవాత రుద్రవర్మ లేచి నిలుచున్నాడు: "సభ్యులీతనిని ఈవిధంగా పరిహసించడం న్యాయ్యంకాదు! ఆ పాపాత్మురాలు మదనసేనిక పాదాంగుళులు సోకిన ఇతని శిరోజాలన్నీ ఖండించివెయ్యాలి! అదే ధర్మశాస్త్ర సమ్మతమైన ప్రాయశ్చిత్తం! నా మాట వినండి!"

అటుపిమ్మట అప్పుడప్పుడే పానపాత్ర అంతా ఒకేఒక గుక్కలో తాగివేసిన భవకీర్తి హఠాత్తుగా అక్కడవాలాడు:

"నేనొక ప్రాయశ్చిత్తం చెబుతాను శ్రద్ధగా వినండి! ఇతని శిరస్సు సోకగానే ఆ సుకుమారి మదనసేనిక పాదం బాగా నొచ్చిఉంటుంది. అందుచేత ఆ సుకుమారి పాదాలొత్తడమే ఇతనికి సరియైన ప్రాయశ్చిత్తం!"

తరవాత సభాపతి భట్టిజీమూతుడు నెమ్మదిగా లేచి సభాపతి మర్యాదకు భంగంరాని విధంగా ఇంకొకవిధంగా ప్రాయశ్చిత్తం ఉపదేశించాడు:

"నేను విష్ణునాగునికి ధర్మసమ్మతమైన ప్రాయశ్చిత్తం విధిస్తున్నాను. శ్రద్ధగా వినండి! నేనిప్పుడే మదనసేనిక భవంతికి వెళ్లిపోతున్నాను. ఆమె పాదప్రహారంతో నా శిరస్సు పులకించగానే ఇతడది చూచి ఆనందంతో తలపంకించాలి! ఇదే ఇతని శిరస్సుకు సరియైన ప్రాయశ్చిత్తం!"


సభాపతి తుది ధర్మనిర్ణయం వినగానే సభ్యులందరు ముక్తకంఠాలతో అదే సరియైన ప్రాయశ్చిత్తమని హర్షధ్వానాలు చేశారు.

అప్పటికి విష్ణునాగునికి తన తెలివితక్కువతనమంతా తెలిసివచ్చింది. వారంతా చేసినది కేవలం పరిహాసప్రసంగాలన్న విషయం అతని కప్పటికి బాగా బోధపడిపోయింది. ధర్మవేత్తలు విటమండలి సన్నిధికి వెళ్ళవలిసిందని తన కాజ్ఞాపించడానికి కూడా అదే కారణమని అతడప్పుడు గ్రహించివేసి గుంభనగా ఒక చిరునవ్వు నవ్వి సవినయంగా సదస్యులందరికీ వంగి వంగి వంకదణ్ణాలు పెట్టాడు:

"ఆర్యమిశ్రుల ప్రాయశ్చిత్తాలన్నీ ధర్మసమ్మతమైనవేనని నాకిప్పుడిప్పుడే అవగాహన అయింది! అందుచేత భట్టిజీమూతుల అనంతరమే నేను కుమ్మారులు మదనసేనిక పాదప్రహారభాగ్యంపొంది, పాపపంకిలములైపోయిన నా మనశ్శరీరాలకు యథావిధిగా ప్రాయశ్చిత్తం జరిపించుకోవాలని నిశ్చయించుకున్నాను. ధర్మవేత్తలకిదే నా కృతజ్ఞతాంజలి!"

అని అల్లాగే దోసిలిఒగ్గి ఆసభామధ్యంలో అలాగే దీపస్తంభంలా నిలుచున్నాడు.

అతని సమయస్ఫూర్తికీ, మెలకువకు హర్షించిన సదస్యులంతా ఆకాశం చిల్లులుపడేటట్టు హర్షధ్వానాలు, సాధువాదాలు చేశారు. అనంతరం సువర్ణ మద్యపాత్రల కోలాహలంలో విష్ణునాగుడు, విటమండలి వసంతోత్సవానంద తన్మయతలో మత్తిల్లి మైమరిచారు! ★



అలీపూర్ (కలకత్తా) టంకసాల భవనాలు.

నాణాల ముద్రణ

భారతదేశంలో మొదటిసారిగా షెర్‌షా (1540-45) హయాంలో "టంకా" స్థానే "రూపాయ్య" నాణెం ముద్రించబడింది. సురాజుద్దౌలా నవాబు సమ్మతిపై ఈ స్టిడిం యా కంపెనీవారు కలకత్తాలో ఒక టంకసాలను నెలకొల్పారు.

* * *

కలకత్తాలో 1824 లో ఆధునిక టంకసాల నిర్మాణానికి పునాది వేయబడింది. అందులో 13 లక్షల రూపాయల విలువైన యంత్రాలు అమర్చబడ్డాయి. 1829 ఆగస్టు 1-న ఆ టంకసాలకు ప్రారంభోత్సవం జరిగింది. రోజుకు రెండులక్షల వెండినాణెములు తయారుచేసే శక్తికలదిగా దాన్ని నిర్మించారు.

* * *

భారత స్వాతంత్ర్యసిద్ధి అనంతరం నిర్మించబడిన కొత్త అలీపూర్ టంకసాలకు 1952 మార్చి 19-న, నాటి ఆర్థికమంత్రి శ్రీ చింతామణి దేశ్‌ముఖ్ ప్రారంభోత్సవం జరిపారు. రోజుకు 8 గంటల షిఫ్టుకాలంలో 12 లక్షల నాణెములను ఆటంకసాల ఉత్పత్తి చేస్తుంది.

* * *

1914 నుంచీ భారతదేశం విదేశాలకు కూడా అంటే ఆస్ట్రేలియా, భూటాన్, సింహళం, ఈజిప్ట్, పాకిస్తాను, సౌదీ అరేబియా, భారతదేశాలలోని పోర్చుగీసు స్థావరాలూ, బ్రిటిషు తూర్పు ఆఫ్రికా దేశాలకూ, స్వదేశ సంస్థానాలకూకూడా నాణెములను ముద్రించి సరఫరా చేసింది.

* * *


ప్రస్తుతం దేశంలో అలీపూర్, బొంబాయి, హైదరాబాదులలో మొత్తం మూడు టంకసాలలున్నాయి. వారానికి 54 గంటలు పని చేస్తూ ఈ టంకసాలలు 1957 ఏప్రిల్ ఒకటవ తేదీనాటికి మొత్తం 61 కోట్ల "దశాంశ పద్ధతి" నాణెములను తయారుచేయగలవని అంచనా వేయబడింది. ఈ టంకసాలలన్నీ కలిపి, మొత్తంమీద నెలకు దాదాపు 8 కోట్ల నాణెములను ముద్రించగలవు.

* * *

యుద్ధకాలంలో, కలకత్తాలోని టంకసాల ఎన్నడూ లేనంత ఎక్కువగా నాణెములను ముద్రించింది. 1944-45 సంవత్సరకాలంలో ఇక్కడ 104,87,27,800 నాణెములు ముద్రించబడ్డాయి. ఇంత ఎక్కువగా ఇదివరకెన్నడూ నాణెములు ఉత్పత్తి కాలేదు.

* * *

దొంగ నికెల్ నాణెములను తయారుచేయడం చాలా కష్టం. ఎందుచేతనంటే, ఆ నాణెములను తయారుచేయడానికి నికెల్ లోహాన్ని 1452 సెంటిగ్రేడ్ డిగ్రీల ఉష్ణోగ్రతలో కరిగించాలి. ఇదే చాలా కష్టం. పైగా ఆ నాణెములను ప్రత్యేకమైన యంత్రపరికరాలు ఉపయోగించి ఉత్పత్తి చేస్తున్నారు. ★



అలీపూర్‌లో నాణాలను ముద్రించే యంత్రాలు. ఒక్కొక్క యంత్రం నిమిషానికి 105 బేడలను తయారు చేయగలదు.


బ్రిటిష్ టంకసాలల్లో

వారానికి కోటి నాణాలు


చారిత్రకమైన లండన్ టవర్‌కు చేరువగా తీని, హుందాతనం ఉట్టిపడే సువిశాల భవనాలు కొన్ని ఉన్నాయి. నూటయాభై ఏళ్లనాడు నెలకొన్న ఆ భవనాల వెనుక, "మేటిబిది" అని పేరు తెచ్చుకొన్న బ్రిటిష్ ప్రభుత్వ టంకసాల ఉంది. అక్కడ వారానికి కోటి నాణాలు తయారవుతాయి.

గత సంవత్సరం ఈ టంకసాల మొత్తం 50 కోట్ల 50 లక్షల నాణాలు (2652 టన్నులు) ముద్రించింది. వాటిలో నూటికి అరవై వంతులు బ్రిటన్‌లో చెలామణీకి తయారైనవి. మిగతా విదేశీ, దేశాల ప్రభుత్వాలు చేయించుకున్నవి.

బ్రిటిష్ నాణాల పరిణామాల కథను చెప్పే ప్రదర్శనశాల ఒకటి ఈ టంకసాలలో ఉంది. కొన్ని శతాబ్దాల నాడు గ్రీకులు తయారుచేసిన నాణాల ఫక్కీలో, అలనాటి బ్రిటిష్ రాజులు వేసిన నాణాల నుండి ఈనాటి ఎలిజబెత్ రాణిహయాంలో చెలామణీ అవుతున్న వాటివరకూ రకరకాల నాణాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. ఇవన్నీ చూస్తూఉంటే, నేటిమాట



బ్రిటిష్ మింటులలో కన్వేయర్ బెల్టులోంచి ఇంకా ముద్రపడని బంగారు సవరన్ నాణాలు వస్తుంటే, అవి దోషరహితంగా ఉన్నాయో లేదో పరీక్షిస్తున్న నిపుణులు.



సైప్రెస్, హాంకాంగ్, జమైకా మొదలైన బ్రిటిష్ వలసలలోని నాణాలపై ఎలిజబెత్ రాణి బొమ్మ.

ఎలా ఉన్నా కొన్ని శతాబ్దాల క్రితం యంత్రాల ప్రమేయం లేకుండా పూర్వీకులు చేసిన నాణాలలో ఆనాటి పనివారి విన్నాణం గోచరిస్తుంది. ఇక, ఇప్పటి నాణాల తయారీలో యంత్రాలు ఎంతపనిచేసినప్పటికీ, నాణెం రాణించడానికి పనివారి పనివాడితనంకూడా చాలా ముఖ్యమైన అంశం. అతి సున్నితమైన పనిని చురుకుగా సుకరంగా సాగించడానికి పరికరాలు అవసరమేఅయినా వాటిని వాడే కరాలు మరీ ముఖ్యం. అలాగే బాగోగులు తేల్చడానికి మళ్లీ మనిషి నిశిత దృష్టి ముఖ్యం.

ఇక్కడ నాణాలు చేయడానికి వారానికి మూడువందల అచ్చులు పోస్తారు. ఈ అచ్చులను చాలవరకూ యంత్రాల సహాయంతోనే చెక్కినా, కొన్ని మటుకు దాదాపు పూర్తిగా చేతితోనే చెక్కి తీర్చిదిద్దినవి.

ఇక నాణాలు తయారైన తరువాతకూడా వాటిలో కొస్త పాడైనవాటిని ఏరివేయడానికి కూడా మనుషులే పూనుకోవాలి. వడల్పాటి పటకామీదుగా సాగిపోతూ ఉండే వందలాది నాణాలవంక కొందరు పరీక్షకులు వెయ్యికళ్లు పెట్టుకుని చూస్తూ కూర్చుంటారు. వారిలో కొందరు నాణాలకు ఒకవైపు ముద్రణనే పరిశీలిస్తారు. రెండవ వైపు పరీక్ష మరోబృందం సాగిస్తుంది.

జాన్ రిగ్

ఘోరా బొత్తిగాలేని నాణాలు పీళ్లకళ్లకు అసలు ఆననే ఆనవుకాని, లవలేశం లోపం ఉన్నవి మటుకు ఇట్టే కనబడిపోతాయి. అట్టే తీసి అవతలకి నెట్టేస్తారు.

పాతశాల్తీ; కొత్తచొక్కా

ఇక నాణాల తయారీకి అనేకరకాల లోహాలను వాడుతారు కాని, ఈనాడు బ్రిటన్ ప్రభృతి దేశాలనేకం చెలామణీలో పెట్టే నాణాలు రాగి, నికెల్ కలిపిన లోహంతో పోతపోస్తున్నారు. ఇవి ప్రధాన లోహాలు. ఇరాక్ వంటి కొన్ని దేశాలలో వెండికూడా ఉపయోగిస్తున్నారు.

టంకసాల, రాగిని కడ్డీల రూపంలో తెప్పించి కరగబోస్తుంది. రాగి, నికెల్ వంటి లోహాలమిశ్రమాలు సాధారణంగా, ఏ దేశంలోనో చెలామణీలోంచి తీసివేసిన నాణాల రూపేణా వస్తాయి. ఒకసారి బెల్జియన్ కాంగోలో రద్దుచేసిన నాణాలు (రాగిని నికెల్ కలసినవి) తొట్టెల కొద్దీ తెచ్చి కరగబోయగా చూచాను. వాటిని మళ్లీ కొత్త నాణాలుగా పోసి బ్రిటన్‌లో వాడుతారట. ఈ విధంగా 1955 లో వెయ్యి టన్నుల పాత్తీ శాల్తీలు కరిగించి వాటికి కొత్త చొక్కాలు తొడిగి పోతపోశారు.

గోరంచు గోడ

ఇలా కరిగించిన లోహాన్ని ముందర కావలసిన పరిమాణానికి బిళ్లలుగా పోస్తారు. తరవాత ఈ బిళ్లల చుట్టూరా సన్నటి అంచు ఏర్పడే లాగ ఒక యంత్రం వాటిని అదుముతుంది. చుట్టూ ఈ గోరంచు గోడ ఉండడం వల్ల నాణెం మీది బొమ్మా బొరుసూ చటుక్కున అరిగి పోవడం జరగదు. ఈ "గోడ" కట్టిన బిళ్లలను ఇంకో యంత్రంలో పెడతారు. అక్కడ బొమ్మని ముద్రించే అచ్చూ, అక్షరాలను ముద్రించే అచ్చూ. ఈ నాణాన్ని ఇటూఅటూ ఒకేసారి అదుముతాయి. ఇలా చేయడంలో బొమ్మా అక్షరాలూ స్ఫుటంగా, పైకి లేచినట్లు అచ్చు పడడంతోపాటు, నాణెం ఆవత్తిడికి సాగిపోబోతుంది. కాని దాని చుట్టూ ఉండే పళ్ల చక్రం దాన్ని అటకాయిస్తుంది. తత్ఫలితంగా నాణెం వడ్డాణెం చుట్టూ నిలువు గీతలు గంట్లుగా (మన అర్ధరూపాయ చుట్టూ ఉండేగీతల వంటివి) పడతాయి.



తరువాత మరో యంత్రం సహాయంతో వీటిని లెక్కించి, సంచీల కెక్కించి, సీలు వేసి బయటకి పంపిస్తారు.

ఈ నాణాల తయారీలో అడుగడుగునా పరీక్షలు జరుగుతూ ఉంటాయి. కొన్నిటిని యంత్రాలు చేస్తాయి. మరికొన్నిటిని మనుషులే చేస్తారు.

ఇదికాక, ఈ నాణాల నాణ్యాన్ని, బరువునీ స్వర్ణకారుల సంఘసభ్యుల మండలి ఏటేటా తనిఖీచేయడం ఒక సంప్రదాయంగా ఏర్పడి సాగుతోంది. ఈ నిర్ణాయక సంఘం బ్రిటన్, న్యూజిలాండ్, రొడీషియా, న్యాసాలాండ్ నాణాలనుమాత్రమే పరీక్షిస్తుంది. టంకసాలలో నాణాలు తయారుచేస్తున్నపుడే, ఇందుకని కొన్నిటినీ తీసి ఒక పెట్టెలోవేసి అట్టే పెడతారు. ఈ పెట్టెని "పిక్స్" అంటారు. పరీక్షామండలి ఏటేటా వసంతఋతువులో సమావేశమై, వీటిని పరిశీలించి ఆరువారాల తరువాత నిర్ణయాలను ప్రకటిస్తుంది.

ఈ పద్ధతి పన్నెండవ శతాబ్దం నుండి అమల్లో ఉంది. ఈ పరీక్షకు "ట్రయల్ ఆఫ్ ది పిక్స్ అని పేరు.

కామన్‌వెల్త్ దేశాలే కాక, ఉరుగ్వే, నికరాగ్వా, బొలీవియా, ఇరాక్, బర్మా, జోర్డాన్ దేశాలూ, ఫీజీ, జమైకా, మారిషస్ హాంకాంగ్ ప్రభుత్వాలూ నాణాలను

(62-వ పేజీ చూడండి)

నయాపైసా కన్నీళ్లు

★

కనుమూరి వెంకటరాజు

కలకత్త నగరిలో
కలడొక్క శ్రేష్ఠి
శ్రేష్ఠికున్నది ధనము - చెప్పలేనంత
దైవభక్తికి అతని - కాతజేసాటి
దాన ధర్మమన్న - దరిజేరకుండు.


నగరిలోపల జరుగు - తిరుణాళ్లు జూడ
భక్తితో పయనించె - లక్ష్మీపుత్రుండు
దారిప్రక్కలనున్న - బీదలను చూచి
దయ కలుగలేదు - ఆ ధనాఢ్యునకు.

భగవంతు డనినచో - భయముగల సెట్టి
పాత్రదానముచేయ - పైసాను తీసె.
ఎవ్వారికీయుటో - నిశ్చయించుటకు
ఈతీరుగా నతడు - యోచింపసాగె:

"వీడు యువకుడు గనుక - వీడు బలియుడు గనుక
యిటువంటి ప్రజకన్న - ఎంతో దీనులుగలరు
వారి కిచ్చినయెడల - పాత్రదానం బనుచు,
ఒక నయాపైసాను - ఉంచుకొనె చేతిలో.

కడపటికి, కనె సెట్టి - కడుదీను నొకని
తన నయాపైసాకు - తగ్గ మానవుని
చెయివిప్పి చూడగా - చెమట బిందువులతో
ఇమిడియుండెను పైస - కరములోపలను.

తన్ను దానముచేయ - తగదనుచు కన్నీళ్లు
వెళ్లిగక్కుచున్న దీ - వెర్రినాణెం బనుచు
జాలిగుండెలుగల - సెట్టి తొందరగా
జేబులోనే ఉంచు - కొనె నయాపైసాను !!



వచ్చేసింది ఏప్రిల్ ఒకటో తేదీ!
తెలుగువారికి సంవత్సరాది.
దేశమంతటా నయానాణాలనాండి!

ఇంగ్లీషువాళ్ళ సంప్రదాయం ప్రకారం ఏప్రిల్ ఒకటో తేదీ "ఆల్ ఫూల్స్ డే." ఆ రోజున ఒకరినొకరు సరదాగా ఏడిపించుకుని "ఏప్రిల్ ఫూల్స్" అవుతారు. బడి పిల్లలు "ఏప్రిల్ ఫూల్, గోటూ స్కూల్" అని పాడుతూ గంతులేస్తారు. కాలేజీ స్టూడెంట్లు గడితేరినవాళ్ళు కనక, కొత్త అమాయకుడయిన స్టూడెంటును చూసి ఏ అమ్మాయి సంతకమో పెట్టి ప్రేమలేఖను పోస్టు చెయ్యడం లాంటివి కూడా జరుగుతాయి.

వీటికేం గాని, నిజంగా అమాయకులయిన వాళ్ళు నిజంగా ఏప్రిల్ ఫూల్స్ అయిపోవడానికి నయాపైసా లొస్తున్నాయి. కనక వీటిని గూర్చి కొస్త సావకాశంగా ఆలోచించుకోవడం అవసరం.

ఏప్రిల్ ఒకటినుంచీ ఒక నయాపైసా, రెండు నయా పైసాలు, అయిదు నయా పైసాలు, పదినయాపైసాల నాణాలు చెలామణీలోకి వస్తున్నాయి. ఆ తరవాత నెమ్మదిగా 25, 50, 100 నయా పైసాల నాణాలు వస్తాయి. వీటిలోపాటు పాతనాణాలు కూడా మూడు నాలుగేళ్ళ పాటు అమల్లో ఉంటాయి. వస్తువుల ధరలు నయాపైసాల్లో ఉండచ్చు; పాతనాణాల్లో ఉండవచ్చు; లేక రెంటిలోనూ ఉండవచ్చు. అలాగే వస్తువులను కొనుక్కునే టప్పుడు కొత్త నాణాల్లో గాని, పాతనాణాల్లో గాని, లేక రెంటిలోనూ గాని కొనుక్కోవచ్చు.

ఈ కారణంచేత మూడు నాలుగేళ్ళ దాకా ఇబ్బందులు తప్పవు. జాగ్రత్తగా ఆలోచించి చేస్తే ఇబ్బందులు రాకుండానూ చేసుకోవచ్చును.

కాని కొత్త నయాపైసాలవల్ల వచ్చే ప్రయోజనాలతో పోల్చి చూసుకుంటే ఈ ఇబ్బందులు అట్టే గణించదగినవి కావు.

దశాంశ నాణాలు

దశాంశ ద్రవ్యమానం లెక్కలకి చాలా తేలికయిన పద్ధతి అని ప్రపంచమంతటా అంగీకరించిన విషయమే. వ్యాపారం రోజురోజుకీ పెరిగిపోతున్న ఈ కాలంలో దశాంశ మానం చాల పని తగ్గిస్తుంది.

అసలు భారతదేశంలో దశాంశ ద్రవ్యమానం ప్రవేశపెట్టాలని 1867 నుంచీ ఆలోచన జరుగుతోంది. అంచెలంచెలుగా ప్రవేశపెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం 1871 లో ఒక శాసనం కూడా చేసింది కాని అనేక కారణాల వల్ల ఆ శాసనం మూలపడింది.


మళ్లీ 1946 దాకా ఈ సమస్య పై ఎవరూ శ్రద్ధ వహించలేదు. ఆ ఏడాది జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెసు 34 వ సమావేశం దశాంశ పద్ధతిని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. కేంద్ర శాసన సభలో ఒక బిల్లుకూడా ప్రవేశపెట్టారు. కాని త్వరలో రానున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆ బిల్లు కూడా మూలపడింది.

మళ్ళీ 1955లో భారతప్రభుత్వం మరొక బిల్లు తయారు చేసింది. ఇది 1955 సెప్టెంబరులో శాసనమైంది. ఈ శాసనం ఫలితంగానే ఈనాడు మనకి నయాపైసా నాణాలు రావడం జరిగింది.

ఇతర దేశాల్లో పరిస్థితి

ప్రపంచంలో సొంత నాణాలను చలామణీ చేసుకునే దేశాలు 140 దాకా ఉన్నాయి. వీటిలో 105 దేశాల్లో దశాంశ నాణాలే అమల్లో ఉన్నాయి. మొట్టమొదట్లో ఈ పద్ధతి అనుసరించిన ఘనత అమెరికాది. 1786–1792 సంవత్సరాల మధ్య అమెరికా డాలర్ నాణాన్ని దశాంశీకరించుకుంది. ఆ తరవాత ఫ్రాన్సు (1799–1803), జర్మనీ (1873), స్కాండినేవియన్ దేశాలు (1875), ఆస్ట్రియా, హంగరీ (1870–1892), రష్యా. (1839–1897), దక్షిణ అమెరికా, జపాను (1871) మొదలైన దేశాలు ఈ పద్ధతి అనుసరించాయి. సింహళం మొదలైన ఆసియా దేశాల్లోకూడా ఈ పద్ధతే ఉంది.

అయితే బ్రిటన్ మాత్రం దశాంశ పద్ధతి అవలంబించలేదు. బహుశా దీనికి ముఖ్య కారణం అక్కడ గణకయంత్రాలు (కౌంటింగ్ మెషీన్లు) కొల్లలుగా ఉండడమే అయివుంటుంది. ఇప్పుడు ద్రవ్యమానం మారిస్తే ఈ యంత్రాలెందుకూ కొరకాకుండా పోతాయి. అసలు ఇంకా కొంతకాలం పోతే ఈ యంత్రాలు మనదేశంలో కూడా వాడకంలోకి వచ్చేస్తాయి. అప్పుడు మనంకూడా బ్రిటన్‌పడ్డ అవస్థలో పడతాము. కనక గణకయంత్రాల విషయంలో వెనకబడిఉన్న ఈ తరుణంలోనే మనం ద్రవ్యమానాన్ని దశాంశీకరించుకోవడం ఎంతైనా ఉచితంగా ఉంది. అణా, బేడా మొదలైన నాణాలువేస్తే బరువులు తూచే యంత్రాల్లాంటివి కూడా ఇంకా దేశంలో అంత ఎక్కువగా లేవు. కొన్నాళ్ళు



కొత్త నాణాలు సరిగ్గా ఇవే సైజుల్లో ఉంటాయి.



పోతే అవి ఎక్కువైపోతాయి. అప్పుడు దశాంశీకరణ పద్ధతి మొదలిడితే అవీ వృథా అయిపోతాయి. అందుచేత ఇప్పుడే దశాంశీ పద్ధతికి మారడం మంచిదని ప్రభుత్వం అభిప్రాయ పడింది.

తూనికలు, కొలతలు

దశాంశపద్ధతి ఒక్క నాణాల్లోనే కాదు; తూనికలు, కొలతలోకూడా చాలా ఉపయోగమైన పద్ధతి. ఇప్పుడు దేశంలో ఒక్కొక్కచోట ఒక్కొక్క రకమైన తూనికలు ఉన్నాయి. దీనివల్ల వ్యాపారంలో బోలెడు ఇబ్బంది కలుగుతోంది, వాటిని దశాంశీకరించి మెట్రిక్ పద్ధతిలోకి మార్చడం అవసరం. కాని అది పదేళ్ళపాటు క్రమంగా జరగాల్సిన పని. దానికి ముందు దశాంశ నాణాల పద్ధతి అమల్లో ఉంటేనే తప్ప అది విజయవంతం కాదు. కనుకనే ముందుగా దశాంశనాణాలను ప్రవేశపెట్టాల్సిన అగత్యం కలిగింది.

దశాంశమానం అంటే ఏమిటి? ఒకటి సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుంటే, పైకి పదేసిరెట్ల చొప్పున (10, 100, 1000), కిందికి పదేసివంతుల చొప్పున (.1, .01, .001) లెక్కించాలి. కాని ఇప్పుడు వివిధ దేశాల్లో అమల్లో ఉన్న నాణాలు సరిగ్గా ఇదే పద్ధతిలో లేవు. ఉదాహరణకి ఫ్రాన్సులో ఫ్రాంక్, పది ఫ్రాంకులు, వంద ఫ్రాంకులూ మాత్రమేకాక, 50, 20, ఫ్రాంకుల నాణాలు కూడా ఉన్నాయి. ఇలానే అమెరికా జర్మనీల్లో కూడాను.

అదేవిధంగా భారతదేశంలో నయాపైసా, 10, 100 నయాపైసా నాణాలేకాక, 2, 5, 25, 50 నయాపైసాల నాణాలుకూడా చెలామణీలోకి వస్తాయి. దీనివల్ల అటు దశాంశ పద్ధతివల్ల వచ్చే లాభాలూ వస్తాయి. ఇటు ఇదివరకునుంచీఉన్న పావలా, అర్ధరూపాయి లాంటి నాణాలతో, అవి ఉన్నంతకాలమూ మారకమూ వీలవుతుంది.

కొత్త పాతల మేలు కలయిక


ఇకనుంచీ మనదగ్గిరకి కొత్త నాణాలూ వస్తాయి; పాత నాణాలు వస్తాయి. ఈ రెండురకాల 'మనీ' చెలామణీ అవుతుంది. కానీపెట్టి వక్కపొడి పొట్లమో ముక్కుపొడి పొట్లమో కొనుక్కోవాలంటే కానీ ఇచ్చినా సరిపోతుంది. "రెండు నయాపైసాలివిగో నయా, తీసుకోవయా" అని ఇచ్చినా "ఏదో మీ దయా" అని షాపువాడు తీసుకుంటాడు. ఎందుకంటే కానీకి సరిగ్గా లెక్కచూస్తే $1\frac{9}{16}$ నయాపైసా విలువ మాత్రమే ఉంది. కాని మనం దానిబదులు రెండు నయాపైసాలివ్వకతప్పదు. అంటే షాపువాడికి $\frac{7}{16}$ వ వంతు నయాపైసా లాభిస్తోందన్నమాట.

ఇదేవిధంగా మిగతా పాత నాణాలకూ, నయా నాణాలకూ మధ్య విలువ పూర్ణ సంఖ్య రానప్పుడల్లా పూర్ణ సంఖ్యనుచేసి ప్రభుత్వంవారు మారకంరేట్ల పట్టీలు ప్రకటించారు. ఈ పట్టీలనుబట్టీ పట్టడం మంచిది. లేకపోతే కొన్నాళ్లు అలవాటయేదాకా పట్టీలను దగ్గరపెట్టుకుని వాటినిబట్టి వ్యవహారం జరుపుకోడం మంచిది.

ఉదాహరణలు


అర్ధణా పెట్టి అగ్గిపెట్టి కొనుక్కోవాలంటే అర్ధణా ఇవ్వచ్చు. లేక మూడు నయాపైసాలివ్వచ్చు. మూడుకాన్ల పెట్టి మూడుకాన్ల పెట్టి కొనుక్కోడానికి మూడు కాన్లు ఇవ్వచ్చు. లేక అయిదు నయాపైసాలూ ఇవ్వచ్చు. ఇలాగే అణాకి 6 నయాపైసలూ, బేడాకి 12 నయాపైసలూ అవుతాయి. కాని మూడణాల ఖరీదున్న సిగరెట్టుపెట్టె కొనుక్కోవాలంటే మూడార్లు 18 నయాపైసాలిస్తామంటే పుచ్చుకోరు. అణాకి సరిగ్గా విలువ కట్టాలంటే $6\frac{1}{4}$ నయాపైసాలు కాని $\frac{1}{4}$ నయాపైసాని లాగేసి ఆరు నయాపైసలే చేశారు. కాని మూడణాలు దగ్గిరికి వచ్చేసరికి, $\frac{1}{4}$ నయాపైసాలను మూడింటినీ పోగేసి మరో $\frac{1}{4}$ నయాపైసాను కలిపి మొత్తం ఒక నిండు నయాపైసాచేసి, మూడణాలకు 19 నయాపైసాలు ఇచ్చి తీరాల్సిందే అని దొరతనంవారు హుకుం జారీ చేశారు. ఇక పావలా దగ్గిరికి వచ్చేసరికి అసలు ఏపేచీలేకుండా పోయింది. రూపాయిలో నాలుగోవంతు పావలా. రూపాయి విలువ నూరు నయాపైసాలు గనుక అందులో నాలుగోవంతు 25 నయాపైసాలు. ఇక్కడ ఎవరికీ లాభనష్టాలుండవు. అలాగే అర్ధరూపాయి 50 నయాపైసాలకు సమానం గనక అదీ పేచీలేనిదే. రూపాయికి నూరు నయాపైసాలు గనక అదీ హాయే.

నయాపైసాలు వచ్చినప్పటికీ రూపాయి, అర్ధరూపాయి, పావలా నాణాల విలువఏమీ మారదు. పావలాకంటె తక్కువ నాణాలకే విలువ మారుతుంది. సులభంగా పాత నాణాలను కొత్త నాణాల విలువలోకి మార్చుకోడానికి కొన్ని పద్ధతులున్నాయి. ఏడణాలను నయాపైసాల్లోకి మార్చుకోడానికి ఏం చెయ్యాలి? ముందు, పావలాకి 25 నయాపైసాలుగదా అనుకోవాలి. మిగిలిన మూడణాలకి పట్టికప్రకారం 19 నయాపైసాలని గుర్తుపెట్టుకొని మొత్తం 44 నయాపైసాలని తేల్చుకోవాలి. ఇలాగే మరికొన్ని ఉదాహరణలు: 9 అణాల ముక్కానికి ఎన్ని నయాపైసలు. ముందు అర్ధరూపాయికి 50 నయాపైసాలు?



కొత్త దశాంశ నాణాలు: పై వరుసలో అశోకస్తూపం ఉండే వైపు: క్రింది వరుసలో నాణాల విలువ తెలిపేవైపు.

త్వరలో
అదృశ్యం కానున్న
చిల్లర
శ్రీ మహాలక్ష్మి



ఇదే నయా నయా పైసా

అణాకి 6 నయాపైసాలు. మూడుకాన్లకి 5 నయాపైసాలు. మొత్తం 61 నయాపైసాలు. అలాగే 0-14-6 కి ఎన్ని నయాపైసాలు? ముప్పావలాకి 75. మిగిలిన బేడా అర్ధణాకి 16. మొత్తం 91 నయాపైసాలు. నయాపైసాలను పాత నాణాల్లోకి మార్చడానికి సులభ పద్ధతులు:— 192 నయాపైసాలకు ఎన్ని పాత నాణాలు? ముందు 100 నయాపైసాలకు రూపాయి. మిగతా 92 లోనూ 75 నయాపైసాలకు 0-12-0 మిగిలిన 17 నయాపైసాలకు రెండణాలముక్కాని. మొత్తం 1-14-9.

నాణాల ముద్రణ

వర్తకానికి నాణాలను వాడడం అతి ప్రాచీన కాలంనుంచీ అమల్లో ఉన్నది. పురావస్తు పరిశోధనవలన ప్రాచీన నాణాలు అనేకం బయటపడి ఆయాకాలాల ఆర్థిక, రాజకీయ పరిస్థితులను తెలుసుకోవడంలో సహాయపడుతున్నాయి.

ఈస్టిండియా కంపెనీ వచ్చే నాటికి, ఉత్తర భారతదేశంలో వెండి, బంగారు నాణాలు రెండూ చలామణీలో ఉండేవి. కాని రెంటికీ మధ్య చట్టరీత్యా నిష్పత్తి నిర్ణీతంగా ఉండేది కాదు. ఎందుచేతనంటే దేశంనిండా కొల్లలుగా వున్న మహారాజాధిరాజాలంతా ఎవరి నాణాలను వారు జారీ చేసేవారు. మొత్తంమీద 994 రకాల వెండి, బంగారు నాణాలు దేశమంతటా చలామణీ అయ్యేవట.

ఇప్పటి రూపాయికి 1835 లో మొట్ట మొదటగా ఆకారం ఏర్పడింది. 1829 ఆగస్టు 1వ తేదీన కలకత్తాలో మొట్టమొదటి మింటింగ్ యంత్రం పని ప్రారంభించింది. ఆ తరవాత బొంబాయిలో మరోయంత్రం పని మొదలెట్టింది. తరవాత మద్రాసులో ఏర్పడింది. 1952 లో అలీపూర్ (కలకత్తా) మింటు భారీ ఎత్తున నాణాలు ముద్రించ సాగింది.


ఇప్పుడు దశాంశనాణాలను అలీపూర్, బొంబాయిలలో ఉన్న మింటు, హైదరాబాదులో ఉన్న చిన్న మింటులు ముద్రిస్తున్నాయి. భారతదేశపు జనాభాను బట్టి, రోజూ చిల్లరవర్తకానికవసరమైన చిల్లర నాణాల సంఖ్యను బట్టిచూస్తే, మన మింటులు తలకు మించిన పని తలపెట్టాయేమోనని పిస్తుంది. అందుచేతనే పాతనాణాలను ఉపసంహరించి కొత్త నాణాలను పూర్తిగా ప్రవేశపెట్టడానికి కనీసం మూడేళ్ళయినా పట్టుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

నాణాలను తయారుచేయడం చాలా క్లిష్టమైన పని. నాణాల బరువు, సైజు, మేలిమి, డిజైను అన్నీ ఎప్పటికప్పుడు సరిగా వస్తున్నాయో లేదో చూసుకుని మరీ ముద్రించాలి. పనికిరానివాటిని ముందరే తీసి పారేస్తూ ఉండాలి. ఇలాగ అనేక విలువలుగల నాణాలను తయారుచేసుకుంటూ పోవాలి. కొత్త డిజైనుగల ఒక నాణాన్ని ముద్రించడానికి ముందు అనేక వారాలపాటు ఎక్స్పెరిమెంటు చేసిగాని మింటుచేయడానికి వీల్లేదు.

ఇప్పుడు నయాపైసాలూ, పాతనాణాలూ రెండూ చెలామణీలో ఉంటాయి గనుక, వీటి మారకంరేట్లను ప్రజలకు బోధపరచడానికి కొంతకాలంగా ప్రభుత్వం చాలా విధాలుగా ప్రచారం చేస్తున్నది.

సినిమాలద్వారా, రేడియోద్వారా, పత్రికల ద్వారా ప్రచారం జరుగుతోంది. ఎంత ప్రచారం చేసినా ప్రజలకు త్వరగా అలవాటు కావడం కష్టమే. ఒకవేళ అలవాటైనా, ధరలు వర్తకులచేతుల్లో ఉంటాయి గనుక వారికేం ఫరవాలేదు గాని, కొనుగోలు దారులకు కొద్దికొద్ది మొత్తాలు నష్టంకాకతప్పదు. కొద్ది మొత్తాలైనా అన్నీ కలిపి మూడు నాలుగేళ్ళలో అవే పెద్ద మొత్తాలు కావచ్చు. ఇది తప్పనిసరి నష్టం.

పాఠశాలల అధికారులు ఇకనుంచీ రూపాయి అణాల భాగారాలతో పాటు నయాపైసాల మారకం రేట్లనుకూడా పిల్లలకు బోధించాలి. సాధారణంగా పిల్లలే ఎక్కువగా మోసపోవడానికి అవకాశాలున్నాయి. అందుచేత వారిని పెద్దలు బాగా తరిఫీదు చెయ్యాలి. తరవాత మోసపోయే అవకాశాలు కలవారు ఆడవారు. పాలవాడికి డబ్బిచ్చేటప్పుడు, కూరగాయల బేరాలాడేటప్పుడు ప్రతిసారీ నయాపైసా పట్టీ దగ్గిర పెట్టుకుని మరీ వ్యవహరించాలి. ★



సులభపద్ధతి

కొత్త నాణాలు చెలామణిలోకి వస్తున్నవి. ఏప్రిల్ 1 మొదలు పాత నాణాలుకూడా మూడేళ్ళపాటు అమలులో వుంటవి. ఏదైనా ఒక వస్తువుకొని వ్యాపారస్థుడికి రూపాయి యిస్తే, వస్తువుల వెలపోను మిగతా చిల్లర మనకు కొంత భాగం పాతనాణాలలోనూ, మరి కొంత భాగం కొత్త నాణాలలోనూ వచ్చే అవకాశం వున్నది. చిల్లర మనకు సరిగా ముట్టిందో లేదో తెలుసుకోవాలంటే పాత కొత్త నాణాల మారకం రేటును జాగ్రత్తగా జ్ఞాపకం వుంచుకోవలసివస్తుంది. ఈ రేట్ల జంత్రీని ప్రభుత్వం ప్రకటించింది. ఎక్కడికి వెళ్లితే అక్కడికల్లా ఈ జంత్రీలను వెంట తీసుకుపోవాలంటే ఎవరికైనా చెడ్డ చిరాకు వేసే మాట వాస్తవం. అందుచేత దీనికి సాధ్యమైనంత సులభపద్ధతిని గుర్తుపెట్టుకోవడం మంచిది.

I

రు. అ.		
0-4-0	= 25	నయాపైసలు
0-8-0	= 50	,,
0-12-0	= 75	,,
1-0-0	= 100	,,

II


కానీ	= 2	నయాపైసలు
అర్ధణా	= 3	,,
ముక్కానీ	= 5	,,
అణా	= 6	,,


పైన *I, II* కాలములలోవున్న రేట్లను సులభంగానే జ్ఞాపకం వుంచుకోవచ్చు. రు 0-7-3 (ఏడణాల కానీ)కి ఎన్ని నయాపైసలో తెలుసుకోవాలంటే, ఈ క్రింది విధంగా లెక్కకట్టవచ్చు. రు 0-7-3 కి బాగా దగ్గరగావున్న నాణెం అర్ధరూపాయి, అర్ధరూపాయి అంటే 50 నయాపైసలు. దీనిలోనుంచి ముక్కానీకి వచ్చే నయాపైసల సంఖ్యను తీసివేస్తే సరిపోతుంది. ముక్కానీకి 5 నయాపైసలు. ఏడణాలకానీ అంటే 45నయాపైసలని తేలుతుంది.

మరో ఉదాహరణ: 14 అణాలకెన్ని నయాపైసలు? 14 అణాలంటే పన్నెండణాలు, రెండణాలు కలిసిన మొత్తం. 12 అణాలు = 75 నయాపైసలు; రెండణాలకు 12 నయాపైసలు. మొత్తం 87 నయాపైసలు.

షరా: తేడా బేడామాత్రమే వున్నదికదా అని దగ్గరగావున్న పెద్ద మొత్తం రూపాయిని తీసుకొని, దాని 100 నయాపైసాలలో బేడాకు వచ్చే నయాపైసాలను (12 ను) తీసివేయకూడదు. అలాచేస్తే 14 అణాలకు 88 నయాపైసలు వస్తవి. అది తప్పు.

-కే. ఎస్. శ్రీనివాసాచార్యులు.]





ఫొటోలు: వి. శేషశర్మ (మద్రాసు)

డాలర్ చరిత్ర

అమెరికా సంయుక్త రాష్ట్రాలని నేడు మనం వ్యవహరించే ప్రదేశమంతా జాతీయ ప్రతిపత్తిగల ఒక దేశంగా రూపొందడానికి పూర్వం వలసభూమిగా మాత్రమే వుండేది. వివిధ దేశాలనుంచీ వలసవెళ్ళిన ప్రజలు ఏ ప్రాంతానికా ప్రాంతంలోనే తాము తెచ్చుకున్న రకరకాల నాణాలను చలామణిలో పెట్టుకుంటుండే వాళ్లు. ఇవి ఇంగ్లండు, హాలెండు, స్పెయిన్, ఫ్రాన్సు, పశ్చిమ ఇండీస్ మొదలైన దేశాలతో వారు చేసిన వ్యాపారంలో లభ్యమైన నాణాలే. ఒక్కొక్క ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న వలస ప్రజలు తమనాణాలకు వివిధ వలస ఇతర ప్రాంతాలతోనూ మారకం రేట్లను కూడా నిర్ణయించుకున్నారు. స్పెయిన్ నుంచి వలసవెళ్ళినవారు ఎక్కువగా వున్న కారణంచేత స్పానిష్ డాలర్లు ప్రముఖస్థానం ఆక్రమిస్తుండేవి. స్పానిష్ డాలర్ కు, ఇంగ్లీషు నాణాలైన పౌన్లు షిల్లింగులతో విశేషంగా లావాదేవీలు జరుగుతుండేవి. అమెరికా ప్రధాననాణెంగా డాలర్ ను నిర్ణయించడానికి ఆదిలో స్పానిష్ డాలర్ ప్రముఖపాత్ర నిర్వహించడం ఒక కారణమని చెప్పవచ్చు.

అమెరికా స్వాతంత్ర్య సమరానికి పూర్వం ఒక దశలో విదేశాలలో తయారు చేసిన రాగినాణాలు ఆ వలస ప్రాంతాలకు ఎగుమతి అవుతుండేవి. స్వాతంత్ర్య సమరానంతరం అనేకరకాల ఇంగ్లండు నాణాలు ప్రత్యక్షం కావడం మొదలుపెట్టినవి. వీటిలో కొన్నిటిమీద అమెరికా జాతీయ నాయకుడు జార్జి వాషింగ్టన్ ప్రతిమను ముద్రించారు. అమెరికా అధికారికంగా తన నాణాలను తాను ముద్రించుకోవలసి వచ్చినప్పుడు కొంతమంది జార్జి వాషింగ్టన్ బొమ్మను వాటిమీద ముద్రించడం అవసరమనే ప్రతిపాదన చేశారు. అయితే అందుకు ఆ నాయకుడు ఇష్టపడలేదు. నూతన ప్రజాస్వామిక సూత్రాలకు ఇది విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డాడు.

అమెరికన్ కాంగ్రెసు 1778 లో రాబర్ట్ మారిస్ అనే అతడి అధ్యక్షతక్రింద కొత్త నాణాల విధానాన్ని, ప్రమాణాన్ని నిర్ధారణ చేయడానికి ఒకకమిటీని నియమించింది. ఈ కమిటీ బంగారం, వెండిధరల నిష్పత్తి 14.5:1 నిష్పత్తిలో వుండాలని నివేదికలో సూచించింది. అతి చిన్న నాణెం డాలర్ లో 1/1440 వ వంతు వుండాలనీ, ఒక టంకసాలను స్థాపించాలనీ సిఫార్సు చేసింది. ప్రజాప్రతినిధుల సభలో సభ్యుడుగావున్న థామస్ జఫర్సన్ "మారిస్ పథకం" చాలా గజిబిజిగా వుందనీ, ఆచరణ సాధ్యం కాదనీ విమర్శించాడు. దశాంశ నాణాలపద్ధతిని ప్రవేశపెట్టాలని వాదించాడు. 1785లో అమెరికా ప్రామాణిక నాణెం డాలరేననీ, అతి స్వల్ప విలువగల నాణెం డాలర్ లో 200 వంతు గలదై వుండాలనీ, ఇతర నాణాలు కూడా దశాంశపద్ధతిలోనే వుండాలనీ కాంగ్రెసు తీర్మానించింది.

1786 ఆగస్టు 8-న డాలర్ నాణెంలో 375.64 గోధుమగింజల ఎత్తు వెండి వుండాలనీ, అర్ధసెంట్లు, సెంట్లు (రాగివి), డాలర్ లో పదోవంతు విలువగల 'డైమ్స్' 20 సెంట్ల నాణాలను, అర్ధడాలర్, డాలర్ మొదలైన వెండినాణాలను. 5, 1, డాలర్ల బంగారు నాణాలను ముద్రించాలనీ నిర్ణయించారు. బంగారు నాణెమైన డాలర్ లో 24.6268 గోధుమగింజల ఎత్తు బంగారం వుండితీరాలన్నారు. ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా ఆదేసంవత్సరం సెప్టెంబరు 20-న జాతీయ టంకసాల స్థాపనకు అనుమతి ఇచ్చారు.

1789 లో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించడంతో నాణాల సంస్కరణ సమస్య తిరిగి తలఎత్తింది. కోశాధిపతి అయిన అలెగ్జాండర్ హామిల్టన్‌ను ఒక నివేదిక తయారు చేయవలసిందని కాంగ్రెసు ఆదేశించింది. 1791 లో ఇతడు సమర్పించిన నివేదికలో దశాంశ నాణాల పద్ధతిని బలపరిచాడు. ద్రవ్యమాన ప్రమాణానికి వెండి, బంగారు లోహాలే వుండాలనికూడా ఇతడు సిఫార్సు చేశాడు. ఈ నివేదికకు అనుగుణంగానే 1792 ఏప్రిల్ 2-న నాణాల చట్టాన్ని కాంగ్రెసు ఆమోదించింది. ఒకటి, పది, నూరు, వెయ్యి విభాగాలలో నాణాలుండాలని ఈ చట్టం శాసించింది. బంగారం డాలర్ లో 24.75 'గింజల' ఎత్తు బంగారం వుండాలనీ, వెండి డాలర్ లో 371.25 గింజలఎత్తు వెండి వుండాలనికూడా ఇదేచట్టం నిర్దేశించింది. 10 డాలర్ల విలువగల బంగారు (ఈగిల్) నాణెం, వెండిలో 5 డాలర్ల, $2\frac{1}{2}$ డాలర్ల (ఈగిల్) నాణాలు, డాలర్, అర్ధడాలర్, పావుడాలర్, నాణాలు, రాగిలో 'డైమ్' అనే పదిసెంట్ల, 5 సెంట్ల నాణాలు, సెంటు, అరసెంటు నాణాలు ముద్రించడానికి కూడా చట్టం అధికారం ఇచ్చింది. ఈవిధంగా సెంటు, 5 సెంట్లు, 25 సెంట్లు, 50 సెంట్ల నాణాలను ప్రజలు విరివిగా వాడుకుంటున్నారు. వీటిని కంచు, రాగి, రాగినిక్కెల్ కలిపిన మిశ్రమ లోహాలతో తయారుచేస్తుంటారు.

—అమెరికా సమాచారశాఖ సౌజన్యంతో]



చక్రపాణి

చెన్నపట్టణము

ప్రియమైన గోపాలుకి,

నీవు ప్రేమతో రాసిన వుత్తరము అందినది. నీకు ప్రమోషన్ వచ్చినందుకు సంతోషము. ఇప్పుడు నీకు జీతమెంత వస్తోంది? ఇవాళే కోనేటి ప్రసాదరావుగారి వద్దనుండి ఉత్తరము వచ్చినది. వారి అమ్మాయి బి. ఏ. ప్యాసు అయినదిట. నువ్వు చాలారోజుల నుండీ, చదువుకున్న అమ్మాయి కావాలను కుంటున్నావు గదా. నువ్వువున్న వూరే కాబట్టి పెద్దనాన్నగారిని తీసుకునివెళ్లి పిలను చూసిరావలసినది. ప్రసాదరావుగారివద్ద డబ్బువున్నదని మాచాయగా తెలిసినది. అందుచేత మనము కట్నముసంగతి ఎత్త వద్దు. కాబట్టి నీవు తప్పకుండ వెళ్ళి చూడ వలసినది. నీకు నచ్చినచో మాకు ఏ అభ్యంతరము లేదు. ఇక్కడ పిల్లలందరు కులాసాగా వున్నారు. అమ్మఇంట్లో కులాసాగానే వున్నది. చూసి వెంటనే ఉత్తరం రాయి. ఇంతే సంగతులు.

ప్రేమతో
చక్రపాణి.

* * *

బెజవాడ,

ప్రియమైన నాన్నగారికి,

మీరురాసిన వుత్తరము అందినది. వెంటనే రాయలేకపోయినందుకు క్షమించవలయును. మీరు వ్రాసినటు పెద్దనాన్నగారు, నేను ప్రసాదరావుగారి ఇంటికివెళ్లి పిల్లను చూసినాము. మీరు చూడమన్నారు గదా చూద్దామని చూశాను. కాని నామనసు మారినది. ఆ అమ్మాయి చాలా బావుంది. తెల్లగా వుంటుంది. పెద్దనాన్నగూడ బావుంది అన్నారు. నాకు ఆ అమ్మాయిని ఇంకా చదివించాలని వున్నది. పెళ్ళి అయ్యాక అవన్నీ చూసుకోవచ్చు. ఆ అమ్మాయికి కూడ ఎట్టి అభ్యంతరము ఉండదను కుంటాను. నాకు మొదటినుండి కట్నము పుచ్చుకోవటము ఎంతమాత్రము ఇష్టములేదు. అందువలన ఆవిషయము గురించి ప్రస్తావించకుండ ప్రసాదరావుగారికి ఉత్తరము వ్రాయండి. అందరిని అడిగానని చెప్పండి. లత ఆడుకుంటోందనుకుంటాను. దానికి నాముద్దులు. ఇంతేసంగతులు.

ప్రేమతో
గోపాల్

* * *

కుమారి వి. విమల

చెన్నపట్టణము.

ప్రియమైన గోపాలుకి,

నీ ఉత్తరము అందనది. ఇప్పటికయినా ఒక అమ్మాయిఅంటూ నీకు నచ్చినందుకు సంతోషము. ఎంతమందో నువ్వు పెళ్ళి చేసుకుంటానంటే అడుగుదామని కూర్చున్నారు. నువ్వు ఆ అమ్మాయిని ఒప్పుకున్నందుకు చాలా సంతోషం. గుణవంతురాలు, రూపవంతురాలును. నువ్వు చాలా అదృష్టవంతుడివి. కాని మళ్ళీ చదువు అంటున్నావు. హోటలుతిండి తినలేక నానా తంటాలు పడుతున్నావు. కాబట్టి ఇంకొక్క-

★ చక్రపాణి ★

సారి ఆలోచించుకోనవలసినది. మేము ఇక్కడే వుంటాము కాబట్టి ఆ అమ్మాయి చదువుకోవచ్చు. నాకేమి అభ్యంతరము లేదు. నేనేమి కట్నముసంగతి ఎత్తకుండ, నువ్వు ఒప్పుకున్నావని వ్రాశాను. నిన్ననే ప్రసాదరావుగారు ఉత్తరం వ్రాసారు. వారి పిల్లకు ఏవో వస్తువులు పెట్టుకుంటారుట. డబ్బు వున్నదని విన్నాము కాబటి ఒక పది వేలవరకు ముట్టచెప్పవచ్చు. ముహూర్తం పెట్టి పంపించారు. ఇంక నెలరోజులు వ్యవధి వుంది. ఇంతకు నీకిది రాసిపెట్టి వుంది. అందమైన పిల్ల, చదువుకున్న అమ్మాయి. మనం అడక్కుండానే నగలు అడిగింది. అమ్మకి చాలా సంతోషంగా వుంది. సెలవకి ముందుగానే రాసుకో. అందరూ కులాసాగా వున్నారు. చదువు సంగతి మరోసారి ఆలోచించుకోనవలసినది. ఇంతే సంగతులు.

ప్రేమతో
చక్రపాణి.

* * *

విజయవాడ.

ప్రియమైన నాన్నగారికి,

మీరు వ్రాసిన ఉత్తరము అందినది. మీకందరికికూడ ఈసంబంధం ఇష్టమయినందుకు సంతోషము. కాని మీరు చదువుసంగతి మరియొకసారి ఆలోచించుకో అని వ్రాశారు. హోటలు భోజనం సంగతి ఏమిటని మీ ప్రశ్న. దానికేమి ఫరవాలేదు. నేను ఎలాగో గడుపుకుంటాను. నాకు చదువుమీద వున్న ఇష్టముకొద్ది చదివించాలనుకుంటున్నాను. అమ్మాయి పేరు నిర్మల. మీరు కట్నం సంగతి ఎత్తనందుకు సంతోషముగా యున్నది.

తాజాకలం: నిన్ననే ప్రసాదరావుగారి వద్దనుండి వుత్తరము వచ్చినది. అమ్మాయి చదువు విషయంలో ఆయన కేట్టి అభ్యంతరము లేదుట. ఇంక దేనికి అడ్డులేదు. నేను శెలవుపెట్టి ఒక వారం రోజులు ముందుగానే వస్తాను.

ప్రేమతో
గోపాల్.

* * *

చెన్నపట్నము.

ప్రియమైన గోపాలుకి,

నువ్వు నిర్మలని ఇక్కడ దింపి వెళ్లినందుకు చాలా సంతోషముగా నున్నది. నిన్ననే

కాలేజీనుండి ఇంటర్వ్యూకార్డు వచ్చినది. ఇవాళ తీసుకువెళ్ళి కాలేజీలో చేర్పించినాను. చాలా మంచిపిల్ల. ఇంట్లో అమ్మకి సహాయముగా కూడ వుంది. కాని అమ్మకి ఒక్కటే పట్టుకుంది. డబ్బు వుండి కూడ ఆయన ఒక పదివేలు ఇవ్వలేదని. అందులో ఆయన తప్పులేదు. మనమేమి అడగలేదు కదా. డబ్బు వున్నదో లేదో కూడ మనకి తెలియదు. అమ్మ కొంచెము ఇదవుతోంది. దానికి నేనేమి చేయలేను. నిర్మల ఇప్పుడే కాలేజీనుండి వచ్చినది. కులాసాగానే వున్నది. ఇంతే సంగతులు. ప్రేమతో

చక్రపాణి.

* * *

విజయవాడ,

ప్రియమైన నిర్మలకు,

నీవు ప్రేమతో వ్రాసిన ఉత్తరము అందినది. నువ్వు కాలేజీలో చేరినందుకు నాకు చాలా సంతోషముగా వుంది. అందరు కొత్త వాళ్ళే అని రాశావు. మరి కొత్తవూరయినప్పుడు కొత్తవాళ్ళవరూ? నెమ్మదిగా అలవాటవుతారు. ఒకపూట నువ్వే వంట చేస్తున్నానని రాశావు. నిజమే నువ్వు చెప్పినట్లు వంట, చదువు రెండు సాగవు. నాన్నగారు, వంటవాడు వెళ్ళిపోతే మళ్ళీ వేరేవాడినిచూస్తారు. ఎలాగో నాలుగు రోజులు ఓపికపట్టు. అమ్మకి కాస్త సహాయం చేస్తూవుండు. నేను మూడు నెలలు పోయాక సెలవుపెట్టి వస్తాను. నేను వండుకు నే తింటున్నాను. ఇంతే సంగతులు.

ప్రేమతో

నీ గోపాల్.

* * *

చెన్నపట్టణము.

ప్రియమైన శ్రీవారికి,

మీరు రాసిన ఉత్తరము అందినది. మీరే వండుకు తింటున్నందుకు నాకు చాల కష్టముగా నున్నది. ఇది అంతా మీరు చేసుకున్న దేకదా. నేను కాలేజికి వెడుతున్నాను. నాకు సంధ్య అనే మంచి స్నేహితురాలు దొరికింది. మీ అమ్మగారికి సహాయము చేయుచున్నాను. అయినా ఆవిడ నాతో చాలా ముభావంగా వుంటున్నారు. నా తల్లిని, చెల్లెళ్ళని వదిలి వచ్చానన్న కొరత మీ అమ్మగారు తీర్చలేకుండ వున్నారు. నీకు ఎన్ని వేలు ఇస్తారు మీ నాన్నగా"రని మీ అమ్మగారు అడిగారు. నాకు తెలియదన్నాను. కొత్త వంటవాడు వచ్చాడు. మీరు వస్తున్నందుకు చాలా సంతోషము. ఇంతే సంగతులు.

ప్రేమతో

మీ, నిర్మల.

* * *

బెజవాడ

ప్రియమైన నిర్మలకు,

అమ్మాయీ, నువ్వు కులాసాగా వున్నందుకు సంతోషము. మళ్ళీ కాలేజి చదువు ఎలా వుంది? చెల్లెలు నీకోసం బెంగపెట్టుకుంది. ఈ సారికూడ నీకు క్రాస్‌వర్డ్సులో ప్రయిజు రాలేదు. ఏదో ఒక్కసారి ఒక యాభైరూపాయలు వస్తే ఎప్పుడు వస్తుందా నీపిచ్చిగాని!మళ్ళీ వేశానన్నావు. నీపేరుతో వేస్తే రాకపోతే నాపేరుతో వేస్తే వస్తుందా. సరే మాద్దాంలే. ఈ పజిల్స్ వేసి నీ చదువు పాడుచేసుకోవద్దు. బాగాచదువుకో. అల్లుడుగారి దగ్గరనుండి కులాసాగావున్నట్లు ఉత్తరాలువస్తున్నాయా?అమ్మ కులాసాగావుంది. అల్లుడు రోజూ కనపడుతూనే వున్నారు.

ప్రేమతో,

ప్రసాదరావు.

* * *

బెజవాడ.

ప్రియమైన నిర్మలకు,

నేను ఇక్కడికి కులాసాగా జేరినాను. అక్కడ వున్న రెండు నెలలు రెండు క్షణాలులాగ గడిచిపోయాయి. మళ్లీ నీకు కాలేజి తెరిచారనుకుంటాను. అమ్మ మాటలను గురించి నీవేమి బాధపడనక్కరలేదు. నువ్వు ఏమీ సమాధానం చెప్పవని నాకు తెలుసు. అమ్మ నీతో అంత చనువుగా లేకపోతే ఫరవాలేదు. మొన్న నేను వచ్చినప్పుడు నాతోకూడ అంది, నీతో ఒక ఐదు వేలు తెమ్మని చెప్పమని. నేను అడగనని చెప్పాను. అమ్మకి నామీదకూడ కోపం వచ్చింది. అయినా అవ్వ కావాలి, బువ్వ కావాలి అంటే వస్తాయా? అందమైన, చదువుకున్న అమ్మాయి కావాలి, కట్నం కావాలి అంటే వస్తాయా? నీ మనసేమీ పాడుచేసుకోవద్దు. నీ ఉత్తరంతోపాటు నాన్నగారి దగ్గర నుండి ఉత్తరము వచ్చినది. నీకు అన్నిటిలోను చాలా మంచిమార్కులు వచ్చాయట కదూ? నా కోరికదే. వెంటనే ఉత్తరం రాయి.

ప్రేమతో

నీ గోపాల్

* * *

చెన్నపట్టణము.

ప్రియమైన శ్రీవారికి,

మీరు వ్రాసిన ఉత్తరము అందినది. ఈ మధ్య నా ఒంట్లో ఏమి బాగుండటములేదు. మళ్ళీ వంటవాడు మాని వేసినాడు. వంటకూడ చేయలేక పోవుచున్నాను. మొన్న మాసంధ్య ఇంటికివెళ్లి కళ్ళు తిరిగి పడిపోయినాను. ఇంకా నయం కాలేజీలో అవలేదు. అప్పుడప్పుడు, నేను డబ్బు తేలేదని మీ అమ్మగారి సతాయింపు ఎక్కువగా నున్నది. నాకు మా ఇంటికి వెళ్ళాలని వున్నది. మీరు మీ నాన్నగారిపేర ఉత్తరము వ్రాయండి. అక్కడ మా నాన్నగారితో చెప్పండి. నన్ను వచ్చి తీసుకువెళ్ళుతారు. వెంటనే ఉత్తరం వ్రాయండి.

ప్రేమతో

మీ నిర్మల

* * *

బెజవాడ.

ప్రియమైన నిర్మలా,

అమ్మకి నువ్వు వ్రాసిన ఉత్తరము చదివాను. నీవు అక్కడ కష్టపడుతున్నందుకు నాకు చాలా బాధగా వుంది. మీ మామగారి వద్దనుండి అల్లుడికి ఉత్తరము వచ్చిన వెంటనే నేను వచ్చి తీసుకు వెడతాను. వెంటనే ఉత్తరము వ్రాయి. అమ్మగూడ ఉత్తరము వ్రాస్తుందిట.

ఇట్లు

ప్రసాదరావు.

* * *

ప్రియమైన నిర్మలా,

అంత నీరసంగా నువ్వు అక్కడ బాధపడుతున్నందుకు నాకు చాలా కష్టంగా వుంది. ముందర అలాగే వుంటుంది. నువ్వు తల్లి వికాబోతున్నందుకు చాల సంతోషము. నాన్నగారు వచ్చి నిన్ను తీసుకువస్తారు. అల్లుడుగారికి చెప్పాము. నీ ఆరోగ్యంగురించి జాగ్రత్త తీసుకోవలసినది.

ప్రేమతో

అమ్మ.

* * *

గుంటూరు.

ప్రియమైన మామగారికి,

సరిగా సమయానికి నా కీవూరు బదిలీ చేసారు. నేను అక్కడ వుంటే మీకు కొంచెము సహాయముగా వుండేవాడిని.

★ చక్రపాణి ★

ఇక్కడ మంచిఇల్లు దొరికినది. అద్దె యాభై రూపాయలు. అన్ని సదుపాయములువున్నవి. నిర్మల కులాసాగా తిరుగుతున్నదనుకుంటాను. ప్రసవించిన వెంటనే ఉత్తరము వ్రాయండి. మా ఇంట్లో అంతా కులాసాగా వున్నారు.

ఇట్లు,
గోపాల్.

* * *

బెజవాడ.

ప్రియమైన గోపాల్‌కి,

నీ ఉత్తరము అందినది. నీ ఉత్తరము అందిన రోజునే నిర్మల కులాసాగా ప్రసవించినది. బుధవారం రాత్రి 8-40 గంటలకి మొగపిల్లవాడు పుట్టినాడు. తల్లి, పిల్లవాడు కులాసాగా వున్నారు. నువ్వు బారసాల రోజుకి రావలసినది. మీ నాన్నగారికి గూడా వ్రాశాను.

ఇట్లు,
ప్రసాదరావు.

* * *

గుంటూరు.

ప్రియమైన నాన్నగారికి,

నేను ఇక్కడికి కులాసాగా చేరినాను. అల్లుడుగారు స్టేషనుకి వచ్చితీసుకువెళ్లినారు. మీరు ఇచ్చిన పదివేల రూపాయలు ఇచ్చినాను. అది చూసి నాకెందుకు నిర్మలా అన్నారు. వెంటనే వాళ్లి నాన్నగారికి, అమ్మగారికి ఉత్తరము వ్రాశారు. బారసాలకి రాకపోయినా, పదివేలుఇచ్చామన్న సంతోషంతో మా మామగారు, అత్తగారు అంతా బయలుదేరి రేపు వస్తున్నారు. బాబు కులాసాగా వున్నాడు. మా మామగారి పేరు పెట్టినందుకు చాలా సంతోషించారు. ఇంతే సంగతులు.

ప్రేమతో,
నిర్మల.

* * *

బెజవాడ.


ప్రియమైన నిర్మలా,

ఏదో మనస్పర్థలు లేకుండా మీరంతా బాగుండాలనే నాకోరిక. దీనికంతా కారణం నువ్వు నా పేరుతో పజిల్ వేయటమే. ఆ చెక్కు నా పేరుతో వచ్చింది. అది నిజంగా నీపజిల్చే. వాళ్లు నేను ఇచ్చినట్టుగానే భావిస్తారు. ఇదంతా బాబు పుట్టిన వేళావిశేషం. ఏమైతేనేమి చిన్ని చక్రపాణి వచ్చి మీ మనస్పర్థలు తీర్చాడు. పజిల్స్ వేస్తూవుండు. అమ్మ కులాసాగా వుంది.

ప్రేమతో,
ప్రసాదరావు.

★

వనితాలోకం



శాపనార్థాలు

కె. విజయకుమారి

★

మంచి-చెడ్డా

"యథారాజా! తథాప్రజా!" అన్నారు పెద్దలు. అదేవిధంగా తల్లిదండ్రుల ప్రవర్తన ఏ విధంగా ఉంటే పిల్లలుకూడా చాలావరకు ఆ ప్రవర్తనకే అలవాటు పడతారు.

చాలామంది తల్లులు తమ పిల్లలు ఏవైనా తప్పు పనులు అల్లరిపనులు చేస్తే ఎన్నో విధాలుగా తిట్టి పోస్తారు. వాళ్లు తిడుతున్నపుడు వినేవాళ్ళకు బలే నవ్వొస్తుంది. తిట్టిన తిట్టు మళ్లీ తిట్టకుండా, మధ్యలో యెక్కడా ఆపకుండా, అపస్వరం లేకుండా మంచిమాట దొర్లకుండా ధారాళంగా ఒక పదినిముషాలు తిట్టేస్తారు.

ఇటువంటి తిట్లు అలవాటయినవారు, కారణం లేకుండానే మాటిమాటికి ఉపయోగిస్తారు.

ఒకావిడ "ఒరేయ్! రామూ" అని తన కొడుకుని పిల్చింది. ఆ పిల్లవాడికి తల్లి పిలుపు వినిపించలేదు. ఆమె మళ్ళీ పిల్చింది. ఈ తడవ ఆ అబ్బాయి "ఏమిటే అమ్మా!" అంటూ పరుగెత్తుకు వచ్చాడు. ఇక ఆ తల్లి తన దండకం విప్పింది. "ఎక్కడ చచ్చావురా! చచ్చినాడ! నిన్నెన్నిసార్లు పిలవాలిరా వెధవా! నీ చెవులు పూడిపోయాయటరా, మొద్దూ! నీ జిమ్మడియ్యా!" ఇలాంటి తిట్లు ఉచ్చ స్థాయిలో పెళపెళా తిట్టేసింది. ఆ పిల్లవాడు తన తల్లి తిట్లు ఆపేవరకూ మౌనంగా వింటూ కూర్చున్నాడు.

ఆ సమయంలో ఆ పిల్లవాడు గనుక నోరు విప్పితే అంతులేని దుమారం చెలరేగి అల్లరి అయ్యేది. ఆపిల్లవాడు ఆక్షణంలో మౌనంగా ఉండటమే ఎంతో శ్రేయస్కరం అయింది.

కొందరు పిల్లలు ఇటువంటి తిట్లు భరించలేక రోషమొచ్చి యెదురు మాట్లాడుతారు. అక్కడితో ఆ తల్లీ కొడుకుల మధ్య దుమారం లేగుతుంది. ఎంతసేపో వాదించుకుంటారు. కాని ఆ వాదనవల్ల వచ్చే ఫలితం శూన్యం.



తల్లులకోపం, మరుక్షణంలోనే పోతుంది. కాని పిల్లలుమాత్రం ఆ క్షణంలో ఆవేశంతో ఎంతటి సాహసాన్నయినా చేస్తారు.

ఇక కొందరు పిల్లలు తిట్లకు రోజూ అలవాటుపడి వుండటంచేత వాటిని లెక్క చెయ్యరు. విననట్టే వూరుకుంటారు. క్రమేపి వాళ్ళల్లో నిర్లక్ష్యభావం ప్రవేశిస్తుంది. ఆ నిర్లక్ష్యభావం ప్రతి విషయంలోను యేర్పడి గట్టి చిక్కును తెచ్చిపెడుతుంది.

నే నెరుగున్నావిడ ఒకామె తన కొడుకు పుస్తకాలు పారేసుకు వచ్చాడని యెన్నో విధాలుగా వినరానితిట్లు తిట్టింది. ఆ అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. అతనికి 18 సం. వయస్సు వుంటుంది. ఆ కుర్రవాడు ఆ తిట్లు భరించలేక కచ్చితో ఎక్కడికో పారిపోయాడు. ఎంత పోట్లాడినా మరి కన్నతల్లేగా! ఆ వాత్సల్యం యెక్కడికి పోతుంది. ఆమె యెంతో డబ్బు ఖర్చుచేసి వెతికించి తీసుకొచ్చింది. ఆ అబ్బాయికి తండ్రి లేడు.

ఇలా కొస్తరు కూస్తరు కొడుకుతో పోట్లాడి పొమ్మనటం ఆ అబ్బాయి వెళ్లటం మళ్ళీ వెతికించి తీసుకురావటం పరిపాటైంది. ఇలా పారిపోవటంతో ఆ అబ్బాయికి కాలేజీలో అటెండెన్సు తక్కువయింది. ఆ అబ్బాయి చదువు శ్రద్ధగా చదువుకునేవాడు. ఏం లాభం? ఈ యేడు ఆ అబ్బాయి చదువు వృధాగాపోయింది.

ఈ గొడవంతా ఆ తల్లి తనకొడుకు మనస్తత్వం గ్రహించకుండా తిట్టటంవల్లనే జరిగింది.

తిట్లు అనేవి తిట్టేటప్పుడు వాటి అర్థం ఆలోచించకుండా తిడతారు. నిజంగా వాటి అర్థాలే గనుక ఆలోచిస్తే ఏ తల్లీ యే బిడ్డనూ కూడా తిట్టలేదు. మనలో చాలామందికి అంతవరకు ఆలోచించేశక్తి వుండదనిపిస్తుంది.

కొందరు తల్లులు తమ బిడ్డలు చెప్పే ప్రతి మాటకు వ్యతిరేకంగా చెప్తూ అచ్చంగా తాము చెప్పినట్టే వారు నడుచుకోవాలని పట్టుపడతారు. పిల్లలు ఏదైనా వింత సంఘటన గురించి సంతోషంగా చెప్పటానికివస్తే "ఓస్ యిదేనా! మహా గొప్పగా చెప్పటానికి వచ్చావు. ఎవరికీ తెలియని సంగతీ! ముష్టిముండ ముష్టివాగుళ్ళు" అని తిట్టి వాళ్ల మనస్సును చిన్నబుచ్చుతారు.

ఎప్పుడు ప్రతివిషయానికి పిల్లల కిలాంటి చీదరింపుమాటలు వింటుంటే చిన్నతనం కలిగి మళ్ళీ యేమాట మాట్లాడటానికైనా జంకుతారు. ఇటువంటి పిల్లలు నలుగురిలో మాట్లాడటానికి సిగ్గుపడి తెలివి వుండి కూడా తెలివి తక్కువ వాళ్లల్లో జమ అవుతారు.

★ శాపనార్థాలు ★

ఒకావిడకుమార్తె స్కూలుఫైనల్ చదువుతోంది. ఆ పిల్లకు కాలేజి చదువు చదవాలని మహా అభిలాషగా వుండేది. దానికి తగ్గట్టు ఆ పిల్ల తల్లి "నిన్ను గోతిలో బెట్ట! చదవవేమే! ఫెయిలయితే నీకు యిక చదువు చెప్పించేది లేదు. నీకు భూమ్మీద నూకలుండవు పాడుదానా! అంటు తపేశాలుతో మాల్సిన కర్మపడుతుంది. గడగఢా చదవవేమే!" అంటూ యెప్పుడూ చదువుతూనే కూర్చున్న ఆ అమ్మాయిని తిడుతూనే వుండేది. అలా తిడితే తమ పిల్లలు బాగా చదివి అభివృద్ధిలోకి వస్తారని వారి వూహ. కాని యీ పోరే పిల్లలఅభివృద్ధికి ఆటంకం.

ఆ పిల్ల పుస్తకాలు ముందేసుకొని కూర్చునేదే గాని "తాను ఫెయిలయితే చదువు చెప్పించరుకదా! తన తోటివాళ్ళంతా కాలేజీలో చదువుతుంటె తను అప్పుడే సంసారంలో పడిపోవాలా?" అన్న ఆలోచనలే వచ్చి చదువుమీద ధ్యాసలేకుండా పోయింది. "ఆ అమ్మాయి మనసులోనివి నీకెలా తెలుసు?" అంటారేమో ఆ అమ్మాయి నాతో స్వయంగా చెప్పింది.

అసలు పరీక్షలు దగ్గరకు వచ్చాయి. ఆ అమ్మాయి పరీక్ష వ్రాసింది. వ్రాసేటప్పుడు తల్లిమాటలే గుర్తువచ్చి ఆందోళనతో యెలాగో ముగించాననిపించి వచ్చింది.

పబ్లిక్ పరీక్షాఫలితాలు తెలిసాయి. ఆ అమ్మాయి నెంబరు అందులో లేదు. కారణం?

రాత్రింబవళ్లు కష్టపడి చదివినాకాని మనశ్శాంతి లేకపోతే పరీక్షలు యెలా వ్రాయగలుగుతుంది. ఎలా పాస్యవుతుంది. దీనికి కారణం తల్లి చాదస్తమేగా!

చాలామంది యిళ్ళల్లో ముసలివాళ్లు తరచుగా వుంటారు. వాళ్ళకు ఈ కాలపు ఫాషన్లు గాని నాగరికతలుగాని నచ్చవు. ఇటువంటి ముసలమ్మలు వయసొచ్చిన ఆడపిల్లల వెనుక యెప్పుడు తిరుగుతూ వాళ్ళు చేసే ప్రతిపనికి నానాఅర్థాలు తీస్తూ సాధిస్తూ వుంటారు. తాము కొట్టే పిల్లలను గొప్ప మార్గదర్శకులుగా తయారు చేస్తున్నామని ఉప్పొంగుతారు ఈ ముసలమ్మలు.



కఠినమైన సాధింపులు పిల్లల హృదయాల్లో ఎటువంటి పరిమాణాన్ని కలిగిస్తయ్యో వాళ్లు ఆలోచించరు.

మా ఇంటి ప్రక్క ఇంట్లో ఒక ప్లీడరుగారి కుటుంబం వుండేది. ప్లీడరుగారు సహా ఆ యింట్లో ఆరుగురుజనాభా, ప్లీడరుగారు, ఆయనభార్య, ముగ్గురు పిల్లలు, ప్లీడరుగారి ముసలి అత్తగారు వున్నారు.

ఆ ముసలమ్మ పని యెప్పుడూ వాళ్ళపిల్లలను తిట్టటమే నేమో అనిపిస్తుంది నాకు. పొద్దస్తమానం ఆమె గొంతు కంచుమాదిరిగా మా యింటికి వినిపిస్తూనే ఉంటుంది.

ఎప్పుడూ "నళినీ! దేనికే అలా బయటికి వస్తావు? బడికెళ్లేటప్పుడు రోడ్డుప్రక్కగా నడుస్తున్నావా? తలవంచుకు నడుస్తున్నావా? ఎందుకు? యెప్పుడూ తలుపుతీసి బయటికి చూస్తావు?" ఇత్యాది ప్రశ్నలు నళిని మనస్సునెంత గాయపరుస్తున్నవో ఆ ముసలమ్మ ఆలోచించదు.



'ఇంటికి రాగానే' ఆవిడ కసురుకోవడం వింటారుగాని, ఆయన పదింటికి వచ్చాడన్న విషయం పక్కింటివారు లెక్కించరు గదా.

అసలు నళినిగుణం మంచిది. సహజంగా యెక్కువ సిగ్గుకలదికూడా!

ఒకసారి నళిని ఏదోపనిమీద నా దగ్గర కొచ్చింది. ఆమె కళ్ళు యెర్రగా జ్యోతుల్లాగా వున్నాయి. నేను ఆ అమ్మాయి ఎందుకో యేడ్చిందని గ్రహించాను.

"నళినీ! నువ్వు యెందుకేడ్చావో నాతో చెప్పవూ!" అని బ్రతిమాలాను.

"ఏమి చెప్పమన్నావు కుమారీ! నిర్మల ముగ్గులు చాలా అందంగా వేస్తుంది. పెద్ద పెద్ద ముగ్గులుకూడా వేస్తుంది. నిర్మల ఇవ్వాళ యేమి ముగ్గు వేసిందో చూద్దామని తలుపుతీసి వాళ్ళ వాకిట్లో వేసిన ముగ్గును చూస్తున్నాను. ఇంకేముంది వెనుకనే మా అమ్మమ్మ వచ్చి తొంగిమాసి "ఎందుకే తలుపుతీశావు పెంటముండ! పెంటబుద్ధులు! ఆ అబ్బాయిలతో నీ కేమి పని? ఆ అబ్బాయి లక్కడుండి నవ్వుతూ ఆడుకుంటుంటే నువ్వు తలుపుతీసి వారివంక చూస్తావుటే" అని అరచింది. అసలు నేనంతవరకూ ఆ అబ్బాయిలక్కడున్నారన్న సంగతే గమనించలేదు. అయినా ఆ అబ్బాయిలు చిన్న కుర్రవాళ్లు. పన్నెండు, పదమూడేళ్ళవాళ్లు. నాకు కోపమొచ్చి "నీ కెందుకు?" అన్నాను.

"పళ్లు రాలతాయి వెధవముండా! అని తిట్లు ప్రారంభించింది. నే నింకేమి చెప్పను" అని నాతో చెప్పి నళిని బాధపడింది.

అవునుమరి. ఉన్నదొకటైతే లేని పోని అర్థాలుతీసే ఇలాంటి ముసలమ్మదగ్గర బ్రతకటమే కష్టం. ఇలాంటి మాటలు అనవసరంగా పడేవారికి ఆ సమయంలో రోషమొచ్చి ఎంతటి సాహసానికైనా వెనుదీయరు. వారి మనసులు చెడిపోతాయి. సాహసించలేనివారు కుళ్లికుళ్లి కృశించుతారు.

మరి అలా తలుపుతీస్తే అనుమానపడటం తప్పా అంటారేమో! అనుమానపడొచ్చు. కాని వారినడిగే ప్రశ్న లలావుండకూడదు.

"అమ్మా! యేమిటి చూస్తున్నావని" అడిగితే ఆ అమ్మాయి సమాధానం చెప్పితే అది విని అక్కడికీ తప్పనితోస్తే మెల్లిగా సర్ది చెప్పాలి. కాని విపరీతార్థాలు తీసి శాపనార్థాలు పెట్టకూడదు.

పిల్లలేవైనా తప్పుపనులు చేస్తే కోప్పడి బెదిరించి ఒకవిధంగా కొట్టవచ్చుకూడాగాని పిచ్చితిట్లు తిట్టి వారి మనసులు పాడుచెయ్యకూడదు.

కొందరు తల్లులు తిట్టకపోయినా అన్నమాటే పదిసార్లంటూ చెవిహోరెత్తేలా కఠోరంగా మాట్లాడుతారు. ఆ కఠినవాక్కులకు పిల్లల హృదయాలు తట్టుకోలేవు. ఇటువంటి విషయాల్లో తల్లులు శ్రద్ధగా వుండాలి.

కొందరు తల్లిదండ్రులు పిల్లలమీద అతిగారాబంలో వాళ్లు చెడ్డపని చేస్తున్నా చూసి చూడనట్టే వూరుకుంటారు. అందువల్ల పిల్లలూ తల్లిదండ్రులూకూడా పడేబాధ ముందుముందుంటుంది ★

★ రేఖాచిత్రపంచకం ★

పార్వతీ, ఎన్నిసార్లు చెప్పాలి, అట్లా పక్కింట్లోకి చూడొద్దని. మనకు వాళ్ళకు వున్న తగాదాసంగతి తెలియదూ! అని కూతుర్ని కేకలేసి తడిక సందులోంచి తొంగిచూస్తోంది ఆ ఇంటి గృహిణి.

చూశావా శేఖర్ వాళ్లు ఎట్లా పోట్లాడుతున్నారో. ఇక ఆ ఇంటికి వెళ్ళక. వెళ్లావో కాళ్లిరుగుతాయి జాగ్రత్త అని తన ఆరేళ్లకొడుకుని బెదిరిస్తోంది పొరుగింటి ఇల్లాలు.

* * *

ఖాళీ అయిన వాటాలోకి అద్దెకొచ్చినావిడ, పక్కింటి శ్రీమతితో "ఇక్కడికి వచ్చిం తరువాత హాయిగా వుందండి. అక్కడేమో ఇరుగు, పొరుగు ఎవరూ లేరు. ఇక్కడ పదిమందిలో సరదాగా వుండచ్చు" అంది.

"అయ్యయ్యో, ఆమాట అనకండీ, వాళ్లకు మాకూ ఉన్న తగాదాలు తెలియదు కాబోలు. మనమీద వాళ్లు పరాశక్తుల్లాగా విరుచుకుపడతారు" అని నోరు నొక్కుకుంది శ్రీమతి.

* * *

"చూశావా లక్ష్మమ్మ వాళ్ల జయకు ఇరవై ఏళ్లున్నాయి. ఇంకా పెళ్లి కాలేదు" అన్నది నూరమ్మ తనకు పాతికేళ్లు నిండాక పెళ్లయిన సంగతి జ్ఞాపకం లేక.

"పెద్దగా అనేరుసుమండీ ఆ మాట. అసలే మనమంటే వాళ్లకు పుండుమీద కారం చల్లినట్లుంది. అయినా కలియుగం కాకపోతే ఏమిటి చెప్పండి. నిక్షేపంగా పన్నెండేళ్లకు పెళ్లి చెయ్యక." మూతి మూడొంకర్లు తిప్పుతూ సాగదీసిం దీమాట లక్ష్మమ్మ. కాని తన ఇరవై ఆరేళ్ల చెల్లెలికి మొన్ననే పెళ్లయిందన్న సంగతి ఇప్పుడు కబుర్లకొచ్చిన నూరమ్మకు తెలీదుగా.

* * *

శేషమ్మ వంటా వార్పూ కానిచ్చుకుని మధ్యాహ్నంవేళ తీరుబడిగా పొరుగింటి కాళీదేవితో తగూ పెట్టుకుంది. ఏకధాటిగా, ఎలక్షన్ ఉపన్యాసాన్ని మించిపోయేటట్టుగా అరిచింది. ఎంతసేపని అరవగలదు చెప్పండి. చివరికి విశ్రాంతికోసం అయిదు నిముషాలు ఆపింది.


దానికోసం కాచుకున్న కాళీదేవి వెంటనే కాళీ అవతారం దాల్చింది.

చివరకు శేషమ్మకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. "ఏం చంపుకు తింటున్నదే తల్లీ. అయిదు రోజులనుండి" అని వచ్చేవాళ్ళతో, పోయే వాళ్ళతో చెప్పుకుని ఏడ్చింది. అఖరికి చేసేదేమీ లేక "జన్మజన్మాలకు నీ జోలికి రాను తల్లీ. ఇక నన్నొదిలిపెట్టు. బుద్ధి తెలియక నీ పేరెత్తా" అని చెంపలేసుకు నేదాకా వదిలిపెట్టలా కాళీదేవి.

"ఎందుకు మంగమ్మా, రవి పక్కింటి భద్రమ్మతో పోట్లాడుతున్నాడు" అని అడిగింది కాంతమ్మ.

"అయ్యో, ఇంకా నీదాకా రాలేదన్న మాట. ఈ బజారు, బజారుకు తెలుస్తే నీకు తెలియకపోవటమేమిటి? రవిని జానకమ్మ రెండురోజుల క్రిందట ఏదో అన్నదిట. అందుకని ఇవ్వాళ పోట్లాడుతున్నాడు."

"అదేమిటమ్మా, రెండురోజుల క్రిందట



"అమ్మ బొమ్మలు కత్తిరిస్తూ ఉంటే—".
—చైనీస్ ఉడ్ కట్ చిత్రం.

★ బూడిదగుమ్మడికాయతో ★

ఎండాకాలం ఎండకుగాని బాగుండని వస్తువుల్లో వడియాలు ముఖ్యమైనది. వీటిని ఎండాకాలము — అనగా ఈరోజుల్లో తయారుచేసుకుని గాలిదూరకుండా గట్టి మూతగల డబ్బాల్లో నిలవచేసుకుంటే మళ్లీ ఎండాకాలము వరకు వుండి అవుసరాలకు ఉపకరిస్తవి. ఆరోగ్యానికి మంచిది. అప్పడాలు చేయాలంటే అలవాటూ, నేర్పూ వుండాలి. సమయము చాలా వాటిక్రింద ఖర్చుపెట్టాలి. వడియాలు కొంతసూక్ష్మంలో మోక్షంగా వుంటాయి. బూడిదగుమ్మడి వడియాలు ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేదశాస్త్రము చెపుతున్నది. బూడిదగుమ్మడి కూరగాని, వడియాలుగాని అప్పుడప్పుడు తినడము, గుంటకలగరపప్పు, పచ్చడీ చేసుకుని అప్పుడప్పుడు తినడము మంచిదనీ క్షయవ్యాధిని చేరనివ్వదనీ చెప్తుతారు. ఏది ఎలావున్నా రుచిగల మంచి వస్తువులు.

బూడిదగుమ్మడి—దీనిని నిల్వచేసి తినడానికి వీలుగా హల్వా మొదటచెప్పి, తరువాత వడియాలు, కూర చెపుతాను.

హల్వా

కావలసిన వస్తువులు: ముదిరిన చిన్న గుమ్మడికాయ 1, చక్కెర 4 కప్పులు, నెయ్యి 2 కప్పులు, కోవా ½ కప్పు, యాలక్కాయలు ¼ తులం, పొట్టుతీసిన జీడిపప్పు (లేక) బాదంపప్పులు, కిసిమిస్ పండు, కొద్దిగా కుంకుమపువ్వు, నాలుగు పలుకులు పచ్చకర్పూరం.

బూడిదగుమ్మడికాయ కడిగి నాలుగు పక్షులుగాకోసి మధ్య బెండు, గింజలు తీసివేసి కొబ్బరి తురుమిడితో చక్కగా తురుముకోవాలి. పైపెచ్చువరకు తీసుకొని, పెచ్చు మటుకు పారవేయాలి. ఆ తురుమునంతా బుట్టలో మూటకట్టి, బోర్లించిన పళ్ళెంమీద పెట్టి పైన పెద్ద సానగాని, తిరుగలిరాయిగాని పెట్టి ఒక గంటసేపుఉంచి, నీరంతా ఓడిపోనివ్వాలి. తరువాత ఒక కప్పుతీసికొని, బాణలిలో రెండు కప్పులు నెయ్యి బాగా కాగనిచ్చి, దానిలో ఈ గుమ్మడితురుము వేసి మంచివాసన వచ్చేవరకూ వేయించాలి. తురుము చక్కగావుడికి ముద్దవలె అయ్యాక దించి, తీపి ఎక్కువకావలెనంటే తురుముకొలిచిన కప్పుతో నాలుగింతలూ, తక్కువకావలెనంటే మూడింతలూ చక్కెర కొలుచుకుని, ఒకకప్పు నీళ్లుపోసి పొయ్యిమీదపెట్టి ముదురుపాకం రానివ్వాలి. రెండు టేబిల్‌స్పూన్లు మైదాపిండిగాని, గోధుమపిండిగాని పాలవలె నీటిలోకలిపి ఆ పాకంలోపోసి గరిటెతో కలుపుతూ, నేతితోసహా గుమ్మడి తురుము కూడావేసి చక్కగా కలుపుతూ వుండాలి. అంతా కలిసి ముద్దగా ఉడికేటప్పుడు కోవా ముద్దను వేసి బాగా కలుపుతూండాలి. హల్వా బాగా వుడికి చమురంతా పైకివచ్చినట్టు కనబడగానే, సిద్ధంచేసిపెట్టుకున్న కిసిమిస్ పండు, జీడిపప్పు వేసి కొంచెంసేపు కలుపుతూ ఉడకనివ్వాలి. తరువాత దించివేసి యాలకపొడీ, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం పొడి వేసి బాగా చల్లారనిచ్చి, శుభ్రమైన సీసాలో పెట్టుకోవాలి. కొంతకాలం నిలవవుంటుంది.

హల్వా చేయడానికి ఉపయోగించే గిన్నె మందముగాను, అడుగు గుండ్రంగా, విశాలంగా వుండాలి. పలుచని యిరుకు గిన్నెల్లోచేస్తే, ఏ హల్వాఅయినా పాడవుతుంది. సాధ్యపడక పోయినయెడల, కోవా వేయకపోయినా ఫరవాలేదు. కొంచెం రుచి తగ్గుతుంది అంతే.

వడియాలు

కావలసినవి: బూడిదగుమ్మడి తురుము ముక్కలు ఒక శేరు, పొట్టు మినపపప్పు ఒక శేరు, పచ్చిమిరపకాయలు 5 ఫలములు, కొత్తిమిరి 2 తులములు, ఉప్పు అర గిద్ద, జీలకర్ర రెండు తులములు.

తెల్లవారి వడియాలు పెడుతామనగా రాత్రికే అన్ని వస్తువులు తెప్పించి శుభ్రపరచి పెట్టుకోవాలి. మినపపప్పు నానబెట్టాలి. బూడిద గుమ్మడికాయ తురుము, కొంత సన్నగాతరిగిన ముక్కలు కొన్ని తయారుచేసుకోవాలి. లోపలి బెండుమాత్రం తీసివేయాలి. గింజలు కూడా వడియాలో వేయాలి. తురుము, ముక్కలు అన్నీ కలిపి మూటకట్టి హల్వాకువలె నీరు తీసివేసి చిలుముపట్టని గిన్నెలోగాని మట్టికుండలోగాని జాగ్రత్తపెట్టాలి. రాత్రి రాతిక్రింద పెట్టిన మూటను తెల్లవారి తీసికోవచ్చును.

చీకటితో లేచి పప్పు శుభ్రంగా కడిగి వడియవేసి యిడ్లీపిండివలె మెత్తగా రుబ్బుకోవాలి. అయితే అంత ఎక్కువగా నీరు

★ రేఖాచిత్రపంచకం ★

అంటే ఈరోజు పోట్లాట దేనికి. అనేదేదో ఆరోజే అంటే సరిపోయేదిగా!"

"చాల్లేవమ్మా, చెప్పొచ్చావా! నీదాకా వస్తేగా నీకు తెలిసేది. ఆఅబ్బాయిని అన్నారేమో, అతను పోట్లాడుతున్నాడేమో! మన కెందుకు" అని వాళ్ళమీద వున్న కసంతా వెళ్ళగక్కిందితగూలుపెట్టే మంగమ్మ.

* * *


ఈ చిన్న చిన్న తగాదాలు నిత్యం జరిగివే. ఇందులో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఇదికూడ ఒక తగాదాలేనా అని అనుకుంటారేమో! ఇంతకన్నా చిన్నతగాదాలు, సూటిపోటి మాటలను కొని ఏళ్ళతరబడి మాట్లాడని వారున్నారంటే నిజంగా ఆశ్చర్యపడాల్సిందే.

ఈ తగాదాలు అచ్చంగా ఆడవాళ్ళలోనేనా, మగవాళ్లలో మాత్రం లేవా అనేరు. మగవాళ్ళుకూడ వున్నారు. ఎట్లాగయినా ఆడవాళ్లుపెట్టుకున్న, చిన్నచిన్న తగాదాల్లో మగవాళ్లు సౌఖ్యం చేసుకోరేమో అనుకుంటా. ఆడవాళ్ళ తగాదాల్లో మగవాళ్ళు భాగం పంచుకున్నారంటే నిజంగా ఆశ్చర్యపడాల్సిందే. ఏమీ తెలియని అమాయక కుటుంబాలమధ్య తగాదాలు పెట్టి వాళ్ళు పోట్లాడుకుంటూవుంటే ఆనందించే ఘరానా పెద్ద మనుష్యులు వున్నారు. కాలక్షేపం బటానీల్లా తగాదాలు వింటూ పొద్దుపుచ్చుతుంటారు కొంతమంది. వీటివల్ల వారికి వచ్చే లాభమేమీ లేదు.

"కాకిగా కలకాలం బ్రతికేకంటే హంసగా ఆరునెల్లు బ్రతకటం చాలన్నట్లుగా" వున్న నాలుగురోజులు కలసి, మెలసి, సఖ్యతగా వుంటేనే నలుగురు మెచ్చుకుంటారు. అంతేకాని సూటిపోటీ మాటలనుకోవటం, లేనిపోని కక్షలు పెంచుకోవటంవల్ల ఒరిగిపడే ఘనత ఏమీలేదు.

చిలికి, చిలికి గాలివాన అయినట్లుగా చిన్న పోట్లాటలే పెద్దవయి, కోర్టులదాకా వెళ్ళినవాళ్లున్నారు. ఇటువంటప్పుడు మనకె చిన్నతనం. లేనిపోని విరోధాలు పెట్టుకుంటే చివరికి అందరిచేతా "ఛీ" అనిపించుకోవడం ఖాయం.

కుమారి ఎ. రేఖాసుందరి,
(వేటపాలెం).



లంగాలకు డిజైన్ —వి. లీలాకుమారి (హైదరాబాద్)

పోయకూడదు. వడలపిండివలె ముద్దఅయ్యేట్టు వుండాలి. ఉప్పుకూడా సగం పప్పు రుబ్బేటప్పుడు వేయాలి. తక్కిన ఉప్పు, సన్నగా తరిగిన పచ్చిమిరప ముక్కలు, జీలకర్ర, తరిగిన కొత్తిమిర అన్నీ బూడిదగుమ్మడి ముద్దలో వేసి, నెమ్మదిగా 5 నిమిషాలు పచ్చడి బండతో దంచాలి. తరువాత తీసి మినప పిండిలో చక్కగా కలిపితే వడియాల పిండి సిద్ధమవుతుంది.

సాయంత్రమువరకూ ఎండ తగిలేచోట, ఒక బల్లవేసిగాని, డాబామీద గచ్చు శుభ్రంగా కడిగి, దానిమీద తెల్లని పాతబట్ట తడిపి గట్టిగా పిండి ఆతడి బట్టను పరచాలి. దానిమీద మనకు కావలసిన సైజులో వడియాలు పెట్టుకోవాలి. మంచి ఎండ తగిలి సాయంత్రానికి పచ్చి లేకుండా ఎండితే వడియం చక్కగా వుంటుంది. ఎండ లేకపోతే వడియం గట్టి పడుతుంది. బట్టమీద బాగా రెండురోజులు ఎండనిచ్చి మూడవరోజు జాగ్రత్తగా, అనగా-విరగకుండా తీసి అన్నీ వెనుకకు త్రిప్పిపెట్టి మరలా రెండురోజులు ఎండ బెట్టాలి. ఇంత ఎండకపోతే బూడిదగుమ్మడి ముక్కలో పచ్చివుండి తినడానికి బాగుండదు.

బాండీలో నెయ్యి కొంచెము ఎక్కువగా వేసి నల్లబడకుండా జాగ్రత్తగా వేయించుకుంటే చాలా బాగుంటవి. నెయ్యి అయితేనే ఈ వడియాలు రుచి. రెండో పక్షంలో మంచి నువ్వుల నూనె.

ఉప్పు, కారం కొంచెం తగ్గించి వేసుకొని పిండి తయారయ్యాక చూచి కలుపుకోవలెను. మొత్తం మీద వడియాలపిండి కొంచెం ఘాటుగా వుంటేనేగాని బాగుండదు.

ఇదేవిధంగా బూడిదగుమ్మడి తురుమును ఉడుకబెట్టిన సగ్గుబియ్యంముద్దలోకాని, వరిపిండి ముదలోకాని కలిపి పెట్టుకోవచ్చును. నేతిలోవేస్తే పువ్వుల్లా పొంగుతవి. ఈ వడియాలు ఎండిన తర్వాత బట్టనుండి తీయటానికి వెనుకప్రక్క కొంచెం తడిపి తీయాలి. లేనియెడల సగ్గుబియ్యం, బియ్యంజావ జిగురుకు ఊడిరావు. రుచికిమాత్రం మినపపప్పుతోనే రుచి.

కూర, పప్పు

చాలమంది బూడిదగుమ్మడికూర, పులుసూ, పప్పు తరచుగా చేస్తూనేఉంటారు. దానిని సాధారణంగా ఆనపకాయ మాదిరిగానే వండుతారు. సాంబారు, పులుసుకూర, పులుసు, పప్పు-కూటు అన్నీ చేయవచ్చును.

అయితే క్రిందివిధంగా వండితే- ఆనపకాయగాని బూడిద గుమ్మడి కాయ గాని చాల బాగుంటుంది.

సాధ్యపడినంతవరకు- కూరకు లేతకాయ బాగుంటుంది. ఆనపకాయవలెనే చెక్కు తీసి-బెండు గింజలు తీసివేసి సన్నగా తరిగి పెట్టుకోవాలి.

¼ వీశ బూడిద గుమ్మడి ముక్కలు, చారెడు నానబెట్టిన పచ్చిశెనగపప్పు, 4 పెద్ద వుల్లిగడ్డలు, 2 పచ్చిమిరపకాయలు, 4 లవంగాలు, 2 యాలకాయ, 4 దాల్చిని చెక్కలు, కొద్దిగా కొబ్బరి, చిన్ని అల్లం ముక్క, ఒక చెంచా ధనియాలు, ఉప్పు-కారం.

పొయ్యిమీద గిన్నెలో 2 టేబిల్ స్పూన్లు నెయ్యి బాగా కాగనిచ్చి, తరిగిన ఉల్లి పచ్చిమిరపముక్కలు వేయాలి. అవి వేగుతుండగా లవంగాలు, దాల్చినచెక్క యాలకాయలు వేసి కొంచెంసేపు వేయించీ, నానబెట్టిన శెనగపప్పు వేయాలి. అది 1 నిమిషం ఉడికేక గుమ్మడిముక్కలు పోసి తగిన ఉప్పు, కారం వేసుకోవాలి.

బాగా కలిపి మూతపెట్టి, అల్లం, కొబ్బరి, ధనియాలు మెత్తగానూరి ¼ శేరు నీళ్లతో పాలుతీసి పైకూరలో పోయాలి. జాగ్రత్తగా చూచుకుంటూ మెత్తగా ఉడికి కూర తయారుకాగానే దించుకోవాలి. అవసరమైతే మరికొంచెం నీళ్లు పోయవచ్చును. ఏలా ఉంటుందో చేసిచూడండి!

యు. సత్యబాలాదేవి.

మెప్పుకోసం

జార్జి బెర్నార్డుషా తనపనులు తానే స్వంతంగా చేసుకునేవాట్ట. దీన్నిగురించి ఒక కథ కూడా వుంది. ఒకరోజు 'షా' తన బూట్లు పాలిష్ చేసుకుంటూవుండగా ఒక స్నేహితుడు చూసి "అరెరే! ఏమండీ మీ బూట్లు మీరే పాలిష్ చేసుకుంటున్నారే?" అని ఆశ్చర్యపడుతూ అడిగాట్ట.

వెంటనే షా చిరునవ్వుతో "మరయితే మీరు ఇంకెవరిబూట్లు పాలిష్ చేస్తారు?" అని యెదురుప్రశ్న వేశాడు. దాంతో ఆ పెద్దమనిషినోరు మూతపడింది.

ఒక్క 'షా' యే కాదు. మహాపురుషులు, విఖ్యాతులైన వారెంతోమంది యెవరిపనులు వాళ్లు స్వంతంగా చేసుకోవడంలో యెంతో సుఖం వుందని తెలుసుకున్నారు. అయితే మనలాంటి సామాన్యులంమాత్రం అదేదో తప్పుపని అనుకుని సిగ్గుపడతాం. అంటే బద్ధకం అనుకోకండేం? ఇంట్లో తలుపు చేరేసుకుని యెన్నిపనులున్నా గప్ చుప్ గా చేసుకుంటాం, కాని ఎవరన్నా చూస్తూండగా చెయ్యాలంటే కొత్త పస్తాయిస్తాం. ఇబ్బంది పడతాము. మొన్న మొన్నటిదాకా వీథి గుమ్మానికి పసుపురాసి, బొట్లుపెట్టవలసి వచ్చినా, పనిమనిషి యెగ్గొట్టితే కొత్త వీథి గుమ్మం, మెట్లు తుడవవలసివచ్చినా ఎవరైనా తెలిసినవాళ్లు గాని కాలేజీమేట్సు గాని కనిపిస్తారేమోనని సిగ్గుగా వుండేది. మా అమ్మ "ఎవరిపనులు వాళ్లు చేసుకోవటానికి సిగ్గెందుకు? వాళ్లింట్లో మాత్రం పని చేసుకోరా? అయినా ఇంకెవరి గుమ్మం తుడవటం లేదుగా" అనేది.

ఇప్పుడిప్పుడు ఆలోచిస్తే ఆమాటల్లో యెంతో నిజంవుంది అనిపిస్తుంది. (అప్పుడెలావున్నా) ఒకసారి స్కూల్లో చదువుతూండగా మా హెడ్ మిస్ట్రెస్ యింటికి వెళ్లడం తటస్థించింది. ఆవిడ వయస్సులో చాల చిన్నావిడ. మాతో చాలకలుపుగోలుగా, సరదాగా వుండేవారు. మేం వెళ్లేసరికి ఆవిడ పెద్దబూజులకర్ర పట్టుకుని పట్లు దులిపి యిల్లంతా శుభ్రం చేస్తున్నారు.

మాకు చాల సిగ్గేసింది! ఎందుకంటే ఆవిడ మమ్మల్ని చూసి సిగ్గుపడతారేమో నని. కాని ఆవిడ మమ్మల్ని నవ్వుతూ ఆహ్వానించారు. ఇక్కడంతా శుభ్రంగా లేదర్రా! అరూమ్ లోకిపోయి కూర్చోండి. ఇప్పుడే వస్తాను." అన్నారు.

ఇంకోసారి వస్తామండి. మీరు పనిలో వున్నారని తెలీదు. అని యెలాగో తప్పించుకుని పోదామని చూశాము. ఆవిడ మమ్మల్ని వెళ్లనివ్వలేదు. మరేం ఫర్వాలేదు. వెళ్లి కూర్చోండి. ఏం మీయింట్లో బూజులు దులుపుకోరా యేమిటి? నేను ఇంట్లోకూడా స్కూల్లో లాగానే వుంటాననుకున్నారా? అని మమ్మల్ని వాళ్లపాపాయితో కాస్సేపు ఆడుకుంటూ వుండమని చెప్పి తమపనిపూర్తి చేసి స్నానంచేసి బట్టలుమార్చుకుని వచ్చి చాల సరదాగా మాట్లాడేరు. మాకు ఆశ్చర్యం వేసింది. మనం యెప్పటికైనా అలా వుండగలిగితే బాగుణ్ణు అనుకునేవాళ్లం.

మా చిన్నాన్నగారి కూతుర్ని, ఒక పల్లెటూరిచ్చారు. ఇంక మా బావ వున్నాడే రాము; రాము, చదువుకున్నాడన్న మాటే గాని ఎవరైనా వాళ్లింటికి వెళ్లినా, వాళ్లు ఎక్కడికైనా వెళ్లినా దాని ప్రాణంకొరుక్కుతినేస్తాడు. వాళ్లముందు తనడాబు అంతా చూపిస్తాడు. లక్ష్మి టూత్ పేస్టు తే, లక్ష్మి మొహం కడుక్కునేందుకు నీళ్లు, స్నానానికి నీళ్లు తోడేవా? ఇదీవరస. పాపం యేం చేస్తుంది? ఎంతపనిలోవున్నా, అన్నీ వచ్చినట్టు అందిస్తుంది. ఉత్తప్పుడు మహారాజులా అన్నిపనులూ తనే చేసుకుంటాడు. ఎవరైనా చూస్తూంటే మట్టుకు తనపనులు తను చేసుకోవడానికి నామోషీ. బజారుకెళ్లి కూరలు తేవడానికి సిగ్గు. అందరికీ బంట్రోతులు వాళ్లు ఉండరుగా, అలాంటప్పుడు మనం చేసుకుంటే తప్పేం?

(62-వ పేజీ చూడండి)

★ గృహవైద్యం ★

దగ్గు

లవంగపుపొడి, ½ టేబిలు స్పూను, నిమ్మకాయ 1, నీళ్ళు 2 ఔన్సులు. 2ఔ. నీరుకు నిమ్మరసం, లవంగపుపొడి చేర్చి 8 గంటల కొకసారి పుచ్చుకోవాలి.

మొటిమలు

2ఔ. వేడిపాలకు నిమ్మరరసం చేర్చి బాగా రంగరించి అట్టే వుంచుకోవాలి. రోజూ రాత్రిపూట మొటిమలకు రుద్దుతుండాలి.

గజ్జి

2 నిమ్మకాయలను రసంతీసి కొబ్బర పాలతో చేర్చి బాగా కాచి రోజూ గజ్జి పైన రుద్దుతుండాలి.

డోకులు

నిమ్మకాయ ఒకచెక్క, నీరు 2ఔన్సులు, జీలకర్రపొడి, 1/4 టేబిలు స్పూను, ఏలకపొడి 1/4 టేబిలు స్పూను, నిమ్మకాయ రసర తీసి వీటన్నిటినీ కలిపి 6గంటల కొకసారి పుచ్చుకోవాలి.

తలనొప్పి

నిమ్మరసంతో శొంఠి పొడిని చేర్చి బాగా కలిపి నుదురుకు, కణతలకు రుద్దాలి.

కీళ్లనొప్పులు

నిమ్మరసం, కొబ్బర చమురు రంగరించి నొప్పివున్న కీళ్ళకు బాగా గట్టిగా రుద్దాలి.

కండ్లమంటలు

నిమ్మరసం కొబ్బరపాలు కలిపి తలకు మర్దన చేసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి.

చెవుపోటు

నువ్వులనూనె-1 ఔన్సు, తులసిఆకురసం-½ ఔన్సు, నిమ్మరసం-½ ఔన్సు. అన్నిటిని కలిపి కాచి పెట్టుకోవాలి. 3 రోజులకన్నా ఎక్కువ నిలువ వుండదు. రెండు మూడు బొట్లు చెవులో వాడటం మంచిది.

కడుపునొప్పి

ఉప్పు, ¼ తు, వేడినీరు—6ఔన్సులు, నిమ్మకాయ-1; వీటన్నిటిని కలిపి తాగాలి.

అజీర్తి


నీరు-3 ఔన్సులు, వాముపొడి-¼ టేబిలు స్పూను, జీలకర్రపొడి-½ టేబిలు స్పూను, చక్కెర (పంచదార) ¾ టేబిలుస్పూను నిమ్మకాయ ఒకచెక్క. నిమ్మకాయ రసంతీసి పైన చెప్పినవన్నీ కలిపి తాగాలి.

పండ్లనొప్పి

ఒక టీ స్పూను లవంగంపొడిని నిమ్మరసంలో రంగరించి పన్నుకు పట్టించాలి.

(గమనిక:—1 ఔన్సు = రెండు టేబిలు స్పూనులు.)


సేకరణ:- కుమారి బి. పద్మావతి,
(నెల్లూరు.)



నాగబంధము

కోరా సీతామహాలక్ష్మి
తెనాలి

ముగ్గులు



ఇటుకలు

కుమారి యన్. కరుణామాయి.
భీమడోలు

ఉత్తరాలు:

ఏరాయి అయితేనేం

కట్నాల సమస్య - పరిష్కారమార్గం గురించి ఎ. వైదేహిగారు రాసింది చదివాను. కుండ బండకు తగిలినా బండ కుండకి తగిలినా విరిగేది కుండే. నేటి సమాజంలో ఆడపిల్లల పరిస్థితి అలావుంది. కన్యాశుల్కం రోజులు విన్నాం; చదివాము. వరకట్నం రోజులు మనకళ్ళతో చూస్తున్నాము. ఆ కాలంలోను, ఈ కాలంలోను కష్టపడేది ఆడపిల్లలేగాని, మొగపిల్లలు కాదు పెద్దలు కాదు.

ఆడపిల్లలు తక్కువగావుండి కన్యాశుల్కం తీసుకొనేరోజుల్లో ఆడపిల్ల భవిష్యత్తు విచారించకుండా డబ్బుకి ఆశపడి ఎంత ముసలివాడికైనా అమ్మేసేవారు. ఈ వరశుల్కం రోజులలో కట్నాలు ఇచ్చుకోలేక ఆడపిల్లల్ని ఎవరికో ఒకళ్ళకి కట్నం లేకుండానే ముసలివాడికో, చదువులేని వాడికో కట్టేసి బరువు దింపుకుంటున్నారు. "ఏరాయిఅయితేనేం పళ్ళూడకొట్టేందుకు" అన్నట్లుగా కన్యాశుల్కం అయితేనేం; వరశుల్కం అయితేనేం ఆడపిల్లల గొంతుక కోయడానికి?

చిన్నప్పుడు మా అమ్మమ్మ, తన చిన్నప్పుడు జరిగిన సంగతి చెప్తూండేది. వాళ్లకి తెలిసిన ఒక శాస్త్రిలుగారికి ఏడుగురు ఆడపిల్లలుండేవారట. ఆయన ఆ ఏడుగురు ఆడపిల్లల్ని ముసలివాళ్ళకి కట్టేసి 10 ఎకరాలు సంపాదించాడట. అదిగాక ఆపిల్లలు మొగుళ్లు పోయి ఇంటికివస్తే వాళ్ళఆస్తికూడా కలుపుకున్నాడట. ఆడపిల్ల పుట్టితే 'లక్ష్మి' అని సంతోషించేవాడు; డబ్బు వస్తుందికదా అని. పైగా ఆయన భార్యని నలుగురిలోను "నీది బంగారపు కడుపే" అని మెచ్చుకునేవాడట.

ఇంచుమించుగా ఇప్పుడు మొగపిల్లల తల్లిదండ్రులుకూడా కట్నాలు తీసుకుని అలాగే సంపాదిస్తున్నారు.

పూర్వం కొన్ని సాంప్రదాయిక కుటుంబాలలో కన్యని దానం తీసుకునేటప్పుడు ఊరికినే తీసుకోకూడదని పాడిఆవునిచ్చి కన్యని తెచ్చుకునేవారు. క్షత్రియకుటుంబాలలో 'వీరశుల్కం' అని శ్రీరాముడు సీతని (విల్లువిరచి) తెచ్చుకున్నట్లుగా చేసేవారు.

అలాగే కన్యతల్లిదండ్రులు కన్యను దానం ఇచ్చేటప్పుడు దక్షిణలేకుండా ఊరికనే ఇవ్వకూడదనే ఉద్దేశంతో వారికి తోచిన దక్షిణ ఇస్తూండేవారు. ఇదే రానురాను, కన్యాశుల్కంగాని వరశుల్కంగాని ఇస్తేనే తప్ప ఆడపిల్లకి పెళ్ళిఅవని పరిస్థితికి దిగజారిపోయింది.

ఆడపిల్లలు తక్కువైతే కట్నాల సమస్య తీరేది కాదు. కాబట్టి, తీరేది ఏమిటంటే పెద్దలు మనస్సులు మార్చుకుని సృష్టిలో మొగపిల్లలు ఎంత అవసరమో ఆడపిల్లలు కూడా అంతే అవసరమనీ చెట్టునుంచి కోసుకొచ్చినవారు కాదని గ్రహించిననాడే ఈ సమస్య తీరుతుంది. ఆడపిల్లల తల్లిదండ్రులుకూడా గొంతెమ్మ కోర్కెలు కోరకుండా తమ తాహతునిబట్టి అల్లుని తెచ్చుకుంటే ఈ సమస్య కొంతవరకు తీరవచ్చునేమో.

బొమ్మకంటి అన్నపూర్ణ, లక్ష్మి.

* * *

మళ్లీ కన్యాశుల్కం?

కొన్నాళ్లపాటు ఆడపిల్లలు తక్కువమంది పుట్టారనుకొందాం. అప్పుడీ సమస్య ఎలా పరిష్కరింపబడుతుంది. అసలిది పుట్టబోయే ఆడపిల్లల సమస్యకాదుగదా! ఎక్కువమంది మగపిల్లలు ఇప్పుడు పుట్టినంతమాత్రాన ఇప్పటి "కుమారిలు" అంతా "శ్రీమతు"లవరుగదా! కట్నాలులేకుండ చేసుకుంటామని ఇప్పటి యువకులు ముందుకొచ్చేవరకు ఈ సమస్య పరిష్కారముకాదు. కాకపోతే ఆడపిల్లల తండ్రులంతా కట్నాలివ్వమని ఒక్కమాటమీద నిలబడాలి. ఎవ్వరు కట్నమివ్వకుంటె పుచ్చుకొనేవాళ్లు ఏంచేస్తారు? అప్పుడు కట్నాలులేకుండా పెళ్లిళ్లు జరిగిపోతాయి.

అంతేగాని "ఆడపిల్లలు పుట్టకుండావుంటే" అనుకొంటే ఏమీ లాభం ఉండదు. ఒకవేళ వారన్నట్లు ఆడపిల్లలు తక్కువగా పుడితే, ఎప్పుడో అణిగిమణిగియున్న "కన్యాశుల్క పిశాచము" లేచి కూర్చుంటుంది. అప్పుడైనా మనకే (ఆడవాళ్లు) గదా చిక్కు.

కోకా సావిత్రి, మద్రాసు.

* * *

శుభాకాంక్షలు

మూడుకోట్లమంది తెలుగువాళ్లమూ ఒక్క కుటుంబంగా ఈసారి సంవత్సరాది పండుగ చేసుకుంటున్నాము. మన కిది విశాలాంధ్ర వచ్చాక వచ్చిన తొలి తెలుగు ఉగాది ఇదేగదా. ఈసారి వేపపువ్వు పచ్చడి ప్రతిసారికన్నా రుచిగా ఉంటుంది. తోటి సోదర సోదరీమణు లందరికీ మా శుభాకాంక్షలు.

సి. వి. విజయలక్ష్మి.
సి. వి. జయలక్ష్మి.
(మద్రాసు)

* * *

తారతమ్యాలతోపాటే

ఆర్థిక స్తోమతు, హోదా మొదలగు వాటన్నిటా సంఘ జీవితములో విపరీతమైన వ్యత్యాసములు వున్నంతకాలము కట్నాలు తప్పవు. సంఘములో అన్నిపనులకు సమాన హోదా ఏర్పడాలి. సంఘానికి ఒక జిల్లాకలెక్టరూ సేవ చేస్తున్నాడు. ఒక చెప్పులుకుట్టేవాడూ సేవచేస్తున్నాడు. కాని జీవన ప్రమాణములు విపరీతవ్యత్యాసము. ఈ వ్యత్యాసములు తగ్గినకొలది వరకట్న సమస్య తీవ్రత తగ్గుతుంది. పెరిగినకొలది పెరుగుతుంది. పది సంవత్సరములుగా మన ప్రభుత్వములో ఈ వ్యత్యాసము విపరీతముగా పెరిగినది. వరకట్న సమస్యకూడా పెరిగింది.

ఎ. నాగుబాయమ్మ, గుంటూరు.

* * *

నిష్కారణ రణం

మా పొరుగున ఒకావిడ వుండేది. మిమ్మల్ని నిత్యము ఏదో వంకన సాధిస్తూ వుండేది. మేము పెట్టినముష్టివాడికి ఆవిడముష్టి పెట్టేదికాదు. పైగా అనేదికదా "మేము నెలజీతగాళ్లము ముష్టి పెట్టేందుకు మాకేమీ పొలాలు లేవ" నేది. మేమేదేనా పనిలో వుండి ఎవరికేనా ముష్టిపెట్టకపోతే వాణ్ని పనికట్టుకు పిల్చి యింత అన్నం పెట్టి వాడితో అనేది: "మాకు బీదవాళ్ళనిచూస్తే ఎంతో జాలి నాయనా. భగవంతుడు మాకు చాలు

గకరాల పాలమేనా యిచ్చాడుకాదు రోజూ శేరుబియ్యం వండిపెట్టడాన్ని" అనేది. ఇదేమిటమ్మా ఇల్లా అన్నావంటె మీమాట ఏమన్నా అన్నానా అనేది. ఏ సినిమాకేనా కలిసి వెడదాము వస్తారా అంటె "వియ్యానికేనా? కయ్యానికేనా సమవుజ్జీలు వుండాలి. మీరు గొప్పవాళ్లు మేము రాము" అనేది.

వాళ్ళెల్లాగు రారుకదా అని మేము వెళ్ళిపోతే "ఇరుగూ పొరుగుకదా చెప్పేనా చెప్పారుకాదు గర్వ"మనేది. ఇదే వరస రోజూ ఎందుకో అందుకు సాధిస్తూసుండేది. ఇన్నీ వింటూ మమ్మల్ని కాదన్నట్టు వూరుకునేవాళ్ళం గెలవలేక.

ఇంతా చేస్తే మాకున్న భూవసతి కొద్ది. ఏదో చన్నీళ్ళకు వేన్నీళ్లతోడుగా వుంటము తప్ప ఈ కరువుకాలంలో దాంతోనే గడుస్తుందా, అల్లా అయినప్పటికి ఓచుట్టంకాదు పక్కంకాదు. ఇచ్చి పుచ్చుకునేందుకు అక్కడ కలవాళ్ళయినా ఒకళ్లకొకళ్లు పెట్టేదేమీ లేదు. ఏదో యిరుగు పొరుగువున్నవాళ్లు స్నేహంగా మాటమంచితనంతో గడుపుకుపోయేందుకు ఈ అకారణ వైరమెందుకు చెప్పండి! ఇది పురుషులలోకన్నా స్త్రీలలోనే ఎక్కువనుకుంటా.

బి. ఎస్. లక్ష్మి, (కాకినాడ)

గాలిదుమారం

ఈమధ్య వనితాలోకంలో అత్తలపై ఒక గాలిదుమారం లేచింది. ప్రతిఇంట్లోను, అత్తదే తప్పంటూ, కోడళ్ళంతా నంగనాచిలని వ్రాస్తున్నారు కొందరు. మొన్న 6-3-57 పత్రికలో టి. నిర్మల (కసుకుర్రు) వ్రాస్తు, ఇలాంటివాళ్లను మార్చటానికుపాయమంటూ, వేరే ఉండవలెనని సలహా ఇచ్చారు. సమిష్టి కుటుంబంలో ఉన్నవారికిదేనా! నిర్మలగారి సలహా? తప్పులెవరు చేయరు? మానవజన్మ ఎత్తినతర్వాత తప్పంటూ ఉండకపోదు. కోడలు ఎక్కడికైనా వెళ్ళినప్పుడుకూడ, అత్తగారు "పమిట తిన్నగా వేసుకో"అని హెచ్చరించడం గొప్పతప్పుగా వ్రాశారు నిర్మలగారు. ఇవాళా, రేపు చాలమంది పిల్లలు, మగవాళ్లున్నారనే జ్ఞానమైనా లేకుండా, చిత్రం వచ్చినట్టు ఉంటున్నారు. అలాంటి కోడలికి చెప్పడానికూడా హక్కు లేదా అత్తకు?

అయినా ఈ కాలంలోని ఆడపిల్లలందరికీ, అత్తగారంటే కొంచెంకూడా భయం లేకుండాపోయింది. కొత్తగా కాపరానికొచ్చి, అత్తఅంటే ఎవరో పనిమనిషిలా చూసేవారు చాలమంది ఉన్నారు. అంతెందుకు, కొత్తగా పెళ్లియివచ్చిన మా స్వంత వదిన, మా అమ్మను "అత్తయ్య"అని పిలవదు. అసలెవరినీ వరసలెట్టిపిలవదు. ఏమంటే నా కలవాటు లేదంటుంది నిర్లక్ష్యంగా. అలాగునేనా ఉండవలసింది, సమిష్టి కుటుంబంలో?



"ఆంధ్రప్రదేశ్" అవతరణ తరువాత వచ్చిన ప్రథమ తెలుగు సంవత్సరాది సందర్భంలో తోటిపఠితలకు నా అభినందనలు. జి.ఎం. శ్యామల (ఎమ్మిగనూరు)

ఈవిడేకాదు, చాలమంది ఉన్నారలా. పెండ్లయిన మరుచటిదినంనుంచి భర్తను వేధిస్తూ ఉంటారు. "ఏమండీ, మనం ఎంచక్కా వేరే కాపురముందాం? అని. అంటే నూనూగు మీసాలతో నవయవ్వనంలోనున్న భర్త కావాలి. కాని అంతటి వరకు 25 సంవత్సరాలు, అతగాణ్ణి పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి అంతటివాణ్ణిచేసిన భర్తగారి తల్లి అక్కర్లేదు. ఏమైనా అంటే వేరే కాపురం అంటారు.

తన భర్త ఎప్పుడూ తన మాటమీదే నడవాలన్న ఆశ ప్రతి ఆడవాళ్ళకూ ఉంటుంది. కాని అలా కొడుకు భార్య చెప్పుచేతల్లోనే ఉంటే ఆ కన్నతల్లి కడుపెంత క్షోభిస్తుందో కొంచెం ఆలోచించాలి. ఈ ఊరోనే ఒకమ్మాయి ఉంది. ఆవిడిగారికి అత్తలేని సంబంధం కావాలట. పాపం ఆ తల్లిదండ్రులు తెగవెతుకుతున్నారు! అసలు అత్తఅంటే ఎందుకో అంత భయం? మన మీద ఏమీ తప్పులేనప్పుడు, అత్తగాదు బ్రహ్మదేముడే వున్నా పరవాలేదు. అత్త ఒకవేళ కోపంగాఉన్నా, కోడలు మెల్లిగా సద్దుకుంటే ఏ గొడవా ఉండదు.

కాని ఒక్క విషయం. తనకు భర్త దైవంతో సమానము, అటువంటి భర్తకు దైవంకంటెకూడా గొప్పది తల్లి. అటువంటి ఆవిడకు ఎంత భక్తిశ్రద్ధలతో సేవ చేయాలో ప్రతి స్త్రీ ఊహించుకుంటే అసలు ఎన్ని కష్టాలు పెట్టినా అత్తమీద కోపమే ఉండదు. అత్తకు ఎంతమర్యాద ఇవ్వాలో, అంత ఇచ్చి, ఆమె అభిరుచులకు అనుగుణంగా నడుచుకుంటే, అప్పుడే ఆవిడకు తన కోడలి మీద కొండంత అభిమానం కలుగుతుంది.

శ్రీరామదాసు సుగుణ.
బిలాస్‌పూర్, (మధ్యప్రదేశ్)

నయాపైసాల్లో కూరల బేరం

ఒక సుబ్బలక్ష్మి కూరలమ్మిని పిలిచి బేరమాడింది. చివరికి వీసె 0-6-6 చేసి, అరవీసెడు వంకాయలు, వీసె 0-14-0 చేసి అరవీసెడు బంగాళదుంపలూ, ఒక కానీ కరేపాకూ, ఒక కానీ కొత్తిమేరా, అర్ధణాపెట్టి పచ్చిమిరపకాయలు కొన్నది. తీరా డబ్బివ్వబోయేసరికి, ఇంట్లో ఆరణాలూ ఇంకా చాలా నయాపైసాలూ ఉన్నాయి. ఈ నయాపైసాల గొడవేమిటో తెలీదు గనుక కూరలమ్మికి ఎంతివ్వాలో ఆమెకు తోచలేదు. ఇంతలో అయిదోక్లాసు చదువుతున్న సుబ్బలక్ష్మి తమ్ముడు సూర్యనారాయణ ఠకీమని చెప్పేశాడు. వాడెప్పుడూ లెక్కల్లో ఫస్టు గనక సుబ్బలక్ష్మి వాడిమాట నమ్మి కూరలమ్మికి డబ్బిచ్చేసింది. ఎంత ఇచ్చిందో చెప్పండి.

జవాబు :—

చేతులో ఆరణాలున్నాయి గనక ఆరణాలూ యిచ్చెయ్యాలి. మిగతా అయిదణాల కానీకి ఎన్ని నయాపైసలు? పావలాకి పాతిక. అణాకి ఆరు. కానీకి రెండు. కలిపితే 33 కనక 33 నయాపైసా లివ్వాలి.

★ అపర బుద్ధి ★

(16-వ పేజీ తరువాయి)

"మా అమ్మకు ఊపిరి తిత్తుల వ్యాధివుంది. విశ్రాంతికోసం ఆమెను శానిటోరియంలో చేర్చారు. అక్కడ మంచి చికిత్స జరుగుతుందని మా నాన్నగారి అభిప్రాయం. మొదట్లో ఆయన వారానికి ఒకసారివెళ్ళి మా అమ్మనుచూసివచ్చేవారు. తరువాత వారానికి రెండుపర్యాయములు వెళ్ళేవారు. శానిటోరియంలో ఆమె మూడునెలలుమాత్రం వుంది. అందులో పనిచేస్తున్న హెడ్‌నర్సు మా అమ్మతో చాలాస్నేహంగా వుండేది. ఆమె మా అమ్మకు కావలసిన అన్ని సౌకర్యాలు అడక్కుండానే ఏర్పాటుచేసేది. ఎంతో స్నేహంగా వుండేది. మా అమ్మకు వ్యాధి ఎక్కువైంది. నెలరోజులలో తిరిగి రావాలనుకుని వెళ్ళిన మా అమ్మ శానిటోరియంలో మూడు నెలలు వుంది. ఇంట్లో వ్యాధికి కావలసిన సౌకర్యాలు, చికిత్స జరగదని చెప్పి, మా నాన్నగారు ఆమెను అక్కడేవుండమన్నారు. చివరి నెలలో ఆయన వారానికి రెండుసార్లు వెళ్ళేవారు. నేనుమాత్రం ఆయనతోకలిసి అప్పుడపుడు వెళ్ళేదాన్ని. అక్కడపనిచేస్తున్న హెడ్‌నర్సు నాతోకూడా చాలా ఆప్యాయంగావుండేది. ఆమె నాకు అల్లికరుమాలు ఒకటి ఇచ్చింది. ఆమె నాకు ఎంతోదగ్గరగా వుండాలని ప్రయత్నించేది. ఆమె నాకు దగ్గిరౌతున్న కొద్దీ నాకు చెప్పరాని భయంకలిగేది. మా అమ్మ అకస్మాత్తుగా చనిపోయింది. ఆ కబురు అందగానే, నేనుకూడా శానిటోరియంకి వెళ్ళాను. చాలామంది అక్కడ నన్ను ఓదార్చారు. అక్కడ నేను ఎరిగున్న ఒకరోగివుంది. ఆయుర్దాయంనిండిచావటానికంటే, అక్కడ పనిచేసేవాళ్ళ నిర్లక్ష్యంవల్లకూడా చాలమంది చచ్చిపోతారని ఆమె నాతో చెప్పింది. అప్పటినుంచీ మా అమ్మకు వ్యాధి అకస్మాత్తుగా తిరగపెట్టటానికి ఏదో బలీయమైన కారణంవుంటుందని నాకు అనుమానంకలిగింది. ఆ అనుమానమే క్రమేపీ ఒక బలీయమైన భయంగా మారింది. అక్కడ పనిచేసే హెడ్‌నర్సు కోమలం, తరువాత కొన్నాళ్ళకి మా ఇంటికి అధికారిణి అయింది. ఆమె మా ఇంటికి వచ్చినప్పటినుంచీ, నాకు భయం ఇంకా అధికమైంది. ఏదో అనుమానం నన్ను వీపుమీద చరిచినట్టు భయపెట్టేది. ఆమె నడవడి, స్వభావం, చూసి మా నాన్నగారు చాలా సంతోషించారు. ఆమె మా ఇంట్లో కాలుపెట్టటంతో ఇంటికి కళా, కాంతీ వచ్చినవని ఆయన అనేవారు."

"ఇప్పుడు నన్ను ఏంచేయమంటావు?"

"ఏమీ చేయవద్దు. మీరు వినాలని నా కోరిక."

"నీవు చెప్పేవిషయం సామాన్యమైనది కాదు. దీన్ని గురించి ఆలోచించాలి. నీ మనసులో భావం నాకు అర్థమౌతూంది. ఇదవరకు ఈ విషయం ఎవరితోనైనా చెప్పావా?"

"లేదు."

"ఈ విషయం అంటే మీ తల్లిని గురించి అన్నమాట."

"ఊహు!"

"నీకు కలుగుతూన్న సందేహాలను కోమలం ఎప్పుడైనా గుర్తించిందా?"

"లేదు."

"ఇలాంటి విషయాలు సవతితల్లితో ప్రస్తావించటం ప్రమాదం."

"ఔను! ఎవరితోను నా అనుమానాలు, భయాలు చెప్పకోలేదు."

"నీ పరిస్థితిలో వుంటే నేనూ అలాగే చేస్తాను."

"నేను ఇప్పుడు ఇంట్లో ఆమెతో వుండటంలేదు. ఇంటికి వెళ్ళటం మానేశాను. నా పెట్టెలు అన్నీ హాస్టలుకి తెచ్చుకున్నాను. నా పేర ప్రత్యేకంగా కొంత పొలం రాశారు మా నాన్నగారు. హాస్టలులోనుంచి బయిటికి రాగానే వేరే చిన్నగదులు అద్దెకు తీసుకుని, నాకు వచ్చేడబ్బుతో ఒంటరిగా వుండాలనుకుంటున్నాను."

"నిన్ను చూడటానికి నేను రావచ్చునా?"

"రావటానికి ఎప్పుడు సమయమో మీకు తెలియపరుస్తాను. మీ టెలిఫోను నెంబరు చెప్పండి."

కమలాక్షి నాకు చెప్పిన విషయాలు పాండ్యతో చెప్పవచ్చునా చెప్పకూడదా అని మధ్యాహ్నమంతా నాలో నేనే తర్కించుకున్నాను. చివరికి అతడికి చెప్పాలనుకున్నాను. ఆత్మరక్షణకు చెప్పటం అవసరం. కాని కోర్టులో ఆమె సాక్ష్యానికి చిల్లిగవ్వకు వున్న విలువైనా వుండదు. ప్రస్తుత విషయంలో ప్రత్యక్ష సంబంధం వున్నవాళ్ళనీ, దీనికి ఉపయోగకరమైన ఆధారాలనీ పరీక్షించి విచారణ జరుపుతారు. అనుమానాన్ని సాక్ష్యంగా తీసుకోవటానికి ఆధారంగా పరిగణించరు. అన్ని విషయములనూ ఒకదాని తరువాత ఒకటిగా విచారణచేస్తారు. కేవలం ఒక అనుమానాన్ని ఆధారంగా తీసుకొని విషయ నిర్ణయానికి ప్రయత్నించిన సంఘటన రెండు మూడు సంవత్సరాల క్రితం జరిగింది. కాని కమలాక్షి నాతో చెప్పిన సంగతిని గురించి నాకు తెలుసునని పాండ్య గ్రహిస్తే, చిక్కు వస్తుంది. ఈ విషయం నేను ఆయనకు తెలియపరచలేదని అసంతృప్తి బయలుదేరుతుంది. నా అంతట నేనే చెప్పటానికి మనస్కరించటంలేదు. దీన్ని ఎవరితోనూ చెప్పవద్దని కమలాక్షి నన్ను కోరింది. నేను అంగీకరించాను.

*　　*　　*

సాయంత్రం నాలుగుగంటలకు పాండ్య నా ఆఫీసుగదిలోకి వచ్చాడు. ఆయన లోపలికిరాగానే, బయటితలుపు వేశాడు.

"కృష్ణమోహన్! అతణ్ణి తెలుసుకున్నాం!" అన్నాడు.

"ఎవరిని?" అని ప్రశ్నించాను.

"డాక్టరు చంద్రశేఖరు కేసులో ముద్దాయిని."

"ఏమిటి?"

"అతడు ప్రతిరోజూ వస్తున్నాడు. వారంలో అయిదు రాత్రులు——"

"ఎవరతడు?"

"ఎవరైతే ఏం? అతడు ఒకవ్యక్తి. నీకు త్వరలోనే తెలుస్తుంది."

దీపాలు పెట్టగానే బయటికివెళ్ళి, మళ్ళీ ఏడుగంటలు దాటినతరువాత ఆఫీసుకు వచ్చాను. అప్పుడు ఆఫీసులో ఎవరూ లేరు. పాండ్యగదిలోకి వెళ్ళాను. అతడి డ్రాయరు తెరవటానికి ప్రయత్నం చేశాను. అది తాళం వేసివుంది. కాగితాలఫైళ్ళు పెట్టుకునే ఉక్కుబీరువాను తెరవాలని చూశాను. దానికికూడా తాళాలువేసి ఉన్నవి. నాదగ్గర వున్న తాళం చెవులతో బీరువాను తెరవటానికి ప్రయత్నించాను. ఉపయోగం లేకపోయింది. ఆ ప్రయత్నం మానుకున్నాను రేకుతోచేసిన సొరుగులో మూసివున్న డిక్టేషను మిషన్ కనపడింది. దానిపైన ఉన్న మూత తెరిచాను. టైపుచేసిన ఉత్తరాల నకళ్ళు

కొన్ని అక్కడే పడేసి ఉన్నవి. వాటిలో ఒక ఉత్తరం ఇలా రాసివుంది.

మేనేజింగు డైరెక్టరు:- కృష్ణమోహన్‌ను గురించి (రహస్యం): మన కంపెనీ ఏజంటు కృష్ణమోహన్ చర్యలను డా॥ చంద్రశేఖర్ కేసు విషయంలో పరిశీలిస్తూ వుండాలని మీరు నాకు తెలిపారు. నేను మీ అభిప్రాయంతో ఏకీభవించటంలేదు. మామూలుగా ఇటువంటి అన్ని కేసులలోవలె, ఈ కేసులో కూడా ఏజంటు చర్యలను విధిగా పోలీసులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుంటారు. కృష్ణమోహన్‌ను గురించి నేను అవసరమైన చర్యలు తిసుకోవటంలో అశ్రద్ధ చేయలేదు. ఆయన ఇచ్చిన వాజ్మూలాలన్నీ, మనదగ్గర వున్న రికార్డులతో ఏకీభవిస్తున్నవి. వీటిలో పరస్పర వైరుధ్యంగాని, అనుమానానికి కారణంగాని ఎక్కడా కనపడటంలేదు. నేరం జరిగిన నాటిరాత్రి అతడి కార్యక్రమాన్ని గురించి అతనికి తెలియకుండా విచారించి తెలుసుకున్నాను. అతడికి ఈ విషయంలో ఏలాటి సంబంధంలేదనీ నా అభిప్రాయం. అతడి ప్రవర్తనమీద మనం రహస్యంగా పరిశోధన ప్రారంభిస్తే, అనుభవశాలి అయిన కృష్ణమోహన్ తేలికగా ఈ విషయం తెలుసుకోగలడు. ఇందువల్ల మనం అతడి హృదయ పూర్వకమైన సహకారాన్ని పోగొట్టుకొన్నవాళ్ళ మౌతాము. లోగడ జరిగిన మోసపుకేసులలో అతడి ప్రవర్తన చాలా నిర్దుష్టంగాను, ప్రశంసనీయంగాను వుంది. మీ అభిప్రాయాన్ని మార్చుకుని, అతడి విషయంలో తీసుకోదలచిన చర్యను విరమించాలని నేను సిఫారసుచేస్తున్నాను.

ఇట్లు మీవిధేయుడు,
పాండ్య.

ఈవృత్తాంతం నాకు ఆశ్చర్యం కలిగించింది. రెండో వుత్తరం సి. ఐ. డి. పోలీసు శాఖవారి రిపోర్టునకలు. అందులో ఇలా వుంది:

విచారణచేసిన అధికారుల వాజ్మూలము: డాక్టరు చంద్రశేఖర్ శేఖర్ కూతురు కమలాక్షి ఇంట్లోనుంచి, 8 నెంబరు పార్కురోడ్డుమీద రెండు గదులు అద్దెకు తీసుకొని అక్కడ వుంటూంది.

కోమలం సాధారణంగా ఇంట్లో నుంచి బయటికి వెళ్ళటం లేదు. ఒకసారి మాత్రం ఆమె మందులషాపుకి వెళ్ళి టెలిఫోనుచేసింది.

ఒకనాటి రాత్రి తొమ్మిది గంటల వేళ ఇరవై ఆరు సంవత్సరాల వయస్సుగల యువకుడు కోమలం ఇంటికి వెళ్ళాడు. పొడగరి; చామన చాయగా వుంటాడు. అటు తరువాత అతడు ఆమె ఇంటికి వరుసగా అయిదు రోజులు రాత్రివేళ వెళ్ళాడు. విచారణవల్ల అతడిపేరు మధుసూధన్ అని, విశ్వవిద్యాలయంలో డాక్టరేటు డిగ్రీకోసం పరిశోధన చేస్తున్నాడనీ తెలిసింది."

* * *

కమలాక్షి నాకోసం ఆఫీసుకి వస్తుందేమోనని భయం వేసింది. ఆమె రావటం నాకు ఇష్టంలేదు. ఆమె చర్యలను పోలీసులు పరిశీలించటంలేదని నాకు తెలిసింది. ఒకనాడు రాత్రి ఆమె గదికివెళ్ళి, ఎవరూ ఎరగనిచోట ఊరి చివరవున్న ఒక హోటల్‌కు ఆమెను నాతో భోజనానికి తీసుకొని వెళ్లాను. మేము ఇద్దరం భోజనం చేసేటప్పుడు, ఆమె ఎక్కడ చదువుకున్నదీ, కాలేజీలో ఎందుకు చదువు కోందీ మొదలైన విషయాలమీద ఆమెతో ప్రసంగించాను. మొదటిలో ఇద్దరికీ కొంచం బెరుకుగా వున్నప్పటికీ, క్రమేణా ఒకరినొకరం విశ్వసించవచ్చునని అభిప్రాయం కలిగింది. గతసారి ఆమె నాతో చెప్పిన విషయాలను నేను ప్రస్తావించలేదు. భోజనాలు పూర్తి అయిన తరువాత, సమీపంలోనేవున్న సముద్రం వొడ్డుకివెళ్ళి ఇసుకలో కూచున్నాము. పిండారబోసినట్లుగావుంది వెన్నెల. సముద్ర కెరటాలు వండి చేపలవలె పైకి ఎగురుతున్నవి. నేనే మొదట సంభాషణ ప్రారంభించాను.

"నీవు నాతో చెప్పిన విషయాన్ని ఆలోచించాను."

"ఇంకా కొంత చెప్పాలి. చెప్పనా?" అంది.

"ఊ! చెప్పు. సందేహించవలసిన అగత్యం లేదు."

★ అపరబుద్ధి ★

"నా అనుమానం క్రమేణా ఒక పెద్ద తుపాను లేవదీసింది. కాని ఎవరికీ నా హృదయంలోని ఆవేదనను చెప్పలేదు. చాలా ఆందోళన పడ్డాను. చివరికి నా అభిప్రాయం తప్పు అని తోచింది. ఒకరిని గాఢంగా ప్రేమించటం చాలా తేలికే కాని, అలా ప్రేమించినవాళ్ళు అకస్మాత్తుగా మనకు దూరమైపోతే, దానికి ఇంకొకరిని నిందించటం తప్పు. మనకు ఇష్టంలేని వాళ్లను నిందించటం ముఖ్యంగా పొరపాటు. కోమలం అంటే నాకు ఇష్టంలేదు. బహుశా దీనికి అసూయ కారణం కావచ్చు. మా అమ్మమీదే నా ప్రాణాలన్నీ వుంచుకున్నాను. ఇందులో ప్రత్యేకత ఏమీ లేదు. ఎవరితల్లిని వాళ్ళు ప్రేమించటంలో ఆశ్చర్యమేముంటుంది? కోమలం, మా నాన్నగారిని పెళ్ళి చేసుకుంది. మా ఇంటికి అధికారిణి అయింది. ఇది ఎలా జరిగిందో నాకు తెలియదు. జరుగకూడనిపని జరిగిందని మాత్రం నేను అనుకునేదాన్ని. అప్పుడే నాకు అనుమానం కలిగింది. మా అమ్మ మరణించటం, కోమలం పెళ్ళి చేసుకోటం రెంటికీ ఏదో సంబంధం వుంటుందని నా అనుమానం. ఇప్పుడు జరిగిన ఈ సంఘటనతో నా అనుమానం ఇంకా బలపడింది. ఈ విషయాన్ని గురించి ఆలోచించటానికి నా హృదయం కంపిస్తూంది. నా అనుమానం విషయం మీకు చెప్పకుండావుంటే బాగుండేది. మీరు ఈ విషయం మరచిపొండి."

"ఇది నాకూ ఒక విధంగా సంతోషమే," అన్నాను.

"నేను ఏదో మహాచెడ్డ అనుమానంతో ఉన్నాననుకుంటున్నారు."

"లేదు. నీవు చెప్పిన విషయాన్ని నేను కూడా దీర్ఘంగా ఆలోచించాను. నీ అనుమానం యదార్థమే అయితే, మా కంపెనీకి చాలా సహాయకారి అవుతుంది. తరువాత చెప్పటానికి ఏముంది.? ఇది కేవలం నీ అనుమానం. నీవు చెప్పాలనుకున్నది ఇంతేనా?"

"నేను చెప్పానుకాదూ? ఆ అనుమానమైనా ఇప్పుడు లేదని."

"నీవు పోలీసులకు ఏం చెప్పినప్పటికీ, అది వాళ్ల రిపోర్టులోకి ఎక్కుతుంది. మీఅమ్మ మరణాన్ని గురించి, మీతండ్రి మరణాన్ని గురించి వాళ్ళకి తెలిసినదానికంటే నీవు అధికంగా చెప్పేదేమీ లేదు. అలాంటప్పుడు చెప్పటమెందుకు?"

"ఔను. నాకు తెలుసు."

"నీపరిస్థితులలో వుంటే నేను ఏమీ చెయ్యను."

"మీరు నాతో ఏకీభవిస్తున్నారు. ఈవిషయంలో నేను చెప్పవలసిందేమీ లేదు."

అంతటితో అది అక్కడ పూర్తిఅయింది. మధుసూదన్‌విషయం నేను తెలుసుకోవాలి. అతణ్ణి గురించి నేను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నాననే విషయంకూడా ఆమెకు తెలియకూడదు.

"అయితే మధుసూదన్‌కు, నీకూ ఎందుకు అభిప్రాయభేదం వచ్చింది?"

"నేను చెప్పలేదూ? అతడి విషయం మాట్లాడటానికి నాకు ఇష్టంలేదని."

"నీవు మొదట అతడితో ఎలా పరిచయం చేసుకున్నావు?"

"కోమలం పరిచయంచేసింది."

"ఎవరూ? కోమలమే?"

"మధుసూదన్ తండ్రి శానిటోరియంలో పెద్దడాక్టరు. కోమలం అక్కడ నర్సుగా పని చేసిందని ఇదివరకే చెప్పాను. ఒకసారి అతడు ఆమె వద్దకు వచ్చి, వాళ్ళు స్థాపించబోయే సంఘంలో సభ్యురాలిగా చేరమని అడిగాడు. క్రమేణా నాతో అతడికి పరిచయం ఏర్పడింది. అప్పటినుంచి అతడు మా ఇంటికి రావటం మానేశాడు. మేము ఇద్దరం బయటే కలుసుకునేవాళ్లము. కోమలం ఈ విషయం గ్రహించింది. అతణ్ణి గురించి మా నాన్నగారితో ఆమె అనేక కథలు కల్పించి చెప్పింది. ఆయన ఆమె మాటలు నమ్మాడు. నేను అతణ్ణి కలుసుకోకూడదని నన్ను మందలించి, శాసించాడు. ఆమె ఇలా చెప్పడానికికూడా దీనివెనుక ఒక గూఢమైన అర్థం వుంది. నాకు తెలుసు. కాని ఆ విషయం నాకు అప్పటి......" చెపుతూ కమలాక్షి ఆగిపోయింది.

"చెప్పటానికి సందేహించవద్దు."

"నాతండ్రి మరణించేవరకు తెలియలేదు. అప్పటినుంచి అకస్మాత్తుగా అతడు నన్ను కలుసుకోవటం మానేశాడు. ఎప్పుడూ నాకోసం కలలుకంటూవుండే మధుసూదన్‌కు నామీద విరక్తి కలిగింది!"

"తరువాత?"

"అతడు ఇప్పుడు కోమలంచుట్టూ తిరుగుతున్నాడు!"

"నా అభిప్రాయం తెలిసిందా? అది కూడా నా నోటిగుండా వినాలని మీకు కుతూహలంగా వుందా? వాళ్ళిద్దరే చేశారనుకుంటున్నాను. అతడు నాదగ్గిరికి రావటం మరొక విషయాన్ని లోకందృష్టినుంచి కప్పిపుచ్చటానికేనని నాకు ఇప్పుడు తెలిసింది! వాళ్ళు పట్టుబడితే..."

"ఆ రాత్రి అతడు నీతో ఉన్నాడనుకున్నాను."

"మొదట అనుకున్నప్రకారం వుండాలిసిందే. ఆరాత్రి విశ్వవిద్యాలయంలో నాట్యప్రదర్శనం వుంది. నేను అక్కడికి వెళ్లాను. అతడు నన్ను అక్కడ కలుసుకుంటానని చెప్పాడు. అతడికి సుస్తీ చేసిందనీ, రావటం లేదనీ, కబురుచేశాడు. అక్కడనుంచి నేను బస్సుమీద బయలుదేరి, సినిమాకి వెళ్ళిచూసి వచ్చాను. ఈ సంగతి ఎవరికీ చెప్పలేదు,"

"సుస్తీ అంటే ఏమిటని నీఅభిప్రాయం?"


"అతడికి జలుబు చేసింది. నాకు తెలుసు. దయచేసి ఈ విషయం నాచేత ఎక్కువగా వాగించవద్దు. నామనస్సును నిర్మలంగా వుంచుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను. అనుమానాలు పెట్టుకోకూడదని అనుకుంటున్నాను. అతడు కోమలాన్ని మాడాలనుకుంటే, దీనిలో నా ప్రసక్తి ఏముంది? అలా సమాధానపడినప్పటికీ, నాకు బాధకలగక తప్పటంలేదు. ఈ విషయం మనం ఇంకా మాట్లాడవద్దు."

* * *

డబ్బుకోసం, ఒక స్త్రీకోసం, చీకటిమరుగున ఒక పురుషుణ్ణి హత్యచేశాను. నాకు డబ్బురాలేదు! స్త్రీ లభించలేదు!! ఆ స్త్రీ నిర్దాక్షిణ్య హృదయంగల హంతకురాలు. తన పనిని నెరవేర్చుకోవటానికి ఆమె నన్ను ఒక సాధనంగా ఉపయోగించుకున్నది! ఇంకొకరి స్నేహం, ప్రేమాపాందాలనే కాంక్షతో తన మార్గంలో వున్న అవరోధాన్ని తొలగించుకోటానికి ఆమె నన్ను వినియోగించుకుంది. నా జీవితాన్ని గాలిపటంలా ఆకాశంలోకి ఎగరవేసింది! పరిస్థితిని సింహావలోకనం చేసుకుంటే, నాకే ఆశ్చర్యం కలిగింది. పాపం కమలాక్షి కపటం ఎరగని అమాయకురాలు, నేను ఆమెకు ఎంతఘోరమైన అపకారంచేశాను. ఆమె వయస్సుకు నావయస్సుకు తేడా పదునాలుగుసంవత్సరాలని ఊహించుకుని నాలో నేనే తృప్తిపడ్డాను. అకస్మాత్తుగా లేచి కూచుని దీపం స్విచ్ వేశాను. ఎందుకు దీపకాంతి కావాలనుకున్నానో నాకు తెలుసు!

నేను ఆమెను ప్రేమిస్తున్నట్టు తెలుసుకున్నాను!

[ఇంకావుంది



ఆమని పాట

మధురాంతకం రాజారాం

వేఁకొమ్మల చివురు తెరగా మెరిసినవి
విరులన్నియును పెక్కుచందాల విరిసినవి
పంచమ స్వరముతో పాడగా కలకంఠి
పరవశత్వమ్ముతో ప్రకృతి పులకించినది!

పువ్వులా యివి లేక వనలక్ష్మి నవ్వులా!
పుడమియా యిది లేక దేవతల లోకమా!
ఎందుకో ఈ శోభ? అందుకా! ఔనులే!
అందాలతో వసంతము సాగివచ్చినది!

మెరపుతీవలవోలె మెరసి ఆలోన
మాయమైన వసంతముల మాటకేమి?
తెచ్చెనా మాకవి యింత సంబరము!
ఇచ్చెనా మాకవి యింత మోదమ్ము!

ఎన్నడో వేరైన ఈ యాంధ్రజాతి
ఇన్నాళ్ళకిన్నాళ్ళ కొకటిగా నుండ
తెలవారుఝామున సన్నాయి వోలె
మెలమెల్లగా శ్రీవసంత మరుదెంచినది!

తెల్లగా చల్లగా మల్లికలు నవ్వినవి!
కొల్లగా కమ్మతెమ్మరలు తారాడినవి!
మన నోము పండినది! మన కోర్కె నిండినది!
మనసులో వెన్నెలలు పాలార కాసినవి!

పిల్లి, కోడిపెట్ట

పూర్వం ఒకానొక గుడిసెలో ఒక పిల్లి ఒక కోడిపెట్ట కలిసి నివసిస్తూ వుండేవి.

ఒకరోజు పిల్లి అడవికి వెళ్ళటానికి అన్ని యేర్పాట్లూ చేసుకుని కోడితో ఇలా అంది: 'వంటచెరకు కోసరం అడవికి వెళుతున్నాను, నీవు వంటగదిలోనే కూర్చుని బటాణీలు నములుతూ వుండు. ఎవరినీ గుడిసెలోనికి రానివ్వకు. ఎంతవాళ్లు వచ్చి పిలిచినా సరే!'

అల్లాగే నంటూ కోడిపెట్ట పిల్లి బయటకు వెళ్ళగానే తలుపు గడియ పెట్టుకుని కూర్చుంది.

కొద్దిసేపటికి నక్క ఒకటి పరుగెత్తుకుంటూ వచ్చింది. ఈ నక్కకు కోడిపెట్ట అంటే మహా ప్రీతి! కోడిని పిలుస్తూ పాటపాడింది:

'చిన్నారి కోడిపెట్టా—
తలుపుతియ్యమ్మా—
కడుపునిండా తిండి,
పెడతాను రావే!
బలేబలే తాయిలం నీకోసం
తెచ్చా!
మాటల్తో రాకపోతే!
యిదుగో నా సవాల్—
కిటికీలోంచి దూకి
మెడపట్టుకు ఈడ్చుకు పోతా!'

ఈ పాటకు కోడిపెట్ట బదులు పలికింది!

'పిల్లికి వాగ్దానం చేశాను,
తలుపు తీసి బయటకు రాలేను!'

అన్నప్రకారం నక్క కిటికీ చువ్వలు లాగి దూరిలోపలకు వచ్చింది. కోడిపెట్ట మెడపట్టుకుని పరుగెట్టింది. కోడి గిజగిజలాడిపోతూ పిల్లి నుద్దేశించి ఇలా పాటపాడింది:

'నన్ను కాపాడు పిల్లిఅన్నా!
నక్క నన్నెటో కొట్టుకు
పోతోంది.
దట్టమా అడవిలో దాచి
వేస్తుందేమొ—
లోతైన నీటిలో ముంచివేస్తుం
దేమొ—

'శ్రీ విరించి'

పిల్లిఅన్నా—వచ్చి కాపాడు
మన్నా!'

పిల్లి యీ ఆక్రందనం వింది; పరుగెత్తుకుంటూ వచ్చింది; నక్క నోట్లోంచి కోడిపెట్టను విడిపించి యింటికి తీసుకువెళ్లింది.

'నీవు నక్కకు జవాబు చెప్పకుండా వుండవలసింది. ఎంతగా పిలిచినా దానికి బదులు చెప్పకు. ఈసారి నేను మరింతదూరం వెళ్లాలి!' అని పిల్లి వెళ్ళిపోయింది.

పిల్లి వెళ్లిపోవటంచూచిన నక్క మళ్ళీ పరుగెత్తుకుంటూ తయారయింది.

కిటికీ దగ్గరకు వెళ్ళి తలుపు తట్టింది. ఇందాకటి పాటే పాడి పిలిచింది. కోడిపెట్టకు జవాబు చెప్పకుండా ఉండగలగడం చేతకాలేదు.

'పిల్లికి వాగ్దానం చేశాను—
తలుపుతీసి బయటకు రాలేను' అని పాటపాడింది. మరుక్షణంలోనే నక్క కిందికిదూకి కోడిపెట్టను నోట్లో చిక్కించుకొని పరుగు సాగించింది

కోడిపెట్ట పాటపాడింది, పిల్లిని వచ్చి రక్షించమంటూ. ఒకసారికి పిల్లి రాలేదు. రెండోమారు పాడింది- పిల్లి పరుగునవచ్చింది. నక్కబారి నుంచి కోడిని రక్షించి తీసుకువెళ్ళింది. ఈమారు బాగా కఠినంగా ఆదేశించింది—'నీవు వంటయింటిలోనేకూర్చోవాలి! బటాణీలు నమలడం తప్ప ఇంకేమీ చేయకూడదు. నక్కవచ్చి పిలిచినా జవాబు చెప్పకూడదు. నేను ఈసారి మరీ దూరం వెళ్లవలసి ఉంటుంది. నీవు రక్షించమని ఎంతగా అరిచి మొత్తుకున్నా ప్రయోజనం వుండదు'

పిల్లి వెళ్లిపోయింది. నక్క మళ్లీ వచ్చింది. మామూలుపాటేపాడింది.

ఈమారుకూడా పిల్లి మాటలు మర్చిపోయింది కోడి. బదులు పలకకుండా వుండలేకపోయింది!

నక్క కిటికీలోంచి గుడిసెలోకి దూకింది. కోడిపెట్టను నోటకరుచుకొని పరుగుపెట్టింది.

కోడి పిల్లిని రమ్మని ప్రాధేయపడుతూ ఆక్రందనం చేసింది. రెండుసార్లు—మూడుసార్లు...యిట్లా పిలుస్తూనే వుండిపోయింది కాని పిల్లి మటుకు రానేలేదు. పిలుపు వినిపించ

నంత దూరం వెళ్ళిపోయింది! నక్క కోడిపెట్టను తనయింటికి తీసుకు వెళ్లింది. తన చిన్నారి పిల్లలకు మంచి విందు లభించిందని సంబర పడింది.

ఆ సాయంత్రం పిల్లి మామూలుగా అడవినుంచి తిరిగి వచ్చింది. ఇంటికి వచ్చిచూస్తే కోడిపెట్ట లేదు. పిల్లి చాల విచారపడింది. తిరిగి కోడిని తీసుకురావడానికి ఉపాయం ఆలోచించింది. చేతి సంచీ తీసుకుని నక్కయింటికి వెళ్ళింది.

నక్క యింట్లోలేదు; వేటకు వెళ్ళింది. ఇంట్లో నక్క నలుగురు కూతుళ్లూ, కుర్రవాడు వున్నారు.

పిల్లి కిటికీ దగ్గరగా కూర్చుని పాట ప్రారంభించింది:

'నక్క యిల్లు దివ్యభవనం
నలుగురు కూతుళ్ళూ అందాల
భరిణెలు!
అయిదోవాడు-కుర్రాడు
ఆడుతూ పాడుతూ హుషారుగా
వుంటాడు
అందరూ బయటకు రండి—
నా పాట విని ఆనందించండి!'

నక్క పెద్దకూతురు యీ పాట సంబరంభానికిబయటకు వెళ్ళి చూడా లనుకుంది. తతిమ్మా వాళ్ళతో 'యిప్పుడే వస్తాను-యిక్కడే కూర్చు నుండండి' అని చెప్పి బయటకు వెళ్ళింది.

గుమ్మం దాటి బయటకు వచ్చిందో లేదో పిల్లి నక్కపిల్లను గబుక్కున చేజిక్కించుకుని సంచిలో వేసేసింది. మళ్లీ పాట ప్రారంభించింది:

'నక్కయిల్లు దివ్యభవనం
నలుగురు కూతుళ్ళూ అందాల
భరిణెలు'

—ఈ సారి నక్క రెండో కూతురు బయటకు వచ్చింది. పిల్లి సంచిలో బందీ అయింది. ఈవిధంగా పిల్లి అక్కడే కూర్చుని నలుగురు కూతుళ్లూ, కుర్రవాడూ బందీ అయేట్లు చేసింది.



"గుడినుండి..." చిత్రకారుడు: ఎ. భాస్కర్ (ఏలూరు).

అయిదుగురినీ చేతిసంచిలో బిగించి, పిల్లి మెదలకుండా యింటి లోనికి వెళ్ళింది. పాపం! కోడియీకలు వూడిపోయి బల్లమీద పడివుంది. కొనవూపిరితో కొట్టుకుంటోంది. పిల్లి గబగబా, పక్కనే పడివున్న యీకలన్నీ పోగుచేసి కోడి శరీరానికి అంటించింది. కోడిపెట్ట కాలు మెలికపడి కుంటిదయింది. పక్కనే కోడిని వుడికించడానికి నీళ్ళు సలసల కాగుతున్నాయి. పిల్లి కోడిపెట్టను మళ్లీ మామూలు పరిస్థితికి తీసుకు వచ్చింది.

ఇద్దరూ కలసి నక్కయింటిలో వున్న ఆహారపదార్థాలన్నీ 'స్వాహా' చేశారు, కుండలన్నీ పగలగొట్టారు, వస్తువులన్నీ చెల్లా చెదరు చేశారు. గడబిడ లేకుండా తిన్నగా యింటికి చేరుకున్నారు.

వాళ్లుయిప్పటికీ ప్రశాంతంగా కాలక్షేపం చేస్తున్నారు. ఇప్పుడు కోడిపెట్ట తు చ తప్పకుండాపిల్లి చెప్పి నట్లే చేస్తూంది! ఎంతమాత్రమూ పెడచెవిని పెట్టటంలేదు. అనుభవం అయితేనే కాని పెద్దవాళ్ల మాటలలో లక్ష్యంకుదరదుకదా మరి! ★

సినిమా

కొత్తధనం; కొత్తదనం

1957 ప్రథమ పాదంలో (మార్చి నెలాఖరు నాటికి) విడుదల అయిన తెలుగు-చిత్రాలు పదకొండు. వీటిలో తెలుగులోకి డబ్ చేసిన చిత్రాలు నాలుగు. ఇవికాక మరో తమిళ-చిత్రం (తాయ్‌కుపిన్ తారం) తెలుగు వ్యాఖ్యానంతో "మాతృశపథం" పేరిట విడుదలఅయింది. డబ్ చేసిన చిత్రాలు: రాణి రంగమ్మ, పరాశక్తి, టౌన్‌బస్, వేగుచుక్క.

తెలుగులో తయారైన చిత్రాలు 'తోడికోడళ్లు', 'సతీ సావిత్రి,' 'స్వయంప్రభ,' 'రేపు నీదె', 'భాగ్యరేఖ,' 'నలదమయంతి,' 'మాయా బజార్.'



విజయవారి ఉగాది కానుక "మాయాబజార్" లో శశిరేఖగా సావిత్రి.

మార్చి మూడో వారం వరకు చూచిన ఫలితాలు సంతృప్తికరంగా వున్నాయి. దాదాపు అన్నీ (డబ్ చేసినవిసహా) ప్రజాదరణ పొందాయి. ఉన్నవాటిలో "తోడికోడళ్ళు" పరిభాషప్రకారం 'హిట్' అయింది. త్వరలోనే ఈ చిత్రం శతదినోత్సవాలు చేసుకోబోతున్నది. వీరందరికీ శుభాకాంక్షలు.

కొత్త సంవత్సరం పుట్టాక ఐదారు కొత్త చిత్రాలకు ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇతఃపూర్వమే ప్రారంభమై సాగుతున్నవీ కొత్తగా మొదలైనవీ కలిపి, 40 పైచిలుకు తెలుగు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయని చెప్పవచ్చు.

వీరిలో కొత్తగా చలనచిత్ర నిర్మాణానికి దిగినవారు చెప్పుకో తగినంతమంది ఉన్నారు.

ఇప్పటికి విడుదల అయినవాటిలో కూడా మూడుచిత్రాలు కొత్తవారు నిర్మించినవే. వారు ఈ పరిశ్రమకు చిరపరిచితులైనా నిర్మాణానికి పూనుకోవడం తొలిసారి.

ఇలా కొత్తవారు రావడం, వర్ధిల్లే పరిశ్రమకు మంచి లక్షణం.

ఐతే, ఇలా "కొత్త ధనం" వస్తూవుంటె చురుకుగా, చొరవగా కొత్త దనం మటుకు వస్తున్న సూచనలు గోచరించటం లేదు.

పరిశ్రమలో పెద్దలంతా ఇలాటి వాక్యా

సీ..నీ..(రా)..మా

పెనోరమా పేరిట పెద్దపెద్ద దృశ్యాలను తెరకెక్కించడానికి జరిగిన కృషి ఫలితంగా సినిమాస్కోప్ విస్టావిజన్ వచ్చాయి. సినేరామా వచ్చింది. ఇప్పుడు అమెరికాల్లో కొత్తగా "త్రిల్లారామా" అని మరొకటి వచ్చింది. బ్రిటన్‌లో దానికి తీసిపోని విధంగా "టెక్నారామా" అనే మరో హంగు వచ్చింది. వెండి తెరఅల్లా రంగుతెరగా మారి ఇపుడు నికార్సయిన హంగు తెర స్థాయికి వచ్చేసింది.

మనదేశంలో భలేరామ, దొంగ రామ, అగ్గిరాములాటి చిత్రాలు కనక ఈ సినేరమాలో తయారై వుంటే, మరింత బాగుండేవని సినీమాభిమానులు అంటున్నారు.

సినిమా వార్తలు

జైశక్తి ఫిలింస్‌వారు రెండుభాషలలో నిర్మించిన "అల్లావుద్దీన్, అద్భుత దీపం" తమిళప్రతి మార్చి 29 న విడుదల అయింది. తెలుగుచిత్రం ఈ నెల 12 వ విడుదలచేస్తున్నారు.

మార్చి 20 వ వీరు ఏకబిగిన గోల్డెన్ స్టుడియోలో రెండు కాల్‌షీట్లు పనిచేశారు. నాగేశ్వరరావు, అంజలి, రాజసులోచన, శాలయ్య అందులో పాల్గొన్నారు. ఆరోజునే అంజలి, రాజసులోచనల నృత్యాలు రెండిటిని చిత్రించారు. ఈ చిత్రంలో అద్భుతమైన అరేబియన్ కథ, అందులో మాయదీపంగారడీలు మొదలైన వాటితోపాటు రాజేశ్వరరావు కూర్చిన సంగీతంకూడా ప్రత్యేకాకర్షణ కాగలదంటున్నారు. దేశదేశాల బాణీలను, రకరకాల నృత్యాలతో జోడించి ఇందులో చొప్పించారు. నృత్యదర్శకుడు వెంపటి సత్యం.

అంజలి, నాగేశ్వరరావు, రంగారావు ఇందులో ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు. రచన ఆరుద్ర. దర్శకుడు టి. ఆర్. రఘునాథ్. సంయుక్తదర్శకుడు వేణుగోపాలస్వామి.

అంజలీదేవి నృత్యం చిత్రీకరణలో ఒక ఘట్టం ప్రారంభమైంది.

కొత్త ధనం; కొత్త దనం

లను కల్తీలేని కవిత్వం" అని అభివర్ణించి, తమ వైఖరిని సమర్థించుకోవచ్చు.

వర్తమాన పరిస్థితుల గతిని గమనిస్తే ఇప్పుడున్నవి ప్రవర్ధమానకర పరిస్థితులు కావని అనిపిస్తుంది. తయారౌతున్నవాటిని చిత్రాలనడంకన్న విచిత్రాలనడం సబబనిపిస్తుంది. కథలూ, పాత్రలు, పోకడలూ అనీ ఒకే గాడిలో నడుస్తున్నాయి. మగ్గంలో కండెలా అటునుంచి ఇటు ఇట్నించి అటూ మటుకే నడుస్తున్నాయి.

మళ్ళీ కొత్తగాడిచూపి సినిమాగాడీని ముందుకునడిపే నాథుడు కొత్తవాడే అయివుండాలి. పాతవాళ్ళు గబుక్కున మారరు. ఒకరోజు ప్రొద్దుటే, ఒక కొత్త ఆసామివచ్చి సాహసించి ఒక చిత్రం తీస్తాడు. అది బాగుందని జనం మెచ్చుకుని ఘనంగా డబ్బు చెల్లిస్తే 'మనం' ముందుకు కదిలుతాం.

చలనచిత్రాల చరిత్ర చదువుకుంటే అదే గోచరిస్తోంది: 'కొత్తధనం తెచ్చేవారే కొత్తదనం వెంటబెట్టుకు రావాల'ని. ★



భరణివారి "వరుడు కావలెను" లో భానుమతి.

నాగేశ్వరరావు చిత్ర షష్టిపూర్తి

నాగేశ్వరరావుకి 'అసాట్'లో పని లేదు. కొంచెం ఇవతలగా ఉన్న సోఫాలో కూర్చుని, పాదపీఠికమీద కాలు మోపి విశ్రాంతి తీసుకుంటున్నాడు.

"తీవిగా" అన్నారు అక్కడే ఉన్న ఒకాయన.

"శ్రీవి కాదు గీవి కాదు కాలు కాస్త నొప్పిగా ఉంది" అన్నాడు నాగేశ్వరరావు నవ్వుతూ.

నాగేశ్వరరావుకి ఇటీవల ఒక చిత్రంలో పనిచేస్తూండగా, కాలు తొట్రుపడి తూలి పడ్డాడు. మోకాలుకి దెబ్బతగిలి వాచింది. ఎముక ఒకటి కొద్దిగా స్థానంతప్పింది. పుత్తూరు వైద్యుల్ని పిలిపించి కట్టు కట్టించారు.

తరువాతి 20 రోజుల్లో నాగేశ్వరరావు ఇల్లు కదలలేదు. కాని ఫిలింపరిశ్రమలో అందరూ కుశలం అడగబోయి కాసేపు కబుర్లు చెప్పి వెళ్తూవచ్చారు. దానాదీనా, నాగేశ్వరరావు నొప్పిసంగతి మర్చిపోయి, వివిధ చిత్రాల నిర్మాతలు కోరుకున్నంత త్వరగానూ కోలుకుని మార్చి 16 కల్లా మళ్ళీ సెట్స్‌కు వచ్చాడు.

ఈ ఇరవై రోజులూ ఇంట్లోనే కూర్చున్నా నాగేశ్వరరావు క్షణంకూడా వృథాచేయలేదు.

త్వరలోనే అతను నటించే అరవయ్యోచిత్రం "చెంచులక్ష్మి" విడుదల కాబోతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని లక్షలాది అభిమానులకూ, శ్రేయోభిలాషు

(61-వ పేజీ చూడండి)



సహజత్వం, సౌలభ్యం...

సినీనటి శ్రీమతి సూర్యకాంతం

గజ్జెల గుర్రమల్లె బాగా ఎత్తరిగావున్న 18 ఏళ్లపిల్ల ముద్దులు గునుస్తూ సావిట్లోకి వచ్చింది. "యామ్మే...అలా వెళ్లి ఆడుకుంటానామ్మే" అంది...

కథలో ఈ ఘట్టాన్ని చదువుకునేటపుడు మన మనసులో స్ఫురించే చిత్రం ఎబ్బెట్టుగా ఉండకపోవచ్చు. కాని, సినిమా చూడబోయినపుడు, పాతికేళ్ళపై చిలికిన బాలిక, పైట పరికిణీలో ఇమిడిపోయి అమ్మ దగ్గిర అలా ముద్దు మాటలతో ముద్దులు గునిస్తే మనకి చిరాకేస్తుంది. పిల్లల తల్లిలా ఉంది ఈ గారాబం ఏమిటని మనం హేళన చేయబోవడం సహజం.

అయినా, ఈ పిల్లకి ఆ తల్లి జవాబెలా చెబుతుందో చూదామని క్షణంలో సగం సేపు పస్తాయిస్తాం.

ఆవిడ మరో మరోపాటి నటి అయితే ఆటా లేదూ పాటా లేదు, గుమ్మం కదల వీలు కాదు అని కేక లేస్తూంది.

ఆవిడే కనక సూర్యకాంతం అయితే, "నా తల్లే...నా బుజ్జే..!..ఉండమ్మా ఉగ్గుపట్టి, ఉయ్యాల్లోపెట్టి జో కొడతాను చక్కా హే బజ్జో అమ్మా బజ్జో" అంటుంది. హేళనా లాలనా మేళవించి.

ఆ కూతురు విగ్రహాన్ని, ఈ తల్లి హేళన లాంటి లాలననీ చూడగానే మనకి మనసారా నవ్వ బుద్ధి కలుగుతుంది. నవ్వుతాము. క్షణం క్రితం మనకి తోచిన ఊహనే ఆవిడ ఈ విధంగా పైకి చదివెయ్యడంతో, "సూర్యకాంతం నటన ఎంత సహజంగా ఉంది" అని అనిపిస్తుంది.

నటనలోగాని పలుకులోగాని ఆ సహజత్వం, సౌలభ్యం లోపిస్తే ఆ ఘట్టం ఎబ్బెట్టుగా ఉందనిపిస్తుంది. ఈ రెండు లక్షణాలకూ మారుపేరే సూర్యకాంతం.

నటిగా ఈమె అనేక దుర్లక్షణాలకు అర్థ నిర్వచనం చెప్పడమే కాక రూపకల్పన చేసి చూపింది. ప్రపంచంమాటా, భారత ఖండం మాటా ఎలా ఉన్నా, తెలుగు దేశంలో అనేక కుటుంబాలు అష్ట కష్టాలూ పడడానికి కారణమైన దుర్మార్గులనూ, దుర్మార్గాలనూ జ్ఞాపకం వుండేలా తెలియజెప్పింది.

మామూలుగా భారతీయ చిత్రాలలో విలన్లు, గళ్ళలుంగీ వల్లబనీనూ వేసుకుని, ఫోటోజెనిక్ గా పోజులు కొట్టడం నేటికీ పరిపాటే. బొంబాయి చిత్రాలలో విలన్‌లు మహా అయితే సూటు వేసుకొని పైపు కాలుస్తారు. ఎంత చేసినా మొహాన "విలన్" అని బోర్డు కట్టారనిపిస్తుంది. వీడు చెడ్డవాడు; వీడు కాడూ అని రెండుతో మనుషుల్ని భాగించి చూపిస్తారు మన చిత్రాలలో.

ఈ స్థాయి దాటి, నిత్యజీవితంలో మనకి తటస్థపడే చెడ్డవాళ్లనీ, వాళ్ళ చెడ్డ గుణాలనీ, వాళ్ళలా కావడానికి వాళ్లు చెప్పుకోగల కారణాలనీ కూడా కలిపి సమగ్రమైన స్వరూపం ఇచ్చి చూపగలిగినవారు ఉన్నంతలో కొంతవరకూ తెలుగు చలనచిత్రకారులు. ఇందులో స్త్రీల పాత్రలను 'ఉత్తమం' అని మెచ్చతగ్గ స్థాయిలో చిత్రించిన ఘనతలో శ్రీమతి సూర్యకాంతానికి, ఆయా చిత్రాల దర్శక రచయితలతో సమానమైన వాటా కేటాయించవచ్చును.

* * *

సూర్యకాంతానికి చిన్నపుడు వాళ్ళమ్మగారు ఉగ్గుపాలలో గారాబం రంగరించి పట్టారు. దానివల్ల అమ్మ భరవసా చూసుకుని ఆ అమ్మాయి, మనసుకి తోచినమాట మొహమాటం లేకుండా అనడం నేర్చుకుంది. చిన్నతనంలో అలా మాటాడితే పెంకెఘటం అంటారు. పెద్దయ్యాక అంత నిర్భయంగానూ, ముక్కుసూటిగానూ మాట్లాడగలిగితే, కొందరికి రుచించక పోయినా, మొత్తంమీద నలుగురూ ఓహో అంటారు. సూర్యకాంతం నిత్య జీవితంలో, ఎదటివాళ్ల అభిప్రాయాల గురించి బెంగెట్టుకోకుండా, తన మనసుకి తోచినమాట సూటిగా అనేస్తుంది. అనవసరంగా మాటపడదు; ఒకర్ని అనదు.

ఇక నటనకూడా అంతే.

"హఠాత్తుగా ఒక రోజున సినిమావారి



"మాయాబజార్" చిత్రంలో రంగారావు, సావిత్రి.

మోజు కలిగి చెన్నపట్నం రాలేదు నేను" అంటుంది సూర్యకాంతం.

కాకినాడలోని ఆడపిల్లల బడిలో 'అ ఆలూ' 'ఎక్కాలూ'. నాటకంలో వేషాల, మాటలూ ఒక్కసారే నేర్చుకుందామె. మూడవఫారందాటాక, ఆ బడిమానేసి, నాటకాల బడిలో చేరింది. అప్పటికే వాళ్ళ నాన్నగారు (పొన్నాడ అనంతరామయ్య) చనిపోయినందువల్ల, "మాశావా ఈ గడుగ్గాయ నాటకాల వెంబడి పడింది హవ్వా!" అని ముక్కున వేలేసుకున్నారు అమ్మలక్కలు.

వాళ్ళమీద ఎంత కోపంవచ్చినా, వాళ్ళు తనని ఎలా వెక్కిరించారో చూసి, ఎలా హేళనచేశారో అందులో 'సొడబ్బెం' ఏమిటో గమనించి నవ్వుకుని మరీ వెళ్ళిపోయేది సూర్యకాంతం.

ఈరోజున సినిమాలో గయ్యాళి అత్తగారుగానో చుప్పనాతిఆడపడుచుగానో వంగనాచి నరసమ్మగానో వేషం వేసినపుడు, ఆమె ఆ పాత్రలో ఐదు నిండు ప్రాణాలూ ప్రతిష్ఠించి, చైతన్యవంతంగా నిర్వహించగలగడానికి నాటికీ నేటికీ ఆమెకు అలవాటైన ఈ పరిశీలనామతిత్వం ఎంతో దోహదం చేసింది.

"ఎదురింటి పిన్నిగారు, పక్కింటి బామ్మగారూ, ఆ వీధి అమ్మమ్మగారూ గుర్తుకు వస్తుంటారు." అంటుంది సూర్యకాంతం.

దూరపు బంధువోకామె అడపాతడపా వీరింటికి వచ్చేదట కాకినాడలో. అగ్రెంటు పనున్నట్టు, జెటకా దిగుతూనే మేడెక్కిపోయి తూచోని కబుర్లు మొదలెట్టేదట. జట్కా ఆసామి కాసేపుచూసి డబ్బులు ఇవ్వమని గావుకేక పెట్టేసరికి, ఆవిడ హఠాత్తుగా ఆ విషయం గుర్తుకొచ్చినట్టు అభినయించి, "ఔగాని, అమ్మడూ ఓ అర్ధరూపాయుంటే ఆ జెటకావెధవ మొహాన తగలేసిరద్దూ అనక మార్చేస్తానుగాని" అనేది. అనక ఆవిడ మార్చదు. మార్చినా ఇవ్వదు.

కొత్త కంటికి నదరుగా ఉన్న చీరో రవికో కనబడితే, "పిల్లా బావుందిస్మీ... ఎలా ఇచ్చారేం?...ఇంతే? గజం నాలుగున్నరే...మాడు, ఓ పది గజాలు చింపించి మాయింటికి పంపించు. డబ్బు అనక ఇసాగాని" అనేది దర్జాగా. ఎన్నిసార్లు అడిగితే అన్నిసార్లూ తన మందమతి గుణాన్ని గట్టిగా తిట్టుకుని మళ్ళా మర్చిపోయేది.

"ఇంతకీ ఆవిడ లేనిదా అనుకుంటే, అదేంకాదు. అందుకేం లోటులేదు. మేడా కమామిషూ ఉన్నాయి." అంటుంది సూర్యకాంతం.

సెట్‌మీద తను ఒక వేషానికి చెప్పే డైలాగుభాష బెట్టుగావున్నా, ఎబ్బెట్టుగా వుందనిపించినా సూర్యకాంతం ఇలాంటి సన్నివేశాలు గుర్తుకు తెచ్చుకొని ఒకటి రెండుసార్లు ఆలోచించుకుని అప్పైనం దర్శకుడికి, రచయితకి చెబుతుంది. వారి అనుమతిమీద, తనకి తోచినవిధంగాచెప్పి ఔననిపించుకుంటుంది.

* * *

అన్నీ నిక్షేపంలాఉన్నా ఇపుడిపుడు కొత్తగా వినబడుతున్న అపశృతి ఒక్కటే ఉంది. అది కొత్తతనం క్రమంగా లోపించడం.

ఒకనటి ఒక వేషాన్ని బాగా ఒప్పించినా ఒక గాయకుడు ఒకరకం పాట బాగా పాడినా, మన చలనచిత్రసీమలో ఒక విధంగా అది అపకారంచేసే పరిస్థితి ఏర్పడింది. వాళ్ళకి తరువాతవచ్చే అవకాశాలన్నీ ఒకేతరహావి అయివుంటాయి. అందరు నిర్మాతలూ అదేవేషాన్ని, కథలో చోటున్నామానినా రూపొందించి ఆ నటీనటులకు ఒప్పగిస్తారు. ఇందులో వైవిధ్యం, కొత్తదనం ఉండాలన్న విషయం గురించి శ్రద్ధగా ఆలోచించరు. నిజానికిది జనానికి విసుగెత్తిస్తుందన్న సంగతిని గమనిం



ఎలైడ్ ప్రొడక్షన్స్‌వారి "ఋష్యశృంగ"లో నారాయణరావు, జయలక్ష్మి

అదీ-ఇదీ

ప్రభుత్వాన్ని గాని, ప్రజలనుగాని విరాళం ఇచ్చి ఆదుకోవలసిందని కోర నవసరం లేకుండా, ధర్మకార్యాలు నిర్వహించే నిమిత్తం బొంబాయిలోని 'బాపూ్నా ఘర్' అనాథ స్త్రీ శరణాలయంవారు ఒక చలన చిత్ర ప్రదర్శనశాలను కట్టించారు. మిగతా అన్ని థియేటర్లలాగానే ఇక్కడా వ్యాపార స్థాయిలో చిత్రాలు ప్రదర్శిస్తారు. వచ్చే లాభం అంతా ఈ శరణాలయంలో స్త్రీలకు వృత్తులు నేర్పి ఉపాధులు చూపడానికి వినియోగిస్తారట. ఎనిమిదివందల మంది జనం కూర్చోడానికివీలుగా కట్టిన ఈ థియేటర్ ను త్వరలోనే ఎయిర్ కండిషన్ చేయిస్తున్నారు. ఈ థియేటర్ నిర్వహణ కార్యకలాపాలను శరణాలయంలోని స్త్రీలే సాగిస్తారు. విశ్రాంతి సమయంలో విక్రయించే పానీయాలూ ఫలహారాలూ కూడా శరణాలయంలో తయారుచేసి సరఫరా చేస్తారట. బొంబాయిలో ఈ నాడు థియేటర్ల రద్దీ చాలా ఎక్కువగా ఉంది. సినిమా పరిశ్రమలో అత్యంత లాభకరమైన శాఖ ఇదేనని విసుగెత్తిన నిర్మాతలు అంటూఉంటారు. ఈ పరిస్థితిలో ఇటువంటిచోట లేచిన ఈ థియేటర్ వల్ల అనాథశరణాలయ కార్యక్రమాలు, ఇతరుల సహాయం కోర నవసరం లేకుండా నిరాఘాటంగా సాగిపోగలవనడాని కికేమీ సందేహంలేదు.

థియేటర్లు చాలక అవస్థ పడుతున్న నిర్మాతలకు ఇది సంతోషకరమైన వార్త. అనాథ శరణాలయానికిది ప్రయోజనకరమైనకార్యం. ఇతర ప్రాంతాలవారికి అనుసరణీయమైన మార్గం....

జపాన్‌లో సినిమాలు

జపాన్ జనాభా తొమ్మిదికోట్లు. వాళ్లకి అక్కడఉన్న సినిమాలు 5 వేల పై చిలుకు.

మనం 37 కోట్లజనం. మనకున్న థియేటర్లు (టూరింగు టాకీసులు సహా) నాలుగు వేలకన్న తక్కువే ఉన్నాయి. చలనచిత్ర నిర్మాణంలో జపాన్ భారతదేశాలవి ద్వితీయ తృతీయ స్థానాలు. అయినా మన థియేటర్ల సంఖ్యమటుకు, పరిశ్రమతోపాటు పెరగటం లేదు. రద్దీ ఎక్కువ అవడం, నిర్మాతలు అవస్థ పడడం, పరిపాటి. జనం అవస్థ పడడం మరొకటి.

సంఖ్యమాట దేముడెరుగుగాని, ఉన్న థియేటర్లలో పరిస్థితులు మారడం చాలా అవసరం అని చాలామంది అనుకుంటున్నారు; అంటున్నారు. అయితే, ఏఒక్కరికీ కేవలం దేశసేవకోసం అని, ప్రజల సౌఖ్యంకోసం అని దారుణంగా డబ్బుఖర్చుపెట్టి థియేటర్లను అద్భుతంగా తయారు చేయాలన్న "విపరీత"మైన ఆకాంక్ష ఉండడం అరుదు.

అందుకనే "మీదేశంలో థియేటర్ల సంఖ్య పెరగాలి" అని జపాన్‌నుండి వచ్చిన "ఫార్ ఈస్ట్ ఫిలింన్యూస్" పత్రిక సంపాదకుడు గ్లెన్ ఎఫ్. ఐర్టన్ మొన్న అన్నారు. మన థియేటర్ల సంఖ్య, ఉన్న వాటితీరుతెన్నులూ కూడా, తాను చూచినమేరకు అసంతృప్తికరంగా ఉన్నట్టు ఆయన అభిప్రాయపడ్డారు.

"బుద్ధం శరణం గచ్ఛామి"

బుద్ధభగవానుని కథను, ఆయనప్రబోధాలను తెలియచెబుతూ (భారత ప్రభుత్వం పనుపున) బిమల్ రాయ్ ప్రొడక్షన్స్ నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రం "గౌతమ ది బుద్ధ"ను వచ్చేనెల ప్రారంభంకానున్న కాన్స్ చలనచిత్రోత్సవానికి పంపుతున్నారు. శ్రీ రాజ్ బంస్ ఖన్నా దర్శకత్వాన రూపొందిన ఈచిత్రం మనడాక్యుమెంటరీ చిత్రాలలో విశిష్టస్థానాన్ని ఆక్రమించుకొంటుంది. దేశంలోని పలువురు విద్వాంసులతో సంప్రతించి, అపశ్రుతులూ దోషాలూ పొర్లకుండా దీనికి వ్యాఖ్యానం వ్రాయించి, రూపొందించారు. అయితే అప్పట్లోనే కొందరు విషయజ్ఞులు యీ చిత్రంలో సంగీతంగురించి ఒకటి రెండు సందేహాలు వెలిబుచ్చడం జరిగింది. ఈ చిత్రం సంగీతదర్శకుడు శ్రీ సలీల్ చౌదరి దీనికి కూర్చిన నేపథ్య సంగీతంలో అక్కడక్కడ "ఫిల్మీవాలీ బాణు" సంగీతం చొరబడింది. దరిమిలా, దీన్ని సింహళంలో బుద్ధజయంత్యుత్సవ సందర్భాన అక్కడి బౌద్ధ భిక్షువులకు చూపించడానికి ఏర్పాట్లు జరిగినపుడు ఆదేశపు సంస్కృతి వ్యవహారాల మంత్రి కూడా ఇదే తరహా సందేహాలను వ్యక్తం చేశారు. "ఇందులో సంగీతం బౌద్ధ భిక్షువులు వినతగినదిగా లేద"ని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ పైనే ఇది ప్రదర్శన యోగ్య

సూర్యకాంతం

చరు. ఇటీవలి చిత్రాలలో సూర్యకాంతం భూమికలు ఒకే మూసపోత బాపతు కనిపించేలా ఉన్నాయి.

కొన్నాళ్ళక్రితం ఒక దర్శకుడు ఆమెను ఈవిషయమై ప్రశ్నించాడు.

సూర్యకాంతం నవ్వింది. "ఈ ప్రశ్న మీరు నన్నడగవలసిందికాదు. ఈ డైలాగ్ నేను చెప్పవలసింది." అంది.

* * *

సూర్యకాంతం ఇప్పటికి దాదాపు 40 తెలుగుచిత్రాలలోను, రెండు హిందీ చిత్రాల (దోదిల్, బహుత్ దిన్ హుయే) లోనూ నటించింది. ఆమె తొలిసారిగా "చంద్రలేఖ" చిత్రంలో 'డాన్సు' చేసే 'ఛాన్సు' సంపాదించి ఈ ఊరువచ్చి, కారణాంతరాలవల్ల అది మానుకుని 'నారద నారది'లో నటించింది. ఇపుడామె పాల్గొంటున్న చిత్రాలు అరడజను ఉన్నాయి. ★



"మాయాబజార్"లో బాలకృష్ణ, వంగర, రామలింగయ్య.

సినిమా వార్తలు

(57-వ పేజీ తరువాయి)

లకూ కృతజ్ఞతాభివందన లర్పించేనిమిత్తం శతదినోత్సవాలు జరుప సంకల్పించడం పాఠకులకు విదితమే. దీనికి చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయి. భారీఎత్తున ఉత్సవ కార్యక్రమాలను రూపొందించాడు నాగేశ్వరరావు. దానికై ఏర్పాట్లుసాగించడం ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం...క్షణం తెరిపిలేకుండా గిర్రున తిరిగిపోయాయి 20 రోజులూను.

"అసలు మనకి బుర్రలో ఒక ఆలోచన వస్తే అది కార్యరూపం ధరించేవరకూ నిద్ర పట్టదుగా" అన్నాడు నాగేశ్వరరావు నవ్వుతూ.

నాగేశ్వరరావు నటించిన తొలిచిత్రం "సీతారామ జననం." భూమిక: శ్రీరాముడు. రేపు ఉత్సవంనాటికి విడుదలకానున్న 60 వ చిత్రం "చెంచులక్ష్మి". అందులో నాగేశ్వరరావు శ్రీ మహావిష్ణువు. దానికీ దీనికీ మధ్య అతడు పాల్గొన్న పౌరాణికచిత్రాలు రెండే రెండు. అవి వరలక్ష్మి ఫిలింస్‌వారి "సతీ సావిత్రి", విజయవారి "మాయాబజార్".

* * *

ఫిలిం డైరీ 1957

సంపాదకుడు శ్రీ బి. బలరామరెడ్డి. ప్రచురణ: సుందరి పబ్లికేషన్స్, 17, ఉస్మాన్ రోడ్డు, మద్రాసు-17.

ఇందులో తెలుగు చలనచిత్ర నటీనటుల, దర్శక నిర్మాతల ఇతర టెక్నీషియన్‌ల చిరునామాలూ ఛాయాచిత్రాలూ, సెన్సార్ నిబంధనావళి వున్నాయి. ఇవికాక ఫిలిం విచారణసంఘం సిఫార్సులూ వాటిపై ప్రభుత్వం చేసిన నిర్ణయాలూ కూడా సంగ్రహంగా పొందుపరచారు. త్రివర్ణ ముఖచిత్రం. నూరుపుటలు. వెల ఒక రూపాయ.

★

అదీ-ఇదీ

మనసో కాదో, సంగీతం కొంత మార్చవలసిన అవసరం ఉందో లేదో తేల్చుకొనే నిమిత్తం కొందరు ప్రముఖ బౌద్ధభిక్షువులకు మాత్రం చూపడానికి ప్రయత్నించారు. గానికై కొలంబోలోని ఒక ఉత్తమ ప్రదర్శనశాలను కేటాయించారు. తీరా, వారిని ఆహ్వానించే సరికి బౌద్ధభిక్షువులు చలనచిత్రప్రదర్శనశాలలో కాలు మోపడం నిషిద్ధమని వారు అన్నారు. ఇపుడు ఈ సంగీతం సంగతి ఏమయేటట్టు ?

★

★ నాణెముల చరిత్ర ★

(6-వ పేజీ తరువాయి)

పూర్వకాలంలో టంకాలు వేర్వేరు దేశాలలో వేర్వేరు విలువలను కల్గివుండేవి. కాని యిటీవలి పరిశీలకులుమాత్రం టంకం విలువ నేటి మన రూపాయిలో 8 వ వంతు అని తేల్చేరు.

మాడ విలువ నేటి మన రెండురూపాయిలు, వరహా విలువ నాల్గురూపాయిలు; ఇవికాక "కరకువరహా" అన్నదాని విలువ ఐదురూపాయలుగా ప్రచారంలో వుండేది.

దీనారటంక మనే నాణెము కాశ్మీరం (హిందూదేశం)లోనే కాకుండా ఆ పేరు గలనాణెము యుగోస్లావియాలో కూడా వాడుకలో వుండేదట. దానికి ఇంగ్లీషు నాణెములలో తొమ్మిదిన్నర పెన్నుల విలువ ఉండేదని తెలుస్తున్నది.

మనకి వాడుకలోనున్న రూపాయి చాలా ప్రాచీనకాలంలోనే ఉన్నటువంటిది. సంస్కృతపదం రూప్యం, రూపాయిగా రూపొందింది. అయితే అప్పుడు రూపాయికి వున్న విలువయేమిటో మనం సరిగా చెప్పలేం. కాని, తరువాతకాలంలో మనకు తెలిసినంతవరకూ 13 వ శతాబ్దంలో మహమ్మదీయుల కాలంలో తొలిసారిగా రూపాయి ముద్రించబడింది. అప్పుడు దానితూకం 175 గ్రెయిన్‌లు ఉండేది. 1542 లో షేర్‌షా 179 గ్రెయిన్‌లు తూకం గల "రూప్యము" ముద్రింపజేసేరు.

ఆతరువాత ఇండియా నేలిన బ్రిటిష్ వారు 165 గ్రెయిన్ల శుద్ధమైన వెండి గలిగి 180 గ్రెయిన్ల తూకం గలిగిన రూపాయిల్ని 1835 నుంచి ముద్రిస్తూ వచ్చారు.

1873 లో బంగారం గిరాకీనిబట్టి రూపాయి విలువ రెండు షిల్లింగులుగానూ (పౌనుకి పది రూపాయిలు) 1873 తరువాత వెండి గిరాకీని బట్టి రూపాయి విలువ ఒక షిల్లింగుగానూ ముద్రిస్తూ వచ్చారు.

ఆతరువాత వెండిబంగారాల గిరాకీ మూలంగా 1883 లో రూపాయల ముద్రణ ఆపివేసి 1899 లో తిరిగి పౌనుకి 15 రూపాయలుగా రూపాయిల్ని ముద్రించడం ప్రారంభించేరు. అప్పుడు దాని తూకం ఒకతులం వుండేది. ఇప్పటికీ తూకంలో తులాల్ని తూచేందుకు రూపాయిల్ని పడికట్టుగా వాడుతూవుంటారు.

అప్పుడే రూపాయి 16 అణాలుగాను, అణా 12 పైసలు (దమ్మిడీలు) గాను విభజించేరు.

అంతేకాకుండా క్రమంగా రూపాయిలో సగం 'అర్ధరూపాయి, నాల్గోవంతురూపాయి 'పావలా', ఎనిమిదోవంతు బేడ కూడా ముద్రించబడినవి. అణాలోసగం అర్ధణా, అణాలో నాల్గోవంతు కాణీ, మూడోవంతు 'డబ్బు', ఆరోవంతు 'ఏగాని', ఎనిమిదోవంతు 'కాసు'లేక 'అరకాని' లేక, మూళ్ళోలికాసు, పన్నెండోవంతు 'దమ్మిడీ' దమ్మిడీలోసగం 'ఠోలీ' అనే చిన్న నాణేలు కూడా రాగివి ముద్రిస్తూవుండేవారు. ఇంత చిన్న నాణేలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ (పూర్వపు వస్తుమారకానికి సూచనగా) ఠోలీకి మూడుగవ్వలుగా గవ్వలు కూడా ద్రవ్యరూపంలో చలామణీఅవుతూఉండేవి.

పూర్వం పావలాలు (కొన్ని గుండ్రంగా వున్నప్పటికీ) పలకలుగా వుంటూ ఉండేవి. అందుచేత విశాఖ విశాఖ అద్దరిని పావలాని 'చాకం' లేక, 'చాక' అని అంటూవుండేవారు. అలాగే అర్ధణాకి 'డబ్బున్నర' లేక 'పరక'అని, అరకాణీకి ముళ్ళోలికాసు (మూడుఠోలీలు విలువగలది) అని చెప్తూ ఉండేవారు.

నాణేలు బాగా వ్యాప్తిజెందిన తరువాత లోహాల గిరాకీ మూలంగా క్రమంగా కొత్త తాలు ముద్రించబడి, పెద్దనాణేలకు బదులుగా ధనరూపంలో చలామణీ అవుతున్నాయి. అవే ఇప్పుడు మనకి విరివిగా వ్యాప్తిలో వున్న నోట్లు.

క్రమంగా బంగారు నాణేలకి బదులుగా నోట్లు అచ్చుకావడమే కాకుండా రూపాయలు, అర్ధరూపాయలు, పావలాలలో వెండిపాలు తగ్గించినట్లే, కాన్లలో రాగిపాలు తగ్గించడంతోబాటు పెద్దసైజు అర్ధణాలు, డబ్బులు, ఏగాన్లు, అరకాన్లు, ఠోలీలు ముద్రించడం మానివేశారు. రెండవ ప్రపంచ యుద్ధం మూలంగా వస్తువుల ధరవగ్గు పెరిగిపోయి దమ్మిడీకి ఉపయోగం లేక క్రమేణా కానరాలేదు. అప్పుడే మనకి కన్నంకాన్లు కూడా వచ్చాయి.

ఇలా కాలక్రమానుగతంగా అనేకరూపాలుగా మారిన మన నాణేల చరిత్రలో ఈ ఏప్రియల్ 1 వ తేదీ నుంచి దశాంశపద్ధతి నాణేలు చలామణీలోకి రావడంతో నూతనాధ్యాయం ప్రారంభమైంది. "భారవి" ★

చనిపోయేముందర హంసలు
పాటపాడి పోతాయందురు.
పాటపాడుముందే దయతో
చనిపోతే మంచిది కొందరు!

—శామ్యూల్ టేలర్ కోల్రిడ్జ్.

★ వారానికి కోటి నాణాలు ★

(31-వ పేజీ తరువాయి)

ఇక్కడే తయారుచేయించుకుంటున్నాయి.

ఈ టంకసాల ప్రభుత్వానిదే అయినా వీరు ఇతరదేశాలనుండి వచ్చే ఆర్డర్లు తీసుకుని నాణాలు తయారుచేస్తారు. ఈ పరిశ్రమ బ్రిటన్ ఎగుమతి వ్యాపారాభివృద్ధికి ఉన్నంతలో కొంత దోహదం చేస్తున్నది.

★

బ్రిటిష్ నాణాలూ, వాటి నాణ్యాలూ

(ఫ్రాంక్ పేజ్)

ఇంగ్లాండ్‌లో తొలిసారిగా చెలామణిలోకి వచ్చిన నాణాలు బంగారంతో తయారయేవి. క్రీస్తుపూర్వం తొలి శతాబ్దం పూర్వార్ధంలో ఆదేశం ఉత్తర దక్షిణ ప్రాంతాలలో చిన్నచిన్న రాజ్యాలు కట్టుకున్న వివిధ జాతుల పాలకులు వాటిని జారీ చేసేవారు. వాటిమీద అప్పట్లో అక్షరాలు బొమ్మలూ ఉండేవికావు. క్రీస్తు పూర్వం 43 వ సంవత్సరంవరకూ ఇవి ఇలాగే ఉండేవి. దరిమిలా రోమన్‌లు బ్రిటన్‌మీద దండెత్తడం జరిగింది. అప్పట్లో ఈ చిన్న పరిపాలకులు, రోమన్‌ల ఫక్కీలో నాణాలు తయారుచేసి వాటిమీద తమ రాజ్య చిహ్నాలు ముద్రిస్తూ వచ్చారు. ఇలా కనీసం తొమ్మండుగురు జారీచేసినట్లు చెబుతారుగాని ఆరుగురి పేరిట వచ్చిన నాణాలు మాత్రమే ఇప్పటికి లభించాయి.

రోమన్‌ల హయాంలో వారి నాణాలే బ్రిటన్ అంతటా చెలామణీ అయ్యాయి. ఆ కాలంలో, బ్రిటన్‌లో నాణాల తయారీ అంతరించిందనవచ్చు. ఎటొచ్చీ క్రీస్తుశకం 287-337 సంవత్సరాలమధ్య రోమన్ టంకసాలలు మొదట కాల్‌చెస్టర్‌లోనూ, తరవాత లండన్‌లోనూ పనిచేశాయి.

'దేవదూత' నాణెం

రోమనులు వైగొలగిపోయి, ఆంగ్లో శాక్సన్ రాజ్యాలు నెలకొనేలోగా, ఆ మధ్యకాలంలో కొన్ని రాగినాణాలు వాడకంలోకి వచ్చాయి. సువర్ణనాణాలు తయారైనది స్థూలంగా క్రీ. శ 600 సంవత్సరంలో అనవచ్చు. లండన్, కాంటర్‌బరీ నగరాలలో వాటిని తయారుచేసేవారు. కాని ఇంగ్లీషు నాణాలశకం అన్నది వాస్తవానికి ఎనిమిదవ శతాబ్దంలో ఆరంభం అయిందనాలి మెర్సియారాజు 'అఫా' లండన్ రాజధానిగా పరిపాలన సాగిస్తూ, వెండిపెన్నీ నాణాలు జారీచేశాడు. వాటిమీద తనబొమ్మను అచ్చువేయించాడు. ఆతరువాత ఐదువందల ఏళ్ళవరకూ అదొక్కటే ఇంగ్లాండ్‌లో జారీ అయిన నాణెం. 12 వ శతాబ్దంలో రాజుల సంఖ్య, తద్వారా టంకసాలల సంఖ్య పెరిగింది. ఆ శతాబ్దం సగం గడిచేసరికి, రెండవ హెన్రీరాజ్యానికివచ్చి చాలా టంకసాలలను మూసి వేయించాడు. 14 వ శతాబ్దంలో 'నోబుల్' (ప్రభువు) అనే నాణెం, తరువాతి శతాబ్దంలో 'ఏంజెల్' (దేవదూత) అనే మరో నాణెం, వచ్చాయి దరిమిలా సావరిన్ (సార్వభౌమ) అనే నాణాన్ని ఏడవ హెన్రీ జారీ చేశాడు. ఈ సావరిన్ నాణెమే అగ్రస్థానం ఆక్రమించింది. అష్టమహెన్రీ, క్రౌన్ అనే బంగారు నాణాన్ని, అతని కుమారుడు ఆరవ ఎడ్వర్డ్ వెండి క్రౌన్‌ను ప్రవేశపెట్టారు. ఎడ్వర్డ్ ఆరు పెన్నీల, మూడు పెన్నీల నాణాలను కూడా జారీచేశాడు. ఎలిజబెత్ రాణి కాలంలో మూడు అరపెన్నీల నాణెం, మూడు ఫార్తింగుల నాణెం వచ్చాయి.

ఆధునిక నాణాలు

ఆధునికం అని చెప్పతగ్గ శ్రేణి నాణాలు రెండవ చార్లెస్ (1662) కాలంలో వచ్చిన గినీ అనే బంగారునాణెంతో ప్రారంభంఅయ్యాయి. అప్పుడు గినీ విలువ 20 షిల్లింగులే. ఈనాడు గినీ నాణెం అనేశాల్తీ ఏదీ లేదుకాని, గినీకి 21 షిల్లింగుల చొప్పున లెక్క చెప్పుకుంటూ, బ్రిటిష్ ప్రజలు లావాదేవీలు సాగిస్తున్నారు.

మూడవజార్జి ప్రభుపుకాలంలో రాగి పెన్నీ నాణెం వచ్చింది.

నేటి నాణాలూ, నాణ్యాలూ

ఈనాడు చెలామణీలో ఉన్నవి ఎనిమిది నాణాలు. అవి: 1. అర్ధక్రౌను (రాగి, నికల్ మిశ్రమం, విలువ $2\frac{1}{2}$ షిల్లింగులు) 2. ఫ్లారిన్ (రెండు షిల్లింగులు) 3. షిల్లింగ్ (12 పెన్నీలు) 4. సిక్స్‌పెన్స్ (ఆరు పెన్నీలు) 5. మూడు పెన్నీల నాణెం (మన అణాలా పన్నెండు ముఖాలు) 6. పెన్నీ (కంచు నాణెం) 7. అర్ధపెన్నీ 8. ఫార్తింగ్.

పూర్వపు వెండి నాణాల సానే 75 పాళ్లు రాగి, 25 పాళ్ళు నికెల్ కలిపి నాణాలు చేయడానికి అనుమతిస్తూ పార్లమెంటు 1946 లో ఒక చట్టం చేసింది. ఈ విధంగా మిగిల్చిన వెండిని, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా ఇచ్చిన అప్పు తీర్చడానికి వినియోగించారు.

లండన్ టవర్‌లో 5 వందల ఏళ్ళపాటు ఉన్న టంకసాలను 150 ఏళ్ళనాడు వేరుచేసి, దాని చేరువగా నిర్మించిన భవనంలో నెలకొల్పారు. ఖజానా మంత్రే టంకసాలకు అధిపతి కాని, దైనందినీయాలు అన్నీ మరొక సహోద్యోగి నిర్వహిస్తాడు.

నాణాల తయారీలో సుత్తీ ఉలీ ఉపయోగించడం మాని, యంత్రాలపై అచ్చుపోసే పద్ధతి 300 ఏళ్ళనాడు ప్రారంభం అయింది. ఈనాడు అక్కడ రోజుకు 11 లక్షల నాణాలు తయారవుతున్నాయి. ★

(బ్రిటిష్ సమాచారశాఖ సౌజన్యంతో)

మెప్పుకోసం

★

(46-వ పేజీ తరువాయి)

మద్రాసు అలాంటి మహాపట్టణాలలో చాలమటుకు ఫరవాలేదుగాని మఫ్యరకం పూళ్లున్నాయి చూశారూ? అలాటి చోట్ల చాలమందికి ఇలాటిపనులు చెయ్యడం అంటే మొహమాటం. మధురలో మేం వుండేటప్పుడు మాయింటిపక్కనే, మా నాన్నగారి ఆఫీసులో పనిచేస్తున్న తమిళుడొకాయన,ఆయనభార్యవుండేవారు. పిల్లలు లేరు. భార్యకి ఒకసారి జ్వరంవచ్చింది. మా యింట్లో కొళాయికివచ్చి నీళ్లుతీసుకు వెళ్లాలి. పాపం ఆయనే వంటచేసుకుని పొద్దున్నే బిందెతో కొళాయిదగ్గర నీళ్లుపట్టి తీసుకు వెళ్లేవాడు.

మా నాన్నగారు చూసి పోనీ మాఅమ్మాయి లెవర్నైనా పంపిస్తాను నువ్వెందుకయ్యా నీళ్లుతీసుకెళ్లడం అని చెప్పినా వినలేదు. పైగా "ఎన్నాసార్, మనపని మనకి కష్టమేమి? ఒణ్ణుం పరవాయిల్లై" అనేసేవాడు.

మాకు చాల ఆశ్చర్యంగా వుండేది. ఇంకా వరన్నా అయితే సాటివాడిముందు ఇటువంటిపనులు చేసుకోవడం చాల నీచమనుకుంటారు. ఇటువంటి సంకుచిత మనస్తత్వాలు వదిలిపెట్టేనాడే మనం బాగుపడతాం. ఈ లోకంలో ఇంకొకరి మెప్పుకోసం యెంతకని బతగ్గలం? ఎవరేనా చూసి వెక్కిరిస్తారేమోనని బాధపడటం మూర్ఖత్వం. ఎవరేనా వెక్కిరిస్తే ఒకటే సమాధానం. మన పని మనం చేసుకోవడం యేమీ నీచమైనది కాదే? ఇందులో తప్పేముంది? ★

కుమారి ఎం. ఎస్. రోజా,

(వెల్లూరు).

★ సెప్టెంబరు వీరులు ★

[28 వ పేజి తరువాయి]

అప్పుడు చావుదెబ్బలుతినాలి – నాశరీరం దెబ్బలికి అసలు వోర్చుకోలేదు; పైగా బోలెడు డబ్బు సంపాయించిన తరవాత కూడా మర్యాదగా బ్రతుకుదామన్నా, తెల్సున్నవాళ్ళు వూరుకోరు; అది మహా దారుణం – ఛా! యిదేంలాభంలేదు-అయినా యింత తక్కువమందిని ప్యాసుచేసారేమిటీ; బహుశా రేపో, యెల్లుండో యింకో లిస్టు వస్తుందేమొ అనుకున్నా.

రేడియోలో వార్తలు వస్తున్నాయి; కొత్తలిస్టు విషయం చెపుతారని ఆశగా చూసాను; కాని "...వార్తలు సమాప్తి"అని చల్లగా జారుకున్నాడు; అసలు ప్యాసవలేదు, ప్యాసవలేదు అని యేడవటమే కాని, అస్సలు పేపర్లో యేదేనా రాస్తేనా? ఇంక వారం రోజులు పరీక్షలు వున్నాయనగా పుస్తకాలు దులపటం-ఆరోజు రాత్రి తెల్లారేవరకూ ఆ అట్టనుంచి యీ అట్టవరకూ గబగబా తిరగేసి ప్రొద్దున్నే పరీక్షరాస్తే, ఆ దిద్దేవాడు మటుక్కు యేంచూసి మార్కు లేస్తాడూ,-ఇలాకాదు, యీసారి మార్చికి రేపటినుంచే శ్రద్ధగా చదివితే సులువుగా దాటెయ్యొచ్చు. యీలోపుగా యేదైనా వుద్యోగమూ చూసుకోవచ్చు. యింటిదగ్గరుండే చూసుకోలేనివాళ్లేం, పారిపోయి మటుకు యేంచెయ్యగలం? మళ్లీ వెనక్కిరావటంతప్ప; యీసారి యేమైనాసరే గట్టిగా దవాలి; యీ ఛాన్సుకూడా చూసి, అప్పుడూపోతే యింక యింట్లో వుండకూడదు; అని సమాధానపడ్డాను.

అయినా యివాళే రావాలీ; యెప్పుడూ నవంబరు మొదటివారంలో వచ్చేవి; యింత త్వరగా వస్తాయని యెవరూ అనుకోనివుండరు; ముఖ్యంగా నేను అనుకోలేదు. ఈమాత్రం భాగ్యానికి యింకో పదిరోజులు ఆగివస్తేమాత్రం యేంమునిగిపోయింది యీ నాలుగు రోజులైనా హాయిగావుండకుండా చెయ్యాలని కానీ, అసలు రిజల్ట్సు కావాలని యేడ్చింది యెవరు!

ఇంతలోనే సాహిత్యాభిరుచి గుర్తుకి వచ్చింది; సాహిత్యంలో అభిరుచి వుందనిపించుకోటానికి, యెన్ని పుస్తకాలు చదివాను! పెద్దపెద్ద రచయితల్ని, వాళ్ళ అనుభవాలు, రచనలు తెల్సుకోగల్గటానికి యింత తీరిక యిచ్చింది యీ సెప్టెంబర్లే కదా? ఈ ఖాళీసమయాల్లో యెంతమంది సాహితీవేత్తలుగా, రాజకీయ నాయకులుగా, కళాజీవులుగా మారిపోయారు; నాతోనే సెప్టెంబరు మార్చీలకి వస్తున్న మిత్రులు మెస్సర్సు రావు, రాజు, మూర్తి, వాలీ, శర్మలు యెంతెంత మంచి మంచి అర్థంకాని వుద్యోగాల్లో వుంటున్నారు. మిస్టరు. రావు "దండోరా" సినీమా పత్రికలో "సబు అసిస్టంటు జాయింటు యెడిటరుగా" మద్రాసులో వుంటున్నానుఅన్నాడు. వాలి గవర్నమెంటు స్వంతవిషయాల "అండరుసెక్రటరీ" అనిగుర్తు; రాజు ఆత్మహత్యాలకమిటీ "సలహాదారుడు"గా వుంటున్నాడుట; సుబ్బులుమామచెపుతూవుంటాడుగా-వాళ్లక్లాసుమేటు A. K. కి;—అసలుపేరు ఆంబటి కామయ్యట; రేడియోలో ఎనిమిదివందలు యిస్తారుట-అతను ప్రతీక్లాసు రెండు మూడేళ్ళకు తక్కువ కాకుండా చదువుతూ వచ్చేడుట-యింటరు ప్రాక్టికలు పరీక్షపేపరులో యెదురుగుండా ప్రయోగంచేస్తున్న అమ్మాయి ముక్కుమీద మచ్చపైన పద్యంరాసి యిచ్చేడుట,-దానికి విశ్వకళాపరిషత్తువారు మూడేళ్ళు డిబారుచేసాము అన్నారుట. కాని దానికే రేడియోవారు పద్యరచన పోటీల్లో అతన్ని ఫస్టుగా సెలక్టుచేసి, వుద్యోగంకూడా యిచ్చారట! – మరి, మాసుబ్బులుమామ యింటరు ఫస్టుక్లాసు; B. A లో డబులు ఫస్టుక్లాసు; అయినా B. Ed కి వెడితే మంచిదేమో అనుకుంటూ, పదేళ్లుగా కాలేజీలో ట్యూటరుగానే వుంటున్నాడు – మరయితే నేనూ చాలా సెప్టెంబర్లు చూసానుగా, పైగా ప్రపంచంలో వున్న దురాచారాలు, సంఘంలోవున్న కుళ్ళు బాగా అవగాహనచేసుకున్నాను – పరీక్షలు ముందుంచుకొనికూడా క్లాసు పాఠాలు మానేసి అనేక గ్రంథాలు తిరిగేస్తూ వుంటాను. – పైపెచ్చు నిశిత విమర్శనా జ్ఞానానికి లోటులేదు; యిదంతా చూస్తే నాకున్న అపార సారస్వతానుభవంతో ప్రపంచంలో మిక్కిలి అత్యుత్తమ వ్యంగ్యహాస్యవ్యాసరచయితగా తేలిగ్గాపేరుప్రఖ్యాతులు తెచ్చుకోవచ్చును – ఒకసారి భవిష్యత్తులోకి చూసాను-"స్వర్ణ"ని ఉత్తమ రచయితగా 'విశాల విశ్వం' సన్మానిస్తోంది; నేనూ "జై" అని లేవబోతున్నాను; "పొరుక్కట్టేస్తన్నా, బాబూ!" అన్న కేక వినిపించింది. ఒక్క సారిగా, వర్తమానంలోకి వచ్చి, యింక యింటికి వెడదాం; యీ పాటికి Father పడుకొనివుంటారు.- "సెప్టెంబరేట్లు జిందాబాద్"- "సెప్టెంబరు వీరులకే జై"-అనుకుంటూ యింటి ముఖం పట్టాను. ★

దొంగరాముడు

(20-వ పేజీ తరువాయి)

నేలకి వరగడం ఒక్కసారి జరిగాయి. వెంటనే నేను అతని చేతుల్ని అతనిబెల్టో కట్టేసి అతని జేబులోని నా పాకెట్ బుక్కుని, పదివేల రూపాయల విలువగల ఆమె ఆభరణాల్ని తీసుకుని నా జేబులో వదేసుకున్నాను. ఇలా చేయడంలో అతనిముఖం, అతని ఎడమదవడ మీది చిన్న కత్తిగాటూ నాకు స్పష్టంగా కనిపించాయి. వెంటనే ఇతను వారంరోజులక్రితం మద్రాసులో ఒక ఘోరహత్య గావించిన గోవిందు అని గుర్తు వచ్చింది. అతని ఫోటో ఒక్కసారి మాత్రమే చూడడంవల్ల ఇతన్ని ఎక్కడ చూశానా అని బాధపడ్డాకగాని గుర్తుపట్టలేకపోయాను. ఇదీ మన మంచికే అనుకొని, నాపాకెట్ బుక్కులోని ఒక కాయితం చింపి, దాంట్లో కొంచెం వ్రాసి, అతని కోటు కాలర్కి గుచ్చి, రివాల్వరు తీసికొని ఇంకో ఇరవై గజాలు నడిచాను. అక్కడ ఒక చెట్టుకి రివాల్వర్ని గొట్టంపైకి వచ్చేటట్టు కట్టేసి, అతని జేబు రుమాలు ముండి చింపిన గుడ్డపోగుల్ని ఒక పొడుగైనతాడుగాచేసి, ఒక కొసని రివాల్వర్ ట్రిగ్గరికి కట్టి రెండ కొసని నాతోపాటు తీసుకొని దిబ్బవైపు నడవడం మొదలుపెట్టాను. దిబ్బకి 20 గజాలదూరంలో ఓ చెట్టు చాటున దాక్కొని చేతిలోని కొసని గుంజేసరికి దూరాన్న రివాల్వరు పేలింది. అది పేలిన రెండునిముషాల్లో ఉరుకు లేసుకుంటూ నా ఇనస్పెక్టర్ స్నేహితులు పరుగెత్తడం చూసి, ఒక్క ఉరుకులో జీప్లో ఎక్కి పలాయన మంత్రం పఠించాను. నేను కాగితంలో వ్రాసినది ఇది.

'మిత్రులకు,'

మళ్ళీ కనిపించనందులకు క్షమించవలెను. నాకన్న ఘోరపాపాలు చేసిన గోవిందును ఇదుగో మీకు అప్పగించుచున్నాను. వాడితో తృప్తిపడండి 'ఆమె' నన్ను తన మేనత్తకొడుగ్గా చెప్పుకొన్నందుకు ఆమెకు నేను కృతజ్ఞుడను. నాకవసరం అవడంవల్ల ఆమె నగలను నేను తీసేసుకొంటున్నాను. నాకు మంచిరోజులంటూవస్తే వాటికైన సొమ్ము ఆవిడకు అందజేస్తానని చెప్తూ నన్ను క్షమించమని కోరండి. మీకు నా అభివందనలు. — దొంగరాముడు. ★

(22-పేజీ తరువాయి)

దండ : (భయంతో) అమ్మాయిగారు పైన లేరండీ!

వామ : ఎక్కడకు వెళ్లింది?

దండ : కారులో ఎక్కడికో వెళ్ళేరండి.

వామ : ఓహో! అయితే యిప్పుడే వస్తుందిలే! ఆ మాట ముందే చెప్పితగులడ కూడదూ?

దండ : ఒక్కరూ వెళ్లలేదండి.

వామ : స్నేహితురాలెవరితోనైనా వెళ్లిందా?

దండ: లేదండి. తుషార్ బాబుగారితో...

వామ : (ఆశ్చర్యంతో) కిశోర్‌తోనా! (కోపంతో) వాడు యిక్కడకు మళ్లీ ఎందుకు వచ్చాడు?

దండ : నాటకం కంపెనీ వోరు బతిమాలి తీసుకొచ్చారండి.

వామ : అసలు యీ అనర్థాలన్నిటికీ నాటకం కంపెనీ కారణం. మేనేజరుగారికి బుద్ధిలేదు. యీ హాలు, వాళ్లకు ఎందుకు అద్దెకివ్వాలి?

(అటూ యిటూ అశాంతితో తిరుగుతూ) యింతకూ వాళ్లిద్దరూ ఎక్కడికివెళ్ళారురా?

దండ : (మరింత భయంతో) అదే తెలియడం లేదు బాబూ!

వామ : (ఒక్కసారి నిశ్చేష్టుడై) ఏమిటి? ఎక్కడికి వెళ్లారో తెలియదూ?—యిక వూరుకుంటే లాభం లేదు. వాడిని వెతికి పట్టుకొని జైలులో పెట్టిస్తాను.

(తొందరగా కుడివైపు నిష్క్రమిస్తాడు వామనమూర్తి.)

దండ : (ఎడమవైపు చూస్తూ) బాబూ! జై సీతారాం బాబూ! కొంప మునిగింది.

జయ : (నేపథ్యంలోంచి) ఏం? ఏమయ్యింది?

దండ : యింకేమవ్వాలయ్యా బాబూ! అంతా అయిపోయింది. బాబుగారికి తెలిసిపోయింది. (ఎడమవైపు నిష్క్రమిస్తాడు దండపాణి. కుడివైపునుంచి కిశోర్, చిత్ర మాట్లాడుకుంటూ వస్తారు.)

కిశోర్ : (కోపంతో) మీరేం చేసినా చెల్లుతుంది. మాలాంటివాళ్ళం భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నడుచుకోవాలి.

చిత్ర : తొందరపడకు కిశోర్. జాగ్రత్తగా ఆలోచించు.

కిశోర్ : యిక ఆలోచించడానికేమీ లేదు.

చిత్ర : నామీద నీకు ప్రేమలేదా ?

కిశోర్ : ప్రేమ ! ! అది చాలా విచిత్రమైన పదం. దాని అర్థం తెలిసినవాళ్లు యీ ప్రపంచంలో ఎంతమంది వున్నారో తెలియదు.

చిత్ర : నేను సీరియస్‌గా అడుగుతున్నాను. నువ్వు వేదాంతంలోకి దిగకు.—మా నాన్నను ఒప్పించే పూచీ నాది.

కిశోర్ : మిమ్మల్ని పెళ్ళి చేసుకునే అర్హత నాకెంతమాత్రం లేదు.

చిత్ర : ఆవేశాన్ని విడిచి ఆలోచించు ! నాకు కావలిసినంత ఆస్తి వుంది. నువ్వు కష్టపడవలిసిన అవసరంలేదు. సుఖంగా జీవితం సాగించవచ్చు.

కిశోర్ : మేం దరిద్రులమైనప్పటికీ మాకు సంస్కారం, నీతి వున్నాయి. ఒకరి సంపాదనమీద, ఒకరి ధనంమీద ఆధారపడి జీవించేంతటి పనికిమాలినవాణ్ణికాను.

చిత్ర : నువ్వు చాలా తీవ్రంగా మాట్లాడుతున్నావ్ కిశోర్.

కిశోర్ : వృథా వాగ్వాదం దేనికి ? నన్ను విడిచిపెట్టండి.

చిత్ర : నువ్వు కనిపించకపోతే ఏం జరిగేదో తెలియదు. కాని నువ్వు కనిపించావు. నిజం చెబుతున్నాను కిశోర్. నిన్ను చూసినదిమొదలు నా మనసు మనసులో లేదు. నీ కోసం.............

కిశోర్ : (కోపంతో మధ్యలో అందుకొని) నాకోసం మీ జీవితం ధారపోస్తానంటారు. అంతేకదూ ? నామాట వినండి. మీకు ప్రపంచంతో పరిచయం చాలదు. యీ ప్రపంచంలో మనిషికీ మనిషికీ మధ్య దృఢమైన కంచుగోడలు వున్నాయి. వాటిని నిర్మూలించేవరకూ ఒక వర్గంలోని మనిషి మరో వర్గంలోని మనిషికేసి తేరిపారచూడలేడు. వృథాగా కష్టాలకు గురికావద్దు. మీ తండ్రి మనకలయికను తన జీవితంలో హర్షించడు. యిక గడిచిపోయిన గాథను విస్మృతించండి. మీ భవిష్యజ్జీవితాన్ని సుఖమయం చేసుకోండి. యిక నన్ను మరిచిపొండి. (ముందుకు నడుస్తాడు.)

చిత్ర: (బిగ్గరగా) కిశోర్! (కిశోర్ ఆగి ఎందుకన్నట్లు చూస్తాడు.) నేను ఒకమాటడుగుతాను. కనీసం దానికి జవాబుచెప్పి వెళ్ళిపో. సంతోషిస్తాను. నా యీ ఒక కోరికా తీర్చు.

కిశోర్ : (ఆమెకేసి జాలిగాచూస్తూ) ఏమిటది?

చిత్ర: (అతని కళ్లలోకి చూస్తూ) నీకు నామీద అనురాగం వుందా?

కిశోర్ : (బాధతో ముఖం ప్రక్కకుతిప్పి) వుంది చిత్రా...యిక గతాన్ని మరిచిపో!

(కిశోర్ ముందుకు నడుస్తూవుంటాడు. ఎడమవైపునుంచి నిరంజన్, దినకర్, ఆనంద్, జయరాం, దండపాణి ఒకరి వెనుక ఒకరు వరుసగా ప్రవేశిస్తారు. అందరి చేతులలోను సూట్‌కేసులు వుంటాయి.)

నిరం: కిశోర్ !

కిశోర్: (ఆగి) మీరంతా ఎక్కడికి బయలుదేరారు?

నిరం: యింకా ఒక నిశ్చయానికిరాలేదు. నువ్వు చెప్పకుండా పోతున్నావ్ ఎక్కడికి?

కిశోర్ : నేనూ ఒక నిశ్చయానికి రాలేదు.

దండ: నేను నా ఉద్యోగానికి రాజీనామా యిచ్చేసి నాటకం కంపెనీలో కలిసిపోయాను.

దినకర్: అధైర్యపడకండి. దట్టమైన నీలి తెరలను తొలగించుకొని ముందుకు పదండి. తెల్లని శాంతిపురం చేరేవరకు విరామం లేకుండా నడవండి. రేపటి శాంతిపురంలో మీ ఆశలు, కోరికలు నెరవేరతాయి. మనిషికీ మనిషికీ మధ్యగల గోడలు మాయమౌతాయి.

(అందరూ కుడివైపు నిష్క్రమిస్తూ వుంటారు. చిత్ర సజలనేత్రాలతో వాళ్ళకేసి చూస్తూ వుంటుంది—తెర.) ★

[అయిపోయింది]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.